శ్రీమద్రామాయణము

యుద్ధ కాండము

(రెండవ భాగము)

సంస్కృత మూలము

భగవాన్ వాల్మీకి మహర్షి

తేటతెలుగులో

మొదలి వెంకట సుబ్రహ్మణ్యం

2-31, చైతన్యపురి,

హైదరాబాదు 500060

ఫో: 24048104

సెల్: 9391134792

శ్రీమద్రామాయణము
యుద్ధకాండము
ఏబది మూడవ సర్గ.

రాక్షసరాజు రావణునికి ధూమ్రాక్షుని దారుణ మరణం గురించి తెలిసింది. నిర్ఘాంత పోయాడు. కోపం వచ్చింది. బుసలు కొట్టాడు. వజ్రదంష్ట్రుడు అనే రాక్షసుని పిలిపించాడు.

"నీవు మహావీరుడవు. ఎన్నో యుద్ధములలో పాల్గొన్నావు. నీవు కావలసినంత సైన్యమును తీసుకొని వెళ్లి, రాముడిని, లక్ష్మణుడిని, సుగ్రీవుడిని చంపి తిరిగిరా." అని అన్నాడు రావణుడు.

రావణుని ఆదేశము ప్రకారము కోట్లకొలది రాక్షస సైన్యముతో వజ్రదంష్ట్రుడు వానరుల మీదికి యుద్ధానికి బయలు దేరాడు. అతని సేనలో గజములు, అశ్వములు, గాడిదలు, ఒంటెలు, రథములు ఉన్నాయి. వాటిని ఎక్కిన రాక్షసులు మహా బలవంతులు పరాక్రమవంతులు. వజ్రదంష్ట్రుడు కూడా ఒక మహాధనుస్సును చేత ధరించి యుద్ధానికి బయలుదేరాడు. ఆయన వెంట అశేష రాక్షస సైన్యము బయలుదేరింది.

వారందరూ దక్షిణ ద్వారము నుండి బయటకు వచ్చారు. అక్కడ అంగదుడు తన సేనతో ఉన్నాడు. రాక్షసులకు దుశ్శకునములు గోచరించాయి. ఈ దుశ్శకునములను చూచి వజ్రదంష్ట్రుడు కలవర పడ్డాడు. అయినా ధైర్యంతో ముందుకు నడిచాడు. దక్షిణ ద్వారము

నుండి బయటకు వచ్చిన రాక్షస సైన్యమును వానరులు చుట్టు ముట్టారు. రాక్షసులకు వానరులకు ఘోరయుద్ధము జరిగింది. రాక్షసుల సైన్యములు, వానర సైన్యములు సమానంగా నశించాయి. వాటి శరీరముల నుండి కారిన రక్తంతో రణభూమి అంతా రక్తసిక్తమయింది. ఒకరిని మించి ఒకరు యుద్ధం చేస్తున్నారు.

వానరులు వృక్షములు పర్వత శిలలను ప్రయోగిస్తుంటే, రాక్షసులు ధనుర్బాణములు వాడుతున్నారు. కొంత మంది రాక్షసులు తన ధనుస్సులను కిందపడవేసి వానరులతో ముష్టియుద్ధానికి తలపడ్డారు. వానరులు మాత్రము రాళ్లతోనూ వృక్షములతోనూ రాక్షసులను హతమారుస్తున్నారు. వజ్రదంష్ట్రుడు ధనుర్బాణములను ధరించి అపర యముని వలె యుద్ధంచేస్తున్నాడు. రాక్షససేనలు కూడా అధిక సంఖ్యలో వానరులను సంహరిస్తున్నారు.

అది చూచిన అంగదుడు కోపంతో ఊగిపోయాడు. రాక్షసులను అందరినీ ఊచకోత కోసాడు. దొరికిన వాడిని దొరికినట్టు చంపాడు అంగదుడు. అంగదుని చేతిలో చిక్కిన రాక్షసులు ప్రాణాలతో తప్పించుకోవడం లేదు. మొదలు నరికిన చెట్లమాదిరి కూలి పోతున్నారు. అంగదుని ధాటికి రాక్షస సేనలు తట్టుకోలేకపోతున్నాయి.

శ్రీమద్రామాయణము

యుద్ధకాండము ఏబది మూడవ సర్గ సంపూర్ణము

ఓం తత్సత్ ఓం తత్సత్ ఓం తత్సత్

యుద్ధకాండము

ఏబది నాలుగవ సర్గ.

వానర నాయకుడు అంగదుని విజృంభణ, రాక్షస సైన్యము అంతకంతకూ తగ్గిపోవడం గమనించాడు వజ్రదంష్ట్రుడు. అతనిలో క్రోధము తారస్థాయికి చేరింది. తన ధనుస్సును ఎక్కుపెట్టి వానర సేనల మీద శరవర్షము కురిపించాడు. వజ్రదంష్ట్రుని అండచూచుకొని రాక్షసులు కూడా విజృంభించారు. ఇది చూచిన వానరులు చేతికి అందిన పర్వతశిలలను పెకలించి రాక్షసులమీదికి విసిరి, వారిని నుగ్గునుగ్గుచేస్తున్నారు.

రాక్షసులు వివిధ ఆయుధముల తోనూ వానరులు వృక్షములు, పర్వతశిలలతోనూ యుద్ధం చేస్తున్నారు. రాక్షసులు ప్రయోగించిన ఆయుధములను కాచుకుంటూ, పర్వతశిలలనూ, వృక్షములనూ రాక్షసుల మీదకు విసురుతున్నారు వానరులు. ఇరుపక్షములలో ఉన్న సైనికులకు తలలు తెగిపోయాయి. కాళ్లు చేతులు తెగిపోయాయి. వారి శరీరముల నుండి కారిన రక్తము ఏరులైపారుతూ ఉంది. ఆ శరీరములను తినడానికి కాకులు గద్దలు ఆకాశంలో తిరుగుతున్నాయి.

ఆ దృశ్యములను చూచిన పిరికి వారికి గుండె ఆగిపోవడం ఖాయం. అంత ఘోరంగా ఉంది రణరంగము. కాని ఎక్కువగా రాక్షససైన్యమునకే నష్టం జరిగింది. ఇది చూచిన వజ్రదంష్ట్రుడు తానే స్వయంగా వానర సేనను ఎదుర్కొన్నాడు. ఒక్కొక్క

బాణానికి ఐదుగురు, పదిమంది, వానరులను చంపుతున్నాడు. వానరుల తలలు బంతుల మాదిరి ఎగురుతున్నాయి.

ఇది చూచిన వానరులు అంగదుని వద్దకు పరుగెత్తారు. అంగదుడు విషయం తెలుసుకొని తానే స్వయంగా వజ్రదంష్ట్రుని ఎదుర్కొన్నాడు. ఇద్దరికీ ఘోరంగా యుద్ధం జరిగింది. వజ్రదంష్ట్రుడు తన బాణములతో అంగదుని శరీరం తూట్లు పడేట్టు కొట్టాడు. అంగదుడు కోపించి వజ్రదంష్ట్రుని మీదకు ఒక వృక్షాన్ని విసిరాడు. ఆ వృక్షాన్ని వజ్రదంష్ట్రుడు తన బాణములతో తుత్తునియలు చేసాడు. అంగదుడు ఒక పెద్ద పర్వతమును పెకలించి వజ్రదంష్ట్రుని మీదికి విసిరాడు. అది చూచిన వజ్రదంష్ట్రుడు గద తీసుకొని రథము నుండి కిందికి దుమికాడు. అంగదుడు విసిరిన పర్వతము వజ్రదంష్ట్రుని రథమును నుగ్గునుగ్గు చేసింది.

వజ్రదంష్ట్రుడు తన గదతో అంగదుని గుండెలమీద మోదాడు. తరువాత అంగదుడు, వజ్రదంష్ట్రుడు ఒకరితో ఒకరు ముష్టియుద్ధము చేసారు. అంగదుడు ఒక వృక్షమును పెకలించి చేత ధరించాడు. వజ్రదంష్ట్రుడు ఏమరిపాటుగా ఉన్నప్పుడు అంగదుడు ఆ వృక్షమును వజ్రదంష్ట్రుని మీదకు విసిరాడు. ఆ వృక్షము తగిలి వజ్రదంష్ట్రుడు కిందపడ్డాడు. తరువాత అంగదుడు ఒక కత్తితీసుకొని అతని తల తెగనరికాడు. వజ్రదంష్ట్రుని శరీరం రెండు ముక్కలయింది. అతని ప్రాణాలు గాలిలో కలిసిపోయాయి.

తమ నాయకుడు వజ్రదంష్ట్రుడు దారుణంగా మరణించడం చూసిన రాక్షస సైన్యము లంక వైపు పారిపోయారు. వజ్రదంష్ట్రుని చంపిన అంగదుని వానరనాయకులు అంతా ప్రశంసించారు.

శ్రీమద్రామాయణము

యుద్ధకాండము ఏబది నాలుగవ సర్గ సంపూర్ణము

ఓం తత్సత్ ఓం తత్సత్ ఓం తత్సత్

యుద్ధకాండము

ఏబది ఐదవ సర్గ.

తాను పంపిన వజ్రదంష్ట్రుడు అంగదుని చేతిలో మరణించాడు అన్న వార్త రావణునికి తెలిసింది. వాడిని పంపినంత సేపు పట్టలేదు వాడు చచ్చాడు అన్న వార్త వినడానికి. మరొకడిని పంపడం కన్నా వేరే మార్గము కనిపించడం లేదు రావణునికి. రావణుడు వెంటనే అకంపనుడు అనే సేనానాయకుడిని పిలిపించాడు.

అకంపనుడు మహాయోధుడు. వాడికి యుద్ధము లేకపోతే నిద్రపట్టదు. రామలక్ష్మణులను, సుగ్రీవుడిని అకంపనుడు చంపగలడు అనే విశ్వాసము రావణునికి ఉంది. అకంపనుడి పరాక్రమం ముందు దేవతలు కూడా నిలువలేరు. అందుకని ఈసారి రామలక్ష్మణులను చంపే బాధ్యతను అకంపనుడికి అప్పగించాడు రావణుడు. రావణుని ఆజ్ఞను శిరసావహించిన అకంపనుడు తన అధీనంలో ఉన్న రాక్షస

సైన్యమును యుద్ధమునకు సిద్ధం చేసాడు. వారు రకరకాలైన ఆయుధములు ధరించి అకంపనుడి వెంట యుద్ధమునకు బయలుదేరారు.

అకంపనుడు తన రథమును ఎక్కి సైన్యమును ముందుండి నడిపించాడు. కాని ఎందుకో అకంపనుడి రథమునకు కట్టిన గుర్రములు దీనంగా కదులుతున్నాయి. దానికి తోడు అకంపనుడి ఎడమ కన్ను అదిరింది. ఎన్నో అపశకునములు కనిపించాయి. కాని అకంపనుడు తన పరాక్రమాన్ని నమ్ముకున్నాడు. ఈ అపశకునములను లెక్కచేయలేదు. కదనరంగానికి బయలుదేరాడు.

రాక్షస సేనలు అకంపనుడి నాయకత్వంలో రావడం చూచి వానరులు కొంచెం భయపడ్డారు. కాని అంతలో తేరుకొని రాక్షసులతో తలపడ్డారు. వానరులు రాక్షసులు సమ ఉజ్జీలే. ఒకరికి ఒకరు తీసిపోకుండా యుద్ధం చేస్తున్నారు. వానరులు రాక్షసులు ఒకరితో ఒకరు యుద్ధం చేస్తుంటే వారి పాదఘట్టనలకు దుమ్ము పైకి లేచింది. ఆ దుమ్ములో ఎదుటి వారు కూడా కనపడటం లేదు. ఆ కారణంగా ఒక్కోసారి రాక్షసులను రాక్షసులు, వానరులను వానరులే చంపుకుంటున్నారు. వారి రక్తంతో తడిసిన యుద్ధభూమి అంతా బురద బురదగా మారింది.

వానరములు వృక్షములతోనూ, పెద్ద పెద్ద శిలలతోనూ, రాక్షసులు గదలు, పరిఘలు, తోమరములతోనూ, వానరులు తమ బాహువులతోనూ తమ శత్రువులను చంపుతున్నారు. రాక్షసులు తమచేతిలో ఉన్న ఆయుధములతో వానరులను కొట్టి చంపుతున్నారు.

అకంపనుడు కూడా వానరులను ఊచకోత కోస్తూ రాక్షస సేనలకు ఆనందం కలిగిస్తున్నాడు.

వానరులు కూడా పెద్ద పెద్ద శిలలను వృక్షములను రాక్షసుల మీదికి విసిరి వారిని నుగ్గు నుగ్గు చేస్తున్నారు. కుముదుడు, నలుడు, మైందుడు మహా వేగంతో కదులుతూ రాక్షసులను తునుమాడుతున్నారు. ఆ ప్రకారంగా వానరులకు రాక్షసులకు ఘోరంగా యుద్ధం జరుగుతూ ఉంది.

శ్రీమద్రామాయణము
యుద్ధకాండము యాభైఐదవ సర్గ సంపూర్ణము
ఓం తత్సత్ ఓం తత్సత్ ఓం తత్సత్

యుద్ధకాండము
యాభై ఆరవ సర్గ.

వానర వీరులు రాక్షస సేనలను ఊచకోత కోస్తూ ఉండడంతో అకంపనుడికి కోపం వచ్చింది. దనుష్టంకారము కావించి తన సారథితో ఇలా అన్నాడు. "ఓ సారథీ! అక్కడ ఆ వానర వీరులు మన రాక్షస సేనలను చంపుతున్నారు. కేవలము ఏ ఆయుధమూ లేకుండా చెట్లను, బండరాళ్లను ఉపయోగించి మన వాళ్లను నుగ్గు నుగ్గు చేస్తున్నారు. మన రథమును అక్కడకు పోనివ్వు." అని అన్నాడు. వెంటనే అకంపనుడి సారథి రథమును వారి వంకకు పోనిచ్చాడు.

అకంపనుడు తన ధనుస్సునుండి బాణములను వానరుల మీద వర్షము వలె కురిపిస్తున్నాడు. అకంపనుడి శరముల ధాటికి

తట్టుకోలేక వానరులు పారిపోతున్నారు. దూరంనుండి ఇదంతా చూచాడు హనుమంతుడు. వెంటనే అకంపనుడు యుద్ధం చేసే చోటికి వెళ్లాడు హనుమంతుడు. హనుమంతుడు రావడం చూచిన వానరులు, ధైర్యం తెచ్చుకొని హనుమంతుడి చుట్టు చేరారు. హనుమంతుని చూడగానే వారి బలం రెట్టింపు అయింది. ఇది చూచిన అకంపనుడు హనుమంతుని మీద శరవర్షము కురిపించాడు. కాని హనుమంతుడు తన శరీరములో గుచ్చుకుంటున్న బాణములను లెక్కచేయడం లేదు. అకంపనుడిని ఎలా చంపడమా అని ఆలోచిస్తున్నాడు.

హనుమంతుడు పెద్దగా అరుస్తూ వికటాట్టహాసం చేస్తూ అకంపనుడి మీదికి వెళ్లాడు. అకంపనుడి మీదికి దూకుతున్న హనుమంతుడు అగ్నిగోళము మాదిరి ఉన్నాడు. పక్కనే ఉన్న ఒక కొండను పెకలించాడు. దానిని గిరా గిరా తిప్పుతూ అకంపనుడి మీదికి వెళ్లాడు. ఇది చూచిన అకంపనుడు అర్ధచంద్రాకృతిలో ఉన్న బాణములతో ఆ కొండను చీల్చాడు. అది చూచిన హనుమంతునికి కోపం వచ్చింది. అటు ఇటు చూచి ఒక పెద్ద మద్దిచెట్టును కూకటి వేళ్లతో సహా పెకలించాడు. దానిని తన చేతులతో గిరా గిరా తిప్పాడు. ఆ మద్దిచెట్టుతో హనుమంతుడు రాక్షసులను, వారి రథములను, సారథులను, ఏనుగులను, హయములను చావగొడుతున్నాడు. చేతిలో గద పట్టుకొని ఉన్న యముని మాదిరి హనుమంతుడు తన చేతిలోని మద్దిచెట్టుతో రాక్షసులను సంహరిస్తున్నాడు. ఏ రాక్షసుడు కూడా హనుమంతుడి ఎదుట పడటానికి సాహసించడం లేదు. పక్కకు తిరిగి పారిపోతున్నారు.

అది చూచిన అకంపనుడు బిగ్గరగా కేకలు పెట్టాడు. హనుమంతుడి మీద పదునాలుగు వాడి అయిన బాణములను ప్రయోగించాడు. ఆ బాణములు హనుమంతుని శరీరాన్ని చీల్చాయి. నారాచ బాణములు హనుమంతుని శరీరం నిండా గుచ్చుకున్నాయి. హనుమంతుడు మరొక వృక్షమును పెకలించి చేతిలో ధరించి, దానితో అకంపనుడి తలమీద బలంగా మోదాడు. ఆ దెబ్బకు తట్టుకోలేక అకంపనుడు నేల మీద పడి గిలా గిలా కొట్టుకుంటూ మరణించాడు.

తమ నాయకుడు అకంపనుడు మరణించడం చూచిన రాక్షస వీరులు భయంతో వణికిపోయారు. పారి పోయారు. పారి పోతున్న రాక్షసులను వానరులు తరిమి తరిమి కొట్టారు. నేల మీద పడేసి ఈడ్చారు. కాళ్లతో మర్దించారు. రాక్షసులు ప్రాణాలు అరిచేతిలో పెట్టుకొని, మాటి మాటికీ వెనక్కు తిరిగి చూస్తూ, తమను వెంబడిస్తున్న వానరులను తప్పించుకుంటూ పరుగెడుతున్నారు. రాక్షసులందరూ లంకానగరంలోకి ప్రవేశించారు. అకంపనుడిని చంపిన హనుమంతుడిని వానర నాయకులు అందరూ వేనోళ్ల ప్రశంసించారు. రాముడు, లక్ష్మణుడు, సుగ్రీవుడు, విభీషణుడు హనుమంతుని అభినందించారు. ఆ ప్రశంసలను, అభినందనలను వినయంగా స్వీకరించాడు హనుమంతుడు.

శ్రీమద్రామాయణము

యుద్ధకాండము యాభైఆరవ సర్గ సంపూర్ణము

ఓం తత్సత్ ఓం తత్సత్ ఓం తత్సత్

యుద్ధకాండము
యాభై ఏడవ సర్గ.

రామలక్ష్మణులను, సుగ్రీవుడిని చంపడానికి పంపబడిన అకంపనుడు హనుమంతుని చేతిలో వధింపబడ్డాడు అన్న విషయం తెలిసిన రావణుడుకి మతిపోయింది. కోపంతో ఊగిపోయాడు. కాని అంతలోనే రావణుని ముఖంలో దైన్యం తొంగి చూచింది. ఎందుకిలా జరుగుతూ ఉంది. ఇంతమంది వీరాధివీరులు ఎందుకు మరణిస్తున్నారు అని అంతర్మధనం చేసుకున్నాడు. కాని పైకి మాత్రం గంభీరంగా ఉన్నాడు. వెంటనే మంత్రి మండలిని పిలిపించాడు. వారితో మంతనాలు జరిపాడు.

సేనలను వారి వ్యూహములను సమీక్షించడానికి రాచమందిరం లో నుండి లంకానగరంలోకి వెళ్లాడు. సర్వసైన్యాధ్యక్షుడు ప్రహస్తుని చూచాడు. అతనితో ఇలా అన్నాడు. “ప్రహస్తా! లంకానగరాన్ని శత్రువులు ముట్టడించారు. మనకు యుద్ధం చేయడం తప్ప మరోమార్గం కనిపించడం లేదు. ఇప్పటి దాకా ఒకరి వెంట ఒకరు యోధానుయోధులు యుద్ధానికి వెళుతున్నారు, అందరూ మరణిస్తున్నారు. ఒక్కరూ విజయులై తిరిగి రావడం లేదు. గెలుపుజాడ కనపడటం లేదు.

సర్వసేనాధిపతి వైన నువ్వు, నికుంభుడు, నా తమ్ముడు కుంభకర్ణుడు, నా కుమారుడు ఇంద్రజిత్తు, ఆఖరున నేను, వీరు

మాత్రమే ఈ యుద్ధము అనే మహాసముద్రమును తరించగలము అనిపిస్తూ ఉంది. అందుకని నీవు సర్వసైన్యములతో వెళ్లి వానరులతో యుద్ధము చేసి విజయం సాధించు. నీవు వస్తున్నావని తెలిసి వానర సేన దిక్కులు పట్టి పారిపోగలదు. వానరులకు స్థిరత్వము లేదు. చపలులు, వారికి యుద్ధవిద్యలో శిక్షణ లేదు. ఆటవికులు. చెట్లు బండరాళ్లు వాళ్ల ఆయుధములు. మీరు యుద్ధవిద్యలో సుశిక్షితులు. మీరు వస్తున్నారని తెలిసి వానరులు పారిపోవడం నీవే కళ్లారా చూస్తావు. వానర సైన్యము పారిపోయిన తక్షణం రాముడు, లక్ష్మణుడు నీకు లొంగిపోతారు.

మరొక మాట. యుద్ధములో జయాపజయాలు దైవాధీనాలు. నీవు జయించవచ్చు పరాజయం పొందవచ్చు. కానీ యుద్ధం చేయడం మన ప్రస్తుత కర్తవ్యము. నీవు యుద్ధానికి వెళ్లకపోతే మనకు పరాజయం తప్పదు. నిశ్చిత మైన ఫలితం కన్నా, సందేహాస్పదమైన ఫలితం మేలు కదా! ఉన్న విషయాలు అన్నీ విపులంగా చెప్పాను. ఈ సమయంలో మనకు అనుకూలమైన నిర్ణయం తీసుకో." అని అన్నాడు రావణుడు.

ఆ మాటలు విన్న ప్రహస్తుడు ఇలా అన్నాడు. "ఓ రాక్షసేంద్రా! యుద్ధము విషయం గురించి మనం మంత్రి మండలిలో ఎన్నోసార్లు చర్చించాము. దీని గురించి మన మధ్య వాదోపవాదాలు జరిగాయి. మంత్రి మండలి సమావేశాలలో నేను "సీతను రామునికి ఇచ్చి యుద్ధం నివారించడం శ్రేయస్కరము" అని ఎన్నోసార్లు చెప్పాను. సీతను రామునికి ఇవ్వకపోతే యుద్ధం తప్పదని హెచ్చరించాను. కాని

నీ ఆగ్రహానికి గురి అయ్యాను.

ఓ రాజా! నేను నీ వద్ద పనిచేస్తున్నాను. నీ వలన ఎన్నో సన్మానాలు, సత్కారాలు, బహుమానాలు పొందాను. అటువంటి నీకు ఆపత్కాలంలో ఆదుకోకుండా ఉంటానా! నీ కొరకు నేను యుద్ధం చేస్తాను. నీ కొరకు ఆత్మార్పణము చేసుకుంటాను. నాకు నా భార్యబిడ్డలు, బంధువులు స్నేహితులు ముఖ్యం కాదు. నా రాజు, నా కర్తవ్య నిర్వహణ, నాకు ముఖ్యం. నీ మాట ప్రకారము నేను యుద్ధానికి వెళుతున్నాను." అని అన్నాడు ప్రహస్తుడు.

వెంటనే తన సైన్యాధ్యక్షులను సైన్యాలను సిద్ధం చేయమన్నాడు. లంకా నగరంలో ఉన్న సైనికులు అందరూ యుద్ధానికి సిద్ధం అయ్యారు. రావణుని విజయం కొరకు యజ్ఞములు చేసారు. హెూమాలు చేసారు. ఆ హెూమాగ్నులలో పునీతమైన మాలలను రాక్షస వీరులు ధరించారు. ప్రహస్తుడు యుద్ధభేరీ మోగించాడు. ప్రహస్తుడు చక్కగా అలంకరింపబడిన రథాన్ని ఎక్కాడు. ఆ రథానికి మంచి జాతి అశ్వాలు కట్టబడి ఉన్నాయి. తన వెంట అశేష సైన్యము రాగా యుద్ధానికి బయలుదేరాడు ప్రహస్తుడు.

భేరీ నినాదాలు, శంఖధ్వనులు మిన్నుముట్టాయి. ప్రహస్తునికి నలువైపులా నరాంతకుడు, కుంభహనువు, మహానాదుడు, సమున్నతుడు, అనే రాక్షసనాయకులు వారి వారి రథాల మీద బయలుదేరారు. ప్రహస్తుడు లంకానగరము తూర్పుద్వారము నుండి బయటకు వచ్చాడు. ఆ ప్రకారంగా ప్రహస్తుడు యుద్ధానికి వెళుతూ ఉంటే, అపశకునాలు ఎన్నో కనపడ్డాయి. కాని ప్రహస్తుడు వాటిని

లక్ష్యపెట్టలేదు.

ప్రహస్తుని అతని సైన్యమును చూచారు వానరులు. చేతికి అందిన బండరాళ్లను, చెట్లను ఆయుధములుగా ధరించారు. అటు రాక్షసులు, ఇటు వానరులు భయంకరంగా అరుస్తున్నారు. కేకలు పెడుతున్నారు. తమదే విజయమని ఉత్సాహంగా రంకెలు వేస్తున్నారు. ప్రహస్తుడు తన రథాన్ని సుగ్రీవుడు ఉన్న వంకకు పోనిచ్చాడు.

శ్రీమద్రామాయణము
యుద్ధకాండము యాభైఏడవ సర్గ సంపూర్ణము
ఓం తత్సత్ ఓం తత్సత్ ఓం తత్సత్

యుద్ధకాండము
యాభైఎనిమిదవ సర్గ.

అట్టహాసంగా యుద్ధానికి వస్తున్న ప్రహస్తుని చూచాడు రాముడు. చిరునవ్వు నవ్వాడు. విభీషణునితో ఇలా అన్నాడు. “విభీషణా! ఈ రాక్షస వీరుడు, సైన్యాధిపతి ఎవరు? ఇతని పేరు ఏమిటి? ఇతని బలపరాక్రమములు ఎట్టివి? ఇతనిని గురించి సవిస్తరంగా చెప్పు.” అని అని అడిగాడు రాముడు.

“ ఇతని పేరు ప్రహస్తుడు. రావణుని రాక్షస సేనలకు అధిపతి. లంకలో ఉన్న మూడు వంతుల సేనలకు అధిపతి ఇతడే. ఇతడు మహా శూరుడు, పరాక్రమవంతుడు. అస్త్రవిద్యానిపుణుడు.” అని అన్నాడు విభీషణుడు.

ఇంతలో ప్రహస్తుడు తన రాక్షస సేనలను వానర సేనల మీదికి పురికొల్పాడు. వానరులు పర్వతములను, బండరాళ్లను, వృక్షములను చేత ధరించి రాక్షసుల మీదికి పరుగెత్తారు. వానరులు రాక్షసులు ఒకరి మీద ఒకరు బండరాళ్లను, వృక్షములను, అస్త్రశస్త్రములను విసురుతున్నారు. వానరులకు రాక్షసులకు గొప్పయుద్ధము జరిగింది.

ఒకరిని ఒకరు చంపుకుంటున్నారు. ఇరు పక్కలా సైన్యం నష్టపోతున్నారు. రక్తం ఏరులైపారుతూ ఉంది. కొంతమంది శరీరాల్లో శూలాలు గుచ్చుకుంటున్నాయి. కొంతమంది పరిఘలతో కొట్టబడ్డారు. మరి కొంతమంది పర్వతశిఖరముల కిందపడి నలిగిపోతున్నారు. రాక్షసులు వానరులను తమ వద్ద ఉన్న కత్తులతో రెండుగా చీలుస్తున్నారు. వానరులు చెట్ల తోనూ కొండలతోనూ రాక్షసులను పిండి పిండి చేస్తున్నారు. వానరులు చేతులతోనూ కాళ్లతోనూ మర్దిస్తుంటే రాక్షసులు మాంసపు ముద్దలుగా మారిపోతున్నారు. ఒక పక్క దీనాలాపాలు మరొక పక్క సింహనాదాలు, విజయలక్ష్మి అటు ఇటు దోబూచులాడుతూ ఉంది.

ప్రహస్తుని మంత్రులు అయిన నరాంతకుడు, కుంభహనువు, మహానాదుడు, సమున్నతుడు కలిసి కట్టుగా వానరులను ఊతకోత కోస్తున్నారు. ఇంతలో ద్వివిదుడు ఒక పర్వత శిఖరముతో నరాంతకుడిని తుదముట్టించాడు. దుర్ముఖుడు ఒక చెట్టును సమున్నతుడు అనే రాక్షసుని మీదికి విసిరి వాడిని చంపాడు. జాంబవంతుడు ఒక పెద్ద బండరాయిని మహానాదుని గుండెల మీద

పడేసాడు. దాని కింద పడి మహానాదుడు గుండెలు పగిలి చచ్చాడు. తారుడు ఒక పెద్ద చెట్టును పెకలించి దానిని కుంభహనువు మీదికి విసిరాడు. ఆ చెట్టు కిందపడి నలిగిపోయిన కుంభహనువు కుంభాన్ని తన్నేసాడు.

తన అనుచరులు అంతా అంతం కాగా ప్రహస్తుడు చలించిపోయాడు. వానరుల మీద పట్టరాని కోపంతో శరవర్షం కురిపించాడు. ప్రహస్తుని వీరవిహారానికి వానరులు తట్టుకోలేక పోయారు. కుప్పలు కుప్పలుగా చచ్చి పడిపోతున్నారు. ప్రళయకాల రుద్రునిలా చెలరేగిపోతున్నాడు ప్రహస్తుడు. అతని బాణధాటికి వానరులు నిలువలేకపోయారు. వానర వీరులు కూడా రాక్షసులను అసంఖ్యాకంగా నేలకూలుస్తున్నారు. వానరుల, రాక్షసుల, మృత కళేబరాలతో యుద్ధభూమిలో భూమి కనపడటం లేదు. శవాల కుప్పలు పరిచినట్టు ఉంది. యుద్ధభూమి అంతా రక్తంతో బురద బురద గా తయారయింది. సైనికులు తిరగడానికి కూడా కష్టంగా ఉంది.

కాని ప్రహస్తుడు తన బాణవర్షము కురిపించడం మానలేదు. అది చూచాడు నీలుడు. ప్రహస్తుని నిలువరించకపోతే ఆ రాత్రే యుద్ధం అంతం అయేట్టు ఉందని అనుకున్నాడు. తెగించి ప్రహస్తుని రథం మీదికి దూసుకు వెళ్లాడు. ప్రహస్తుడు కూడా నీలుని లక్ష్యంగా చేసుకొని బాణప్రయోగం చేస్తున్నాడు. ప్రహస్తుడు ప్రయోగించిన బాణములు నీలుని శరీరాన్ని తాకి నేలమీద పడుతున్నాయి. నీలుడు ఒక పెద్ద వృక్షాన్ని పెకలించాడు. ఆ వృక్షంతో ప్రహస్తుని మోదాడు. ఆ దెబ్బ తప్పించుకున్న ప్రహస్తుడు నీలుని మీద శరవర్షము కురిపించాడు. చేసేది లేక ఆ బాణ వర్షంలో

తడుస్తున్నాడు నీలుడు.

ఓపఎడ్లయలరోలఅవకాశం కోసం ఎదురుచూస్తున్న నీలుడు పెద్ద సాలవృక్షములు పెకలించి దాని
తో ముందు ప్రహస్తుని రథమునకు కట్టిన గుర్రములను చంపాడు. అదే సాలవృక్షంతో మరొక దెబ్బ కొట్టాడు. ఆ దెబ్బకు ప్రహస్తుని విల్లు విరిగింది. నీలుడు పెద్దగా సింహనాదం చేసాడు. విల్లు విరగ గానే ప్రహస్తుడు ఒక ముసలమును ఆయుధంగా తీసుకొని రథం దిగాడు. అటు నీలుడు ఇటు ప్రహస్తుడు ఇరువురి శరీరముల నిండా రక్తం కారుతూ ఉంది. ఒకరి ఎదురుగా ఒకరు రెండు కొండలవలె నిలబడి ఉన్నారు. మదం కారుతున్న ఏనుగుల వలె ఉన్నారు. ఒకరితో ఒకరు తలపడ్డారు. పులులు సింహాలు కొట్టుకుంటున్నట్టు కొట్టుకుంటున్నారు. ఇద్దరూ వీరులే. ఒకరిక ి ఒకరు తీసిపోరు.

ప్రహస్తుడు నీలుడి లలాటభాగం మీద ముసలంతో కొట్టాడు. నీలుడు ఒక వృక్షం తీసుకొని ప్రహస్తుని గుండెల మీద కొట్టాడు. ఆ దెబ్బను తప్పించుకొన్న ప్రహస్తుడు తన ముసలంతో నీలుని మీదికి ఉరికాడు. తన మీదికి వస్తున్న ప్రహస్తుని చూచి నీలుడు ఒక పెద్ద బండరాయి తీసుకున్నాడు. ఆ బండరాయితో ప్రహస్తుని తలమీద గట్టిగా మోదాడు. ఆ దెబ్బకు ప్రహస్తుని తల పగిలింది. ముక్కలు ముక్కలు అయింది. మొదలు నరికిన వృక్షం వలె ప్రహస్తుడు నేలకూలాడు. ప్రాణాలు వదిలాడు.

తమ సేనానాయకుడు నేలకూలడంతో రాక్షస సేనలకు ధైర్యం సడలిపోయింది. లంక వైపుకు పారిపోయారు. గట్టు తెగిన ఏరు

మాదిరి రాక్షస సేనలు పారిపోతున్నారు. వారిని లంకాద్వారం దాకా తరిమారు వానరులు. రాక్షసులు అందరూ రావణుని వద్దకు వెళ్లారు. కాని వాళ్లనోటమాట రాలేదు. రావణుని వంక అలా చూస్తూ నిలబడ్డారు. ఇక్కడ ప్రహస్తుని చంపిన నీలుని మీద ప్రశంసల జల్లు కురుస్తూ ఉంది. రామలక్ష్మణులు నీలుని మనసారా అభినందించారు.

శ్రీమద్రామాయణము

యుద్ధకాండము ఏబది ఎనిమిదవ సర్గ సంపూర్ణము

ఓం తత్సత్ ఓం తత్సత్ ఓం తత్సత్

యుద్ధకాండము

ఏబది తొమ్మిదవ సర్గ.

నీలుడి చేతిలో ప్రహస్తుడు చావడం చూచిన రావణ సేనలు లంకలోకి పారిపోయాయి. అందరూ గబా గబా వెళ్లి నీలుడి చేతిలో ప్రహస్తుడు మరణించాడు అన్న వార్త రావణునితో చెప్పారు. రావణుని మనసులో కోపము, శోకము, బాధ అన్నీ ఒకేసారి కలిగాయి. ఇతర సేనాధి పతులను చూచి రావణుడు ఇలా అన్నాడు.

“సేనానాయకులారా! నేను ఇప్పటిదాకా ఓర్పు వహించాను. నా సహనం నశించింది. నా ప్రధాన సేనానాయకులను చంపిన వారిని నేను ఇంక ఎంత మాత్రమూ ఉపేక్షించలేను. నేను స్వయంగా యుద్ధరంగమునకు పోవలెనని నిశ్చయించుకున్నాను. అగ్నిగోళముల వంటి నా బాణములతో శత్రువులను నిర్మూలిస్తాను. వానరుల రక్తంతో భూదేవిని తృప్తిపరుస్తాను. రామలక్ష్మణులు నా బాణములకు ఆహుతి

కాక తప్పదు." అని పలికాడు వెంటనే తన రథమును ఎక్కాడు.

స్వయంగా రావణుడే యుద్ధరంగానికి బయలు దేరడం చూచిన రాక్షస సైన్యము ఉత్సాహంతో ఉరకలు వేసింది. తన సేనలు వెంటరాగా రావణుడు లంకా ద్వారము నుండి బయటకు వచ్చాడు. వానర సేనను తేరిపార చూచాడు. రాముడు రావణుని అతని సేనలను చూచాడు. విభీషణునితో ఇలా అన్నాడు. "ఇప్పుడు యుద్ధానికి వస్తున్నది ఎవరు? ఈ భయంకర సైన్యము ఎవరిది? ఇందులో ప్రముఖులు ఎవరు? ఇందులో గజబలము ఎక్కువగా ఉంది. సైన్యము అంతా ఖడ్గములు, శూలములు ధరించి ఉన్నారు. వీరిని గురించి వివరంగా చెప్పు." అని అడిగాడు.

దానికి విభీషణుడు ఇలా బదులు చెప్పాడు. "అదుగో ఏనుగును ఎక్కి వస్తున్నవాడు అకంపనుడు అనే రాక్షస సైన్యాధినేత. సింహమును తన ధ్వజముగా ధరించిన వాడు ఇంద్రజిత్తు. అతడు అజేయుడు. గొప్ప పరాక్రమ వంతుడు. వరగర్వి. ఆ పక్కనే వస్తున్న కొండంత శరీరము కలవాడు అతికాయుడు. ఏనుగును ఎక్కి ఉదయించిన సూర్యుని వలె ఎర్రగా ప్రకాశిస్తున్నవాడు మహోదరుడు. ప్రాసాయుధమును ధరించి, గుర్రము మీద ఠీవిగా వస్తున్నవాడు పిశాచుడు. వాడు పిడుగుతో సమానము. తెల్లటి ఎద్దును ఎక్కి, శూలమును చేతిలో ధరించి, వేగంగా వస్తున్నవాడు త్రిశిరస్కుడు. సర్పాన్ని చిహ్నంగా ధరించి ధనుష్టంకారము చేస్తున్నవాడు కుంభుడు. చేతిలో పరిఘను ధరించి ఉత్సాహంతో ఉరకలు వేస్తూ వస్తున్నవాడు నికుంభుడు. ఆ పక్కనే రథం మీద వస్తున్నవాడు నరాంతకుడు. వీడి ముందు దేవ,దానవ,గంధర్వ,యక్షులు నిలబడి యుద్ధం చేయలేరు.

అందుకని వీడు పర్వతములతో యుద్ధం చేస్తుంటాడు.

వారందరి మధ్యలో రౌద్రరూపంతో వెలిగిపోతున్నవాడు రావణుడు. లంకాధి నేత. ఈ యుద్ధానికి కారకుడు. అతని రథము మీద శ్వేతఛత్రము ఎగురుతూ ఉంది. రావణుడు, యముని దేవేంద్రుని గర్వం అణిచినవాడు. అపజయము ఎరుగని వాడు. అతడే నీ శత్రువు రావణుడు." అని పలికాడు విభీషణుడు.

రావణుని వంక అదేపనిగా చూచాడు రాముడు. "ఆహా! ఏమి తేజస్సు. మధ్యందిన మార్తాండుని ఎలా చూడలేమో అదే తేజస్సుతో ప్రకాశిస్తున్న రావణుడు కూడా చూడశక్యముకాకున్నాడు. కళ్లు మిరిమిట్లుకొలుపుతున్నాడు. దేవదానవులకు కూడా ఇంతటి ప్రకాశము, తేజస్సు ఉండదు. సాక్షాత్తు యమధర్మరాజు నడిచి వస్తున్నాడా అన్నట్టు ఉంది. విధి వశాత్తు ఈ పాపాత్ముడు నా కంటపడ్డాడు. వీడికి చావు తప్పదు." అనుకున్నాడు రాముడు.

రామలక్ష్మణులు తమ ధనుస్సులను సంధించారు. రావణుడు తన సేనానాయకులను చూచి "మీరందరూ నగర ద్వారములను, భవనములను, ప్రధాన మార్గములను రక్షించండి. నేను రామలక్ష్మణులను నిరోధిస్తాను." అని అన్నాడు. రావణుని ఆజ్ఞ ప్రకారము సేనానాయకులు నగర రక్షణ కొరకు వెళ్లారు. రావణుడు వానర సైన్యములోకి చొచ్చుకుపోయాడు. ఇది చూచిన సుగ్రీవుడు పెద్ద పర్వత శిఖరమును పెకలించి చేత ధరించి రావణుని వంకకు దూసుకుపోయాడు. ఆ పర్వత శిఖరమును రావణుని వంకకు

బలంగా విసిరాడు. రావణుడు ఆ పర్వతశిఖరమును తనబాణములతో ఛేదించాడు.

వెంటనే రావణుడు మహా సర్పము వంటి బాణమును సంధించి సుగ్రీవుని మీదికి ప్రయోగించాడు. ఆ బాణము సుగ్రీవుని శరీరాన్ని చీల్చింది. ఆ శరాఘాతానికి సుగ్రీవుడు పెద్దగా అరిచి స్పృహ తప్పి పడిపోయాడు. అది చూచి రాక్షససేనలు ఆనందంతో కేకలు వేసాయి. ఈ పరిణామాన్ని చూచిన గవాక్షుడు, గవయుడు, సుషేణుడు, ఋషభుడు, జ్యోతిర్ముఖుడు, నలుడు గబ గబా చేతికి అందిన పర్వతశిఖరములను తీసుకొని రావణుని వైపుకు పరుగెత్తారు. రావణుడు వారి చేతుల్లో ఉన్న పర్వత శిఖరములను తన వాడి అయిన అత్యంత శక్తివంతమైన బాణములతో నుగ్గు నుగ్గు చేసాడు. అంతే కాకుండా వాడి అయిన బాణములతో ఆ వానర వీరుల శరీరాలు తూట్లు పడేట్టు కొట్టాడు రావణుడు. ఆ బాణము దెబ్బలకు తట్టుకోలేక వానర వీరులు కిందపడిపోయారు. "రామా రామా రక్షించు రామా" అంటూ అరుస్తున్నారు.

ఇది చూచి కోపోద్రిక్తుడయ్యాడు రాముడు. వెంటనే తన బాణమును సంధించాడు. అది చూచిన లక్ష్మణుడు రాముడితో ఇలా అన్నాడు. "రామా! ఈ దుష్టుడిని చంపడానికి నీవు బాణం సంధించాలా! నేను లేనూ. నేను ఇతనిని సంహరిస్తాను. నాకు అవకాశం ఇవ్వు." అని అడిగాడు.

"లక్ష్మణా! అలాగే కానీ. కానీ చాలా జాగ్రత్తగా ఉండు. రావణుడు సామాన్యుడు కాడు. అమిత పరాక్రమవంతుడు. శక్తిమంతుడు. అతనికి ఎన్నోవిద్యలు మాయలు తెలుసు. రావణుడు

ఆగ్రహిస్తే మూడులోకాలను భస్మం చేయగలడు. కాబట్టి అతి జాగరూకతతో వ్యవహరించు. లక్ష్మణా! ముందు రావణుని పరిశీలించు. అతనిలో ఉన్న లోపము, బలహీనత గుర్తించు. అదే మాదిరి నీలో ఉన్న లోపాలు, బలహీనతలను కూడా గ్రహించు. తదనుగుణంగా యుద్ధం చేయి. నిన్ను నీవు రక్షించుకోడం మాత్రం మరిచిపోకు. ముందు స్వీయరక్షణ ప్రాధాన్యము. తరువాత శత్రువును చంపడం." అని అన్నాడు రాముడు.

లక్ష్మణుడు రాముడికి నమస్కరించి రావణునితో యుద్ధానికి వెళ్లాడు.ఆ సమయంలో రావణుడు వానరుల మీద బాణాలను వర్షంలాగా కురిపిస్తున్నాడు. ఆ బాణాల ధాటికి తట్టుకోలేక వానరులు చెల్లాచెదరు అయ్యారు. వానరులను చించి చెండాడుతున్న రావణుని చూచాడు లక్ష్మణుడు. రావణుడు వానరులను చంపడం చూచిన హనుమంతుడు రావణుని బాణధాటిని అడ్డుకోడానికి రావణుని మీదికి వెళ్లాడు. హనుమంతుడు వెళ్లి రావణుని రథం ముందు నిలబడి చేయి పైకెత్తి ఇలా అన్నాడు.

"ఓ రావణా! నీవు దేవ, దానవ, యక్ష, గంధర్వులనుండి చావు లేకుండా వరము పొందావు. కానీ మా వానరులను మరిచావు. వానరులంటే నీకు భయం కదా! నా కుడి చేయి నీ శరీరంలో నుండి జీవాత్మను వేరు చేయడం సత్యం. కాచుకో" అన్నాడు హనుమంతుడు.

ఆ మాటలకు రావణుని కళ్లు కోపంతో ఎర్రబడ్డాయి. "ఓ వానరా! నువ్వు అంత బలవంతుడివి అయితే రా! నన్ను కొట్టు. నీ బలం

ఏపాటిదో చూస్తాను. తరువాత నిన్ను చంపుతాను.” అన్నాడు రావణుడు విలాసంగా.

“నువ్వు అంత మొనగాడివా! నేను నీ కుమారుడు అక్షయుని చంపాను గుర్తులేదా! అప్పుడేం చేసావు.” అని హేళన చేసాడు హనుమంతుడు. ఆ మాటలకు కోపంతో ఊగిపోయాడు రావణుడు. తన అరిచేతితో హనుమంతుని గుండెలమీద చరిచాడు. ఆ దెబ్బకు ముందుకు తూలాడు హనుమంతుడు. కాసేపు నిలదొక్కుకొని హనుమంతుడు తన అరిచేతితో రావణుని గుండెలమీద చరిచాడు. హనుమంతుని దెబ్బకు రావణుని శరీరం అంతా కంపించింది. పక్కకు తూలాడు. కాసేపు కళ్లు బైర్లు కమ్మాయి. అంతలో స్పృహ తెచ్చుకున్నాడు రావణుడు.

“ఓ వానరా! నీవు నాకు తగ్గ శత్రువు. నీ బలం అమోఘం. నీ పరాక్రమం అద్భుతం.” అని అన్నాడు రావణుడు.

“రావణా! ఇదీ ఒక బలమేనా! నేను కొట్టిన దెబ్బకు, దెబ్బ తిన్న వాడు మరుక్షణం మరణించాలి. కాని నీవు ఇంకా జీవించి ఉన్నావంటే నా బలం అంత గొప్పది కాదు. రావణా! మరలా నన్ను ఒకసారి కొట్టు. ఆ కోపంతో తిరిగి నేను నిన్ను కొడతాను. అప్పుడు నీవు యమలోకం చేరుకుంటావు.” అని అన్నాడు హనుమంతుడు.

హనుమంతుని మాటలకు రావణుని కోపం తారస్థాయికి చేరుకుంది. తన కుడి చేతి పిడికిలితో హనుమంతుని గుండెల మీద గట్టిగా మోదాడు. రావణుని దెబ్బకు తట్టుకోలేక హనుమంతుడు బాగా తూలిపోయాడు. స్పృహ తప్పాడు. రావణుడు హనుమంతుని వదిలి

నీలుడి వంకకు వెళ్లాడు. రావణుడు నీలుడి మీద సర్పములతో సమానమైన శక్తి కల బాణములను సంధించాడు. నీలుడు ఆ బాణధాటికి తప్పించుకుంటూ రావణుని మీద ఒక పర్వత శిఖరమును విసిరాడు. ఇంతలో హనుమంతుడికి స్పృహ వచ్చింది. రావణుని వంక చూచాడు. ఆ సమయంలో రావణుడు నీలుడితో యుద్ధం చేస్తున్నాడు. ఇతరులతో యుద్ధం చేసేవాడితో తను యుద్ధం చేయడం మంచిది కాదనుకున్నాడు హనుమంతుడు.

రావణుడు, నీలుడు తన మీదకు విసిరిన పర్వత శిఖరమును తన బాణములతో తుత్తునియలు చేసాడు. నీలుడు కోపంతో ఊగి పోయాడు. నీలుడు మద్దిచెట్లను, సాలవృక్షములను రావణుని మీదికి విసురుతున్నాడు. రావణుడు ఆ వృక్షములను చించి చెండాడుతూ, నీలుడి మీద శరవర్షము కురిపిస్తున్నాడు. నీలుడు తన శరీరమును చాలా చిన్నదిగా చేసాడు. ఎగురుకుంటూ వెళ్లి రావణుని ధ్వజము మీద కూర్చున్నాడు. నీలుడు ఎక్కడా కనపడలేదు పైకి చూచాడు రావణుడు. తన ధ్వజము మీద కూర్చుని పెద్దగా అరుస్తున్న నీలుడిని చూచాడు రావణుడు. చిన్ని వానర రూపంలో ఉన్న నీలుడు రావణుని ధ్వజము మీది నుండి రావణుని ధనుస్సు మీదికి దూకి, ధనుస్సు చివర కూర్చున్నాడు, తరువాత రావణుని కిరీటము మీద వాలాడు.

నీలుడి కోతి చేష్టలు చూచి రాముడు, లక్ష్మణుడు, హనుమంతుడు ఆశ్చర్యపోయారు. అది చూచిన వానరులు ఆనందంతో అరుస్తూ గెంతులు వేస్తున్నారు. నీలుడు అలా తన ఎదురుగా

చురుకుగా ఎగరడం చూచి రావణుడు ఆగ్నేయాస్త్రము తీసుకున్నాడు. వానరుల ఆర్భాటము చూచి రావణునికి ఏమి చెయ్యాలో తోచలేదు. రావణుడు ఆగ్నేయాస్త్రమును నీలుడి మీద సంధించాడు. నీలుని చూచి ఇలా అన్నాడు. “ఓ వానరుడా! నీవు నా ముందు నీ చురుకుదనము మాయలు చూపుతున్నావు. రక రకాల రూపాలతో ప్రత్యక్షం అవుతున్నావు. చేతనైతే ఈ అస్త్రమును కాచుకో. నీ ప్రాణాలు కాచుకో. నీవు ఎన్ని వేషాలు వేసినా ఈ అస్త్రము నీ ప్రాణాలు తీయడం తథ్యం.” అని అస్త్రమును ప్రయోగించాడు.

రావణుడు సంధించిన ఆగ్నేయాస్త్రము నీలుడి వక్షస్థలము ను తాకింది. నీలుడు కిందపడిపోయాడు. అగ్నిదేవుని కుమారుడు అవడం వలన నీలుడు ప్రాణాలు పోలేదు. కాని నీలుడు మూర్ఛపోయాడు. రావణుడు నీలుని వదిలి లక్ష్మణుని వంకకు వెళ్లాడు. రావణుడు తన రథము మీద లక్ష్మణుని ముందు నిలిచి ధనుష్టంకారము చేసాడు.

రావణుని చూచి లక్ష్మణుడు ఇలా అన్నాడు. “ఓ రాక్షసరాజా! అస్త్రములంటే తెలియని ఈ వానరులతో యుద్ధము కాదు. నాతో యుద్ధానికి రా!” అని అరిచాడు. ఆ మాటలకు కోపించిన రావణుడు లక్ష్మణునితో ఇలా అన్నాడు. “ ఓ లక్ష్మణా! మరణించే ముందు అంతా ఇలాగే అంటారు. నీ మరణము దైవవశాత్తు నాచేతిలో ఉంది. నా శరముల దెబ్బకు ఇప్పుడే యమపురి చేరుకుంటావు.” అని అన్నాడు. దానికి లక్ష్మణుడు దీటుగా జవాబు చెప్పాడు. “ఓ రావణా! పాపాత్ములు ఇలాగే మాట్లాడుతారు. నీతి మంతులు, పరాక్రమ వంతులు, ఇలా మాట్లాడరు. నీ వీర్యము, బలము, శౌర్యము ఏపాటిదో నాకు తెలియదా!

వృథా ప్రేలాపనలు కట్టిపెట్టి యుద్ధానికి దిగు." అని అన్నాడు లక్ష్మణుడు.

ఇంక రావణుడు బదులు చెప్పలేదు. బాణాలతోనే బదులు చెప్పాడు. లక్ష్మణుని మీద వాడి అయిన ఏడు బాణములు ప్రయోగించాడు. వాటిని మధ్యలోనే తుంచాడు లక్ష్మణుడు. తన బాణములు వృథా కావడం చూచి రావణుడు కోపించాడు. మరి కొన్ని వాడి అయిన బాణములను ప్రయోగించాడు రావణుడు. రావణుని విల్లునుండి బాణములు వెలువడగానే అవి లక్ష్మణుని బాణాలకు బలి అవుతున్నాయి. ఒక్కటీ లక్ష్మణుని చేరడం లేదు. లక్ష్మణుని వేగానికి, నిశితమైన లక్ష్యభేదనకు రావణుడు ఆశ్చర్యపోయాడు. మరలా మరలా వాడి అయిన బాణములను లక్ష్మణుని మీద ప్రయోగించాడు. లక్ష్మణుడు కూడా అంతకన్నా వాడి అయిన బాణములను రావణుని మీద ప్రయోగించాడు.

రావణుడు తనకు బ్రహ్మదేవుడు ప్రసాదించిన అస్త్రముతో లక్ష్మణుని లలాట భాగంలో కొట్టాడు. ఆ బాణము దెబ్బకు లక్ష్మణుని కళ్లు తిరిగాయి. చేతిలో ధనుస్సు పట్టుజారి పోయింది. అంతలోనే తేరుకున్నాడు లక్ష్మణుడు. వాడి అయిన ఒకే ఒక బాణంతో రావణుని ధనుస్సు ఖండించాడు. వెంటనే మరొక మూడు బాణములతో రావణుని కొట్టాడు లక్ష్మణుడు. లక్ష్మణుని బాణముల ధాటికి రావణుని శరీరం అంతా రక్తసిక్తమయింది. రావణుని కోపము తారస్థాయికి చేరింది. వెంటనే బ్రహ్మదేవుడు ఇచ్చిన శక్తి అనే అస్త్రమును తీసు కున్నాడు. లక్ష్మణుని మీద ప్రయోగించాడు. ఆ శక్తి అస్త్రము,నిప్పులు పొగలు చిమ్ముకుంటూ లక్షణుని మీదికి వెళ్లింది.

లక్ష్మణుడు ఆ అస్త్రమును నిరోధించడానికి శతవిధాలా ప్రయత్నించాడు. కానీ అతని వల్ల కాలేదు. ఆ శక్తి అస్త్రము లక్ష్మణుని వక్షస్థలమును తాకింది. లక్ష్మణుడు నేల మీద పడిపోయాడు. కిందపడిపోయిన లక్ష్మణుని చూచిన రావణుడు తన రథమును దిగాడు. లక్ష్మణుని వద్దకు వచ్చాడు. లక్ష్మణుని తన బాహువులతో ఎత్తడానికి ప్రయత్నించాడు. కాని అతని వల్ల కాలేదు. లక్ష్మణుడు శక్తితో కొట్టబడినా స్పృహ కోల్పోలేదు. లోలోపల విష్ణునామ స్మరణ చేస్తున్నాడు. అందుకని శక్తి అస్త్రము లక్ష్మణుని మీద తన ప్రభావమును పూర్తిగా చూపడం లేదు.

రావణుడు శక్తిని ప్రయోగించడం, లక్ష్మణుడు పడిపోవడం, రావణుడు లక్ష్మణుని ఎత్తడం చూచాడు హనుమంతుడు. వెంటనే అక్కడకు వెళ్లాడు. తన పిడికిలి బిగించి రావణుని గుండెల మీద కొట్టాడు. రావణుడు హనుమంతుని దెబ్బకు చలించిపోయాడు. నేల మీద కూలబడిపోయాడు. రావణుని ముఖం నుండి చెవుల నుండి రక్తం కారుతూ ఉంది. క్రమక్రమంగా రావణుడు మూర్ఛపోయాడు. వెంటనే హనుమంతుడు లక్ష్మణుని తన బుజాల మీద ఎత్తుకొని రాముని వద్దకు తీసుకొని వచ్చాడు.

ఇంతలో రావణునికి తెలివి వచ్చింది. తన ధనుర్బాణములను తీసుకొని మరలా తన రథం ఎక్కాడు. నిరంతరము విష్ణునామ స్మరణ చెయ్యడం వల్ల లక్ష్మణుని శరీరంలో గుచ్చుకున్న శరములు అన్నీ నిర్వీర్యములు అయ్యాయి. వెంటనే రాముడు తన ధనుర్బాణములను తీసుకొని రావణుని వంకకు వెళ్లాడు. అది చూచిన హనుమంతుడు రాముని వద్దకు పోయి "రామా!

విష్ణువు గరుడుని మీద ఎక్కినట్టు నువ్వు నా బుజాల మీద ఎక్కు. రావణుని సంహరించు.” అని అన్నాడు. హనుమంతుడు రాముని ముందు మోకరిల్లాడు. రాముడు హనుమంతుని వీపు మీద కూర్చున్నాడు. హనుమంతుడు వాయువేగంతో పైకి ఎగిరాడు. రావణుడు ఉన్న ప్రదేశానికి వెళ్లాడు. రాముడు తన రథంలో కూర్చుని ఉన్న రావణుని చూచాడు. లక్ష్మణుని మీద శక్తిని ప్రయోగించిన రావణుని చూడగానే రామునికి కోపం ఆగలేదు. ధనుస్సును సంధించి రావణుని వంకకు దూసుకుపోయాడు.

రాముడు దిక్కులు పిక్కటిల్లేటట్టు ధనుష్టంకారము చేసాడు. రావణుని చూచి ఇలా అన్నాడు. “ఓ రావణా! నిలువు. పారిపోకు. నాకు ఇంత అపకారం చేసి నువ్వు నా నుండి తప్పించుకోలేవు. నా ఎదుట పడ్డ వాడిని ఇంద్రాది దేవతలు కూడా కాపాడలేరు. నిన్ను కాపాడటం ఆ త్రిమూర్తులకు కూడా శక్యం కాదు. నా తమ్ముడు లక్ష్మణుని నీ శక్తితో కొట్టి సంబరపడుతున్నావేమో. తొందరలోనే లక్ష్మణుడు లేచి నీ మీదికి రాగలడు. నిన్ను బంధుమిత్రసమేతంగా నాశనం చెయ్యగలడు. నా సంగతి నీకు తెలుసు కదా! జనస్థానములో 14000 మంది రాక్షసులను ఒంటి చేత్తో చంపాను. ఇంక నీవెంత. నీ రాక్షస సేనలు ఎంత. తృటిలో నాశనం చేస్తాను.” అని పలికాడు రాముడు.

ఆ మాటలు విన్న రావణుడు కోపంతో మండి పడ్డాడు. తన వాడి అయిన బాణములను రాముని వాహనంగా ఉన్న హనుమంతుని మీద ప్రయోగించాడు. రావణుని బాణముల దెబ్బలు తగిలిన హనుమంతుడు మరింత తేజస్సుతో ప్రకాశించాడు. తనను వదిలి హనుమంతుని మీద రావణుడు బాణములను ప్రయోగించడం చూచి

రాముడు కోపం తెచ్చుకున్నాడు. రాముడు తన వాడి అయిన బాణములతో రావణుని రథమును, రథమునకు కట్టిన గుర్రములను, సారథిని కొట్టాడు. తరువాత లెక్కలేని వాడి అయిన బాణములతో రావణుని వక్షస్థలమును ఛేధించాడు. రావణుని చేతిలోని ధనుస్సు కిందపడిపోయింది. పక్కకు తూలాడు రావణుడు. వెంటనే రాముడు ఒక అర్ధచంద్రబాణంతో రావణుని కిరీటాన్ని కొట్టాడు. రావణుని కిరీటం కిందపడిపోయింది. రావణుడు తన రథం మీద కూలబడ్డాడు.

అప్పుడు రావణుని చూచి రాముడు ఇలా అన్నాడు. "ఓ రావణా! నీవు లెక్కలేనన్ని పాపాలు చేసావు. ఎందరో వానర వీరులను చంపావు. ఇప్పుడు నిన్ను చంపగలను. కాని అలసి పోయి ఉన్నావు. అలసిపోయిన వారిని చంపడం ధర్మం కాదు. కాబట్టి నిన్ను చంపడం లేదు. ఈ రోజుకు లంకకు వెళ్లు. సేదదీరు. రేపు రా. మరొక రథం ఎక్కిరా. అప్పుడు నా పరాక్రమం ఎట్టిదో చూద్దువుగాని." అని అన్నాడు రాముడు.

రాముని మాటలతో రావణుని దర్పం అంతా దిగిపోయింది. దీనంగా చూస్తున్నాడు. మారు మాటాడ కుండా మరొక రథం ఎక్కి లంకకు వెళ్లిపోయాడు రావణుడు. రావణుడు వెళ్లిన తరువాత, రాముడు లక్ష్మణుని శరీరంలో దిగిన బాణములను, వానరుల దేహములో గుచ్చుకున్న బాణములను అన్నీ తీయించాడు.

శ్రీమద్రామాయణము

యుద్ధకాండము యాభైతొమ్మిదవ సర్గ సంపూర్ణము

ఓం తత్సత్ ఓం తత్సత్ ఓం తత్సత్

యుద్ధకాండము

అరవయ్యవ సర్గ.

రాముడి చేతిలో ఓడి పోయిన రావణుడు అవమాన భారంతో లంకకు వెళ్లాడు. ఏమీ చెయ్యడానికి తోచడం లేదు. ఒక మానవుని చేతిలో ఓటమి రావణునికి చాలా బాధాకరంగా, అవమానకరంగా పరిణమించింది. రామ బాణాలను తలచుకుంటేనే రామునికి కంపరంగా ఉంది.

తన ఆంతరంగికులను పిలిచి ఇలా అన్నాడు. “ఈ రోజు నేను ఒక మానవుని చేతిలో ఓడిపోయాను. నా బలము, పరాక్రమము, నేను చేసిన తపస్సు అంతా వృధా అయిపోయాయి. నేను బ్రహ్మను వరము కోరునపుడు మానవులను బలహీనులుగా తలంచి వారి వలన కూడా చావు లేనట్టు వరకు కోరలేదు. అప్పుడే బ్రహ్మ నాకు మానవుల వలన కీడు ఉందని చెప్పాడు. ప్రస్తుత పరిణామములు అలాగే జరుగుతూ ఉన్నాయి. దేవ, దానవ, గంధర్వ, యక్ష, రాక్షస, పన్నగుల నుండి మరణము లేకుండా వరము కోరిన నేను మానవులను ఎందుకు విస్మరించాలి! మానవుల వలన కూడా మరణము లేకుండా వరము కోరి ఉంటే బాగుండేది.

ఇక్ష్వాకు వంశములో పుట్టిన అనరణ్యుడు నాతో అన్న మాటలు యదార్థములు అయ్యాయి. “ఓ రాక్షసుడా! నిన్ను, నీ వంశమును, నాశనము చేయగల వాడు నా వంశములో జన్మించగలడు” అని ఆరోజే అన్నాడు. ఆ మానవుడు రాముడే

కావచ్చును. అన్నీ ఇప్పుడు జ్ఞప్తికి వచ్చుచున్నవి. పూర్వము నేను వేదవతి అనే యువతిని అవమానించాను. ఆమే సీతగా జనకుని ఇంట జన్మించినది. అదీ కాకుండా నాకు ఉన్న శాపములు అన్నీ ఇన్నీ కావు. నందీశ్వరుడు, రంభ, పార్వతి, వరుణ పుత్రిక అందరూ నన్ను శపించారు. అవన్నీ ఈ రోజు నిజం అవుతున్నాయి కదా! వారి మాటలు పొల్లుపోతాయా!

కాబట్టి ఇవన్నీ దృష్టిలో ఉంచుకొని మనము ఇంక ప్రవర్తించాలి. నగరం అంతా కట్టుదిట్టమైన కాపలా పెట్టండి. నా తమ్ముడు కుంభకర్ణుని నిద్రలేపండి. ప్రహస్తుడు మరణించాడు. నేను రాముని చేతిలో ఓటమి పొందాను. తరువాత కుంభకర్ణుడు మాత్రమే రామునితో యుద్ధము చేయుటకు తగినవాడు. అతడొక్కడే యుద్ధములో వానరులను, రామలక్ష్మణులను చంపగలడు. అంత పరాక్రమ వంతుడైన కుంభకర్ణునికి ఈ పాడు నిద్ర ఒకటి దాపురించింది. అవసరానికి అందుబాటులో లేకుండా పోయాడు. ఈ సమయంలో యుద్ధం చేయక పోతే ఇంక కుంభకర్ణుని వలన ప్రయోజనం ఏమిటి? ఆపదలో ఉన్నప్పుడు సాయపడ్డవాడే కదా ఆప్తుడు, బంధువు. అందుకని, తొందరగా కుంభకర్ణుని నిద్రలేపండి." అని ఆజ్ఞాపించాడు. రావణుని ఆదేశముల మేరకు రాక్షసులు కుంభకర్ణుని నిద్రలేపడానికి వెళ్లారు.

కుంభకర్ణుని గృహము చాలా పెద్దది. శరీరాన్ని బట్టి ఇల్లు కదా! కుంభకర్ణుడు పట్టేంత ద్వారములతో, ఒక యోజనము వైశాల్యంతో నిర్మించబడింది. రాక్షసులు అందరూ కుంభకర్ణుని పడుకొని ఉన్న విశాలమైన గృహము లోనికి ప్రవేశించారు. కుంభకర్ణుని

ఉచ్ఛ్వాస నిశ్వాసములకు వారు గడ్డిపోచలవలె ఊగిపోతున్నారు. ఎలాగో నిలదొక్కుకుంటూ కుంభకర్ణుని దగ్గరకు వెళ్లారు. వెల్లకిలా పడుకొని నిద్రపోతున్న కుంభకర్ణుని చూచారు. ఆ కుంభకర్ణుని చూడగానే రాక్షసజాతికి చెందిన వారికి కూడా కడుపులో వికారం కలిగింది. ఒక పెద్ద పర్వతము నేల మీద పడిపోయి ఉందా అన్నట్టు ఉన్నాడు కుంభకర్ణుడు.

రాక్షసులు అందరూ తలోక దిక్కు చేరుకున్నారు. కుంభకర్ణుని నిద్రలేపడానికి పూనుకున్నారు. కుంభకర్ణుని శరీరము మీద ఉన్న వెంట్రుకలు కత్తులవలె నిక్కపొడుచుకొని ఉన్నాయి. కుంభకర్ణుడు ఊపిరి తీస్తుంటే పాములు బుసకొడుతున్నట్టు ఉంది. కుంభకర్ణుడు ఊపిరి విడుస్తుంటే ఆ గాలి తాకిడికి ఆ రాక్షసులు కొట్టుకుపోతున్నారు. కుంభకర్ణుని శరీరము నుండి మదపు వాసన వేస్తూ రాక్షసులకే వెగటు పుట్టిస్తూ ఉంది. కుంభకర్ణుడు లేవగానే తినడానికి చంపి తెచ్చిన లేళ్లు, దున్నపోతులు, వరాహములు మొదలగు మృగములను రాసులుగా పోసారు. వండిన అన్నమును రాసులుగా పోసారు. రకరకాలైన వండిన మాంసము నంజుళ్లను రాసులుగా పోసారు. తాగడానికి రక్తాన్ని కుండలతో నింపి పెట్టారు. కుంభకర్ణుని శరీరానికి చందనము పూసారు. పూలమాలలతో అలంకరించారు. ధూపం వేసారు. స్తోత్రపాఠాలు చదివారు. పెద్దగా అరిచారు. కుంభకర్ణుని చెవుల దగ్గరు శంఖములు ఊదారు. చెవుల దగ్గర పెద్దగా అరిచారు. కేకలు పెట్టారు. కుంభకర్ణుని చేతులు కాళ్లు పైకెత్తికిందపడేసారు. కాని కుంభకర్ణుడు లేవలేదు.

కుంభకర్ణుని లేపడానికి చేసిన ధ్వనులతో చుట్టుపక్కల

ఉన్న పక్షులు మృగములు భయంతో పారిపోయాయి. కొన్ని గిలా గిలా కొట్టుకొని మరణించాయి. ఇంక ఇలా ధ్వనులు చేసి లాభం లేదనుకొని, రాక్షసులు ముద్గరలు, ముసలములు, గదలతో కుంభకర్ణుని గుండెల మీద, చేతుల మీద, కాళ్ల మీద కొట్టనారంభించారు. గదలు విరిగాయి కొట్టి కొట్టి రాక్షసుల చేతులు విరిగాయి. కాని కుంభకర్ణుడు నిద్ర లేవలేదు. అలా కొట్టేటప్పుడు కుంభకర్ణుడు విడిచే శ్వాసకు రాక్షసులు ఎగిరిపోతున్నారు. అది తట్టుకొని కుంభకర్ణుని కొట్టడం చాలా కష్టంగా ఉంది రాక్షసులకు. అయినా ప్రయత్నిస్తున్నారు. అంతా కలిసి పదివేల మంది రాక్షసులు ఈ బృహత్కార్యంలో పాల్గొంటున్నారు. కాని ఫలితం కనిపించడం లేదు.

ఇలా కాదని, వారు, గుర్రములను, ఏనుగులను, ఒంటెలను తీసుకొని వచ్చి కుంభకర్ణుని శరీరం మీద నడిపించారు. ఒక పక్క భేరీమృదంగములు మోగుతున్నాయి. మరొక పక్క గదలతోనూ ముసలములతోనూ కొడుతున్నారు. మరొక పక్క ఏనుగులు, గుర్రములు, ఒంటెలు కుంభకర్ణుని శరీరం మీద నడుస్తున్నాయి తొక్కుతున్నాయి. కాని కుంభకర్ణుడు నిద్రలేవలేదు. ఈ కోలాహలానికి లంకానగరం అంతా మార్మోగిపోతూ ఉంది. కుంభకర్ణుని చెవుల దగ్గర భేరీలు అమర్చారు. వాటిని పెద్ద పెద్ద కర్రలతో మోగిస్తున్నారు. ఎంత చేసినా శాపగ్రస్తుడైన కుంభకర్ణుడు నిద్రలేవలేదు.

రాక్షసులకు విపరీతమైన కోపం వచ్చింది. పదివేల మంది రాక్షసులు కుంభకర్ణుని మీద పడ్డారు. కొరికారు. రక్కారు. కొట్టారు. గుద్దారు. చితకబాదారు. కుండలతో నీళ్లు తెచ్చి చెవుల్లో పోసారు. అయినా కుంభకర్ణుడు నిద్రలేవలేదు. అయినా వారి ప్రయత్నములు

వీడలేదు. మరలా మొదలెట్టారు. శతఘ్నులు తెచ్చి పేల్చారు. ముద్గరలతో ముసలములతో కొట్టారు. ఏనుగులను కుంభకర్ణుని శరీరం మీద అటు ఇటు వేగంగా పరుగెత్తించారు.

అప్పుడు కొంచెం కదిలాడు కుంభకర్ణుడు. ఎవరో తనను లేపుతున్నట్టు స్పర్శద్వారా తెలుసుకున్నాడు. నిద్రమధ్యలో లేపినందుకు కుంభకర్ణుడికి కోపం వచ్చింది. ఆవులిస్తూ లేచి కూర్చున్నాడు. చేతులు రెండూ పైకెత్తి పెద్దగా ఆవులించాడు. కుంభకర్ణుడు ఆవులించినపుడు వెలువడ్డ గాలి రెండు కొండల మధ్యనుండి వీచే ప్రచండ ఝంఝా మారుతంలా వీచింది. కుంభకర్ణుడు లేవగానే రాక్షసులు అతనికి తాము సేకరించి తెచ్చిన ఆహార పదార్థాలు చూపించారు. కుంభకర్ణుడు వాటిని అవలీలగా భక్షించాడు. రక్తమును, మద్యము తాగాడు. తృప్తిగా త్రేన్చాడు. హమ్మయ్య అనుకున్నారు రాక్షసులు.

కుంభకర్ణునికి నమస్కరించి అతని చుట్టు నిలబడ్డారు. సగం నిద్రలో లేవడం వలన కుంభకర్ణుడి కళ్లు మూతలు పడుతున్నాయి. తూలుతున్నాడు. తనను అర్థాంతరంగా నిద్రలేపి నందుకు విసుక్కుంటూ నాలుగు పక్కలా చూచి, తన పక్కనే ఉన్న రాక్షసులతో ఇలా అన్నాడు కుంభకర్ణుడు.

“ నన్ను ఎందుకు బలవంతంగా నిద్ర లేపారు. రావణుడు క్షేమంగా ఉన్నాడు. ఏమీ ఉపద్రవము రాలేదు కదా! ఎవరన్నా శత్రువు మన లంక మీద దండయాత్ర చేసాడా! లేకపోతే నన్ను ఇంత బలవంతంగా ఎందుకు నిద్రలేపుతారు. పదండి విషయం కనుక్కుందాము. ఇంద్రుడు మరలా విజృంభించాడా!. వాడిని

అణిచివేస్తాను. అగ్నిని కాలుస్తాను. ఏదో కారణం లేనిదే నన్ను నా అన్న నిద్రలేపమని ఆదేశము ఇవ్వడు. ఏం జరిగిందో త్వరగా చెప్పండి." అని గబా గబా అడిగాడు కుంభకర్ణుడు.

అప్పుడు రావణుని మంత్రి అయిన యూపాక్షుడు అనే రాక్షసుడు చేతులు జోడించి కుంభకర్ణునితో ఇలా అన్నాడు. "రాజా! మాకు దేవ,దానవ,గంధర్వుల వలన ఏలాంటి భయమూ లేదు. ప్రస్తుతము మానవులవల్లనే మాకు భయం పట్టుకుంది. ఈ మానవుల నుండి మేము పొందుతున్న భయము ఇదివరకు ఎవరి వలనా పొందలేదు. అంతగా భయపడుతున్నాము. మానవులకు వానరులు తోడైనారు. ఆ వానరులు సామాన్యులు కారు. ఒక్కొక్కరూ పర్వతముల వంటి శరీరములు కలవారు. కోట్లకొలది ఉన్న వానరులు లంకను ముట్టడించారు. రాముడు అనే రాకుమారుడు ఉన్నాడు. అతని భార్య సీతను రావణుడు అపహరించి తెచ్చి లంకలో ఉంచాడు. సీత కోసరం రాముడు వానరసేనతో లంకను దిగ్బంధం చేసాడు. సీతను వెదుకుతూ వచ్చిన ఒక వానరుడు అక్షకుమారుని చంపాడు. లంకను దహనం చేసాడు. నిన్న సాక్షాత్తు రావణుడే రామునితో యుద్ధానికి దిగాడు. అప్పుడు రాముడు రావణుని ఓడించి, "అలసి పోయిన వానితో నేను యుద్ధం చేయను. నేడు పోయి విశ్రాంతి తీసుకొని రేపురా!" అని చెప్పి పంపాడు రాముడు. రావణుడు ఆ అవమాన భారంతో కుమిలి పోతున్నాడు. రావణునికి ఇటువంటి దుస్థితి దేవ,దానవ,గంధర్వ, యక్ష,నాగుల వలన కలగ లేదు. ఈ నాటికి ఒక మానవుని వలన కలిగింది." అని చెప్పాడు యూపాక్షుడు.

ఆ మాటలు విన్న కుంభకర్ణుడు కోపంతో రెచ్చిపోయాడు. యూపాక్షునితో ఇలా అన్నాడు. “ఇప్పుడు నేను రావణుని వద్దకు రాను. నేరుగా యుద్ధభూమికి వెళ్తాను. వానరులను, మానవులను సంహరించి అప్పుడు రావణుని వద్దకు వస్తాను. మీ రాక్షసులు అంతా ఆ వానరుల రక్తము తాగి వానరుల మాంసము ఆరగించండి. నేను ఆ మానవుల రక్తమాంసములు ఆరగిస్తాను.” అని అన్నాడు కుంభకర్ణుడు.

ఆ మాటలు విన్న మహోదరుడు ఇలా అన్నాడు. “నామాట కూడా కొంచెం వినండి. ముందు మనము రావణుని వద్దకు వెళదాము ఆయన ఏమి చెబుతాడో విని తరువాత తగిన విధంగా చేయండి.” అని వినయంగా పలికాడు. అది యుక్తియుక్తముగా ఉన్నది అని అనుకున్న కుంభకర్ణుడు ఈ వార్త రావణునికి తెలియజెయ్యమని రాక్షసులను రావణుని వద్దకు పంపాడు. .

ఈ వార్త రావణునికి చెప్పడానికి రాక్షసులు బయలు దేరి రావణుని వద్దకు వెళ్లారు. రావణునితో ఇలా అన్నారు. “మహారాజా! తమరి ఆదేశము ప్రకారము మేము కుంభకర్ణుని నిద్రలేపాము. ఆయన అటునుండి అటే యుద్ధ రంగమునకు వెళతాను అని అంటున్నాడు. కుంభకర్ణుడు యుద్ధరంగమునకు వెళ్లవలెనా, ఇక్కడకు రావలెనా తెలుపండి.” అని అడిగారు.

కుంభకర్ణుడు నిద్రలేచాడు అని తెలియగానే రావణుడు ఎంతో సంతోషించాడు. ఇంక విజయం తనదే అనుకున్నాడు. “మేము కుంభకర్ణుని మా మందిరములో చూడాలని అనుకుంటున్నాము. ఆయనను తగు మర్యాదలతో ఇక్కడకు తీసుకొని రండి.” అని

ఆదేశించాడు.ఆ రాక్షసులు వెంటనే కుంభకర్ణుని వద్దకు వెళ్లి ఇలా అన్నారు. "మహారాజా! తమరి కొరకు రావణుడు ఎదురుచూస్తున్నాడు." అని చెప్పారు. కుంభ కర్ణుడు తన ఆసనము మీది నుండి లేచాడు. కాలకృత్యములు తీర్చుకున్నాడు. చక్కగా అలంకరించుకున్నాడు. రెండువేల కుండల మద్యము తాగాడు. దానికి తగ్గట్టు మాంసము ఆరగించాడు. ప్రళయకాలంలో యమధర్మరాజు వలె కుంభకర్ణుడు అన్న రావణుని మందిరమునకు బయలుదేరాడు.

కుంభకర్ణుడు నడుస్తుంటే భూమి కంపిస్తూ ఉంది. కుంభకర్ణుడు రాజమార్గములో నడుస్తుంటే, కోటకు ఆవల ఉన్న వానరులు ఆ మహాకాయాన్ని చూచారు. వానరులకు కుంభకర్ణుని ఆకారం చూచి భయం కలిగింది. వెంటనే రాముని వద్దకు పోయి ఏదో ఒక మహాకాయము లంకలో నడుస్తూ ఉంది అని రామునితో చెప్పారు. కొంతమంది వానరులు వీడితో మనకెందుకు అని పారిపోయారు. ఒక పర్వతము నడిచివస్తున్నట్టు వస్తున్న కుంభకర్ణుని చూచి వానరులు భయంతో వణికిపోయారు.

శ్రీమద్రామాయణము
యుద్ధ కాండము అరవయ్యవ సర్గ సంపూర్ణము
ఓం తత్సత్ ఓం తత్సత్ ఓం తత్సత్

యుద్ధకాండము

అరవయ్యి ఒకటవ సర్గ.

రాముడు కూడా ఆకాశం అంత ఎత్తున ఉన్న కుంభకర్ణుని చూచాడు. ఆ అనూహ్యమైన ఆకారమును చూచి పారిపోతున్న వానరములను చూచాడు. ఆశ్చర్యపోయాడు. విభీషణుని చూచి ఇలా అన్నాడు. "విభీషణా! ఆకాశమంత ఎత్తున ఉన్న ఈ ఆకారము ఎవరు? ఇంత పెద్ద దేహము కలవాడు ఈ భూమి మీద వీడు ఒక్కడే ఉన్నట్టు ఉంది. వీడు ఎవరు? వీడి పేరేమి? వీడు అసురుడా, రాక్షసుడా, లేక వేరే జాతి ప్రాణియా. ఎందుకంటే నేను ఇంతవరకూ ఇటువంటి ప్రాణిని భూమి మీద చూడలేదు." అని అన్నాడు.

అప్పుడు విభీషణుడు ఇలా అన్నాడు. "ఓ రామా! ఇతని పేరు కుంభకర్ణుడు. రావణుని సోదరుడు. ఇతడు విశ్రవసుని కుమారుడు. యుద్ధములో ఇంద్రుని, యముడిని ఓడించాడు. రాక్షస జాతిలో ఇంత దేహము కల రాక్షసుడు ఎవరూ లేరు. ఇతడు దేవతలను, గంధర్వులను, పన్నగులను, దానవులను, యక్షులను, విద్యాధరులను ఓడించాడు. ఇతడు శూలం ధరించి యుద్ధభూమిలో తిరుగుతుంటే సాక్షాత్తు యముడు తిరిగినట్టు ఉంటుంది. ఇతడు సహజ బలసంపన్నుడు. ఈ కుంభకర్ణుడు పుట్టీ పుట్ట గానే వేలకొలది ప్రాణులను భక్షించాడు. వీడికి ఆకలి ఎక్కువ. దొరికిన దానిని దొరికినట్టు తినేసేవాడు. వాడు అలా తినడం మొదలెడితే భూమి మీద కొంతకాలానికి ప్రాణి అనేది మిగలదు అని తలచి ప్రజలందరూ ఇంద్రుని శరణు వేడారు. ఇంద్రుడు తన వజ్రాయుధముతో కుంభకర్ణుని

కొట్టాడు. అప్పుడు కుంభకర్ణుడు బిగ్గరగా అరిచాడు. ఆ అరుపులకు సగం జనం చచ్చారు. తరువాత కుంభకర్ణుడు ఇంద్రుడు ఎక్కిన ఐరావతము అనే ఏనుగు దంతమును ఊడపెరికి దానితో ఇంద్రుని వక్షస్థలము మీద పొడిచాడు. ఆ దెబ్బకు ఇంద్రుడు తల్లడిల్లిపోయాడు.

ఇంక ఇంద్రునితో లాభం లేదని దేవతలు అందరూ బ్రహ్మదేవుని వద్దకు వెళ్లారు. కుంభకర్ణుడు ముల్లోకములనూ పీడిస్తున్నాడనీ, దేవతలను ఎదిరిస్తున్నాడనీ, ఋషులను యజ్ఞ యాగములను చేసుకోనివ్వడం లేదనీ, ఆశ్రమములను నాశనం చేస్తున్నాడనీ, ఇతరుల భార్యలను అపహరిస్తున్నాడనీ, బ్రహ్మతో మొరపెట్టుకున్నారు. ఈ ప్రకారంగా కుంభకర్ణుడు ప్రాణులను తింటూ ఉంటే కొంత కాలానికి ఈ లోకంలో ప్రాణికోటి లేకుండా పోతారు అని కూడా విన్నవించుకున్నారు. వెంటనే బ్రహ్మ రావణుని, కుంభకర్ణుని, ఇతర రాక్షసులను తన దగ్గరకు పిలిపించుకున్నాడు.

కుంభకర్ణుని చూచి బ్రహ్మ ఆశ్చర్యపోయాడు. భయపడ్డాడు. 'ఆ విశ్రవసుడు నిన్ను ముల్లోకాలను నాశనం చెయ్యడానికే పుట్టించాడు రా!' అని మనసులో అనుకున్నాడు. కుంభకర్ణునికి ఘోర శాపం ఇచ్చాడు. "ఈ రోజు నుండి నీవు అచేనంగా పడి ఉండు" అని శపించాడు. బ్రహ్మదేవుని శాప మహిమ వలన వెంటనే కుంభకర్ణుడు నేలమీద పడిపోయాడు. చచ్చినవాడి మాదిరి పడిఉన్న కుంభకర్ణుని చూచి రావణుడు శోకించాడు. బ్రహ్మదేవుని చూచి ఇలా అన్నాడు. "ఓ బ్రహ్మదేవా! వీడు నీ ముని మనుమడు. నీ మునిమనుమని ఇలా శపించడం ధర్మమా! కాని నీ శాపం అమోఘము. వీడి ఇలా నిద్రావస్థలో ఉండవలసినదే కానీ కొంచెం నీ శాపమునకు విరామము

ఇవ్వమని నా ప్రార్థన. వీడు జీవితాంతము నిద్రపోకుండా అప్పుడప్పుడు మేల్కొని ఉండేట్టు వరం ప్రసాదించు.” అని ప్రార్థించాడు. అప్పుడు బ్రహ్మదేవుడు కరుణించి ఇలా అన్నాడు. “వీడు ఆరునెలలపాటు నిద్రలో ఉంటాడు. ఒక రోజు మాత్రం మెలుకువగా ఉంటాడు. ఆరోజున ఆహారం తీసుకుంటాడు. మరలా ఆరునెలలు నిగ్రపోతాడు.” అని అన్నాడు. ఇదీ వీడి చరిత్ర. ప్రస్తుతము వీడు నిద్రపోవలసిన సమయము. కానీ నీ మీద భయంతో రావణుడు వీడిని నిద్రలేపాడు. ఇప్పుడు వీడు నిద్రలేచి రావణుని వద్దకు వెళుతున్నాడు. అపర మృత్యుదేవతలా ఉన్న వీడిని చూచి వానరులు భయంతో పారిపోతున్నారు. మరి వీడితో వానరులు ఎలా యుద్ధం చేస్తారో ఏమో తెలియకుండా ఉంది” అని అన్నాడు విభీషణుడు.

అప్పుడు రాముడు విభీషణునితో ఇలా అన్నాడు. “ఇతడు రాక్షసుడు అని చెప్పకండి. వీడు యుద్ధములో శవములను తీయుటకు అమర్చబడిన యంత్రము అని ప్రచారం చెయ్యండి. వానరులలో ఉన్న భయాన్ని పోగొట్టండి.” అని అన్నాడు. రాముడు నీలుని చూచి ఇలా అన్నాడు. “నీలుడా! నీవు వానరసైన్యమును యుద్ధమునకు సమాయత్తం చెయ్యి. లంక అన్ని ద్వారముల వద్ద సైన్యమును అప్రమత్తం చెయ్యి. వానరములకు ఆయుధములైన పర్వత శిఖరములను, వృక్షములను, బండరాళ్లను ఒక చోట చేర్చండి. వానరులందరూ బండరాళ్లను, పర్వతములను, వృక్షములను ధరించి యుద్ధమునకు సన్నద్ధము అవుతారు.” అని అన్నాడు రాముడు. నీలుడు రాముడు చెప్పిన ప్రకారము వానరులకు ధైర్యము చెప్పి వారిని యుద్ధోన్ముఖులను చేసాడు.

వానరులందరూ కుంభకర్ణుని వల్ల కలిగిన భయమును వదిలిపెట్టి ఆయుధములు చేతబట్టారు.

శ్రీమద్రామాయణము

యుద్ధకాండము అరవై ఒకటవ సర్గ సంపూర్ణము

ఓం తత్సత్ ఓం తత్సత& ఓం తత్సత్

యుద్ధకాండము

అరవైరెండవ సర్గ.

కుంభకర్ణుడు లంకా నగర రాజమార్గములో నడుస్తున్నాడు. రావణుని మందిరము చేరుకున్నాడు. కుంభకర్ణుని దూరం నుండి చూచాడు రావణుడు. సింహాసనము మీది నుండి లేచి కుంభకర్ణునికి ఎదురుపోయి ప్రేమతో కౌగలించుకున్నాడు. కుంభకర్ణుడు రావణునికి పాదాభివందనము చేసాడు. "అన్నా రావణా! నన్ను ఎందుకునిద్ర లేపారు? నేను ఏమి చెయ్యాలి?" అని సూటిగా అడిగాడు.

అప్పుడు రావణుడు ఇలా అన్నాడు."తమ్ముడా కుంభకర్ణా! నీవు చాలా కాలము కిందట నిద్రకు ఉపక్రమించావు. ఈ లోపల చాలా విషయాలు జరిగాయి. ఇటీవల నాకు రాముడు అనే నరుని వలన కలిగిన భయం గురించి నీకు తెలియదు. ఈ రాముడు అయోధ్య రాజైన దశరథుని కుమారుడు. ఇతని స్నేహితుడు సుగ్రీవుడు అనే వానరుడు. రాముడు, సుగ్రీవుని సాయంతో సముద్రమును దాటి లంకలో ప్రవేశించాడు. లంకానగరాన్ని ముట్టడించాడు. లంకను ఆక్రమించాడు. ఎక్కడ చూచినా వానరులే. ఈ వానరయోధులు

మన రాక్షస వీరులను ప్రముఖులను ఎంతోమందిని చంపారు. వానరులకు కలిగిన నష్టం కంటే మనకు జరిగిన నష్టం అపారము. ఈ వానరులు ఎప్పుడూ యుద్ధం చేసినట్టు గానీ అందులో ఓడిపోయినట్టు గానీ కనపడదు. ఈ విధంగా నాకు నరులతో, వానరులతో భయం కలిగింది. నీవు యుద్ధంలో ఈ నరులను వానరులను చంపి నాకు మనశ్శాంతి కలిగించు. ఈ యుద్ధముతో మన కోశాగారము అంతా వ్యయము అయిపోయింది. లంకా నగరంలో స్త్రీలు, బాలురు, వృద్ధులు తప్ప ఎవరూ మిగలలేదు. కాబట్టి నా కోసం ఈ యుద్ధం చెయ్యి. నన్ను, లంకను, రక్షించు. ఇప్పటిదాకా నేను అందరినీ శాసించాను కానీ ఈ ప్రకారంగా ఎవరినీ కోరలేదు. కాబట్టి నా మాటలు మన్నించి యుద్ధం చెయ్యి.

ఓ తమ్ముడా! నీకు యుద్ధము కొత్త కాదు. దేవాసుర యుద్ధంలో నీవు రాక్షసుల పక్షాన పోరాడి వారికి విజయం సంపాదించి పెట్టావు. ఈ సమయంలో కూడా నీ పరాక్రమమును చూపించి నాకు విజయం చేకూర్చు. నీవు ఎలా యుద్ధం చేస్తావో నీ ఇష్టం. కానీ శత్రునాశనం మాత్రం జరగాలి. అదే నా ధ్యేయము." అని పలికాడు రావణుడు.

శ్రీమద్రామాయణము

అరవై రెండవ సర్గ సంపూర్ణము

ఓం తత్సత్ ఓం తత్సత్ ఓం తత్సత్

యుద్ధ కాండము

అరువది మూడవ సర్గ.

ముల్లోకములను గడగడలాడించిన పరాక్రమవంతుడు అయిన రావణుడు తన ముందు అంత దీనంగా మాట్లాడటం చూచి కుంభకర్ణుడు బిగ్గరగా నవ్వాడు. రావణునితో ఇలా అన్నాడు. "అన్నా రావణా! నాకు చూడగా, నీవు నీ మంత్రులతో చర్చించినపుడు, వారు చెప్పిన మంచి మాటలను చెవిని పెట్టినట్టులేదు. అందుకే నీకు ఈ ఆపదకలిగింది. అవునా! ఇది ఎవరో చేసినది కాదు. నీవు చేసుకున్న దుష్కర్మ నీకు ఈ కష్టములను తెచ్చిపెట్టింది. నీవు దుష్కార్యమును చేసావు. అది చేయబోయే ముందు ఎవరితోనన్నా ఆలోచించావా! బాగోగులు విచారించావా! ఆ చేయబోయే పనికి ఫలితం ఎలా ఉంటుందో ఊహించావా! ఇవేమీ ఆలోచించకుండా చేయకూడని పనులు చేసి ఇప్పుడు చింతించి ఏమి ప్రయోజనము.

నీకు బలము, దర్పము, పరాక్రమము ఉంది కదా అని చేయకూడని పనులు చేస్తే ఫలితం ఇలాగే ఉంటుంది. ఇంకా దారుణంగా కూడా ఉంటుంది. నీవు లంకాధీశుడవు. నీకు తగ్గపనులు చెయ్యాలి కానీ, నీవు చేయకూడని పనులు చేయడం ధర్మమా! ఒక పని చేసే ముందు దేశ, కాలములు అనుకూలంగా ఉన్నవా లేవా అని చూచుకోవాలి కదా! ఏది పడితే అది, ఎప్పుడు పడితే అప్పుడు, ఎక్కడ పడితే అక్కడ చేసెయ్యడమేనా!

ఏ పని చేసే ముందు అయినా మంత్రులతో మంచి చెడ్డలు విచారించి ఆయా పనులు చేస్తాడో అతడే నీతివంతుడైన రాజు. నీతి వంతుడైన రాజు తాను చేయబోయే పని గురించి ముందు తాను ఆలోచిస్తాడు. శాస్త్రములు ఏంచెప్పాయో తెలుసుకుంటాడు. తనువాత మంత్రులతో ఆలోచిస్తాడు. తరువాత సరి అయిన నిర్ణయం తీసుకుంటాడు. వాడే ఉత్తముడు నీతి మంతుడు అయిన రాజు.

ధర్మము, అర్థము, కామము మూడు పురుషార్థములు. వాటిని ఏ యే సమయములందు ఆచరించవలెనే ఆయాసమయము లలో ఆచరించు వాడు ఉత్తముడు. అలా చేయని వాడు ఎన్ని శాస్త్రములు చదివినా నిష్ప్రయోజనము. ఉపాయములు మూడు విధములు. సామ,దాన,భేదోపాయములు. ఆఖరుది దండోపాయము. వాటిని మంత్రుల సహకారంతో కాలానుగుణంగా ఉపయోగించాలి. అటువంటి రాజుకు ఎలాంటి ఆపదలు రావు. రాజు తాను చేయబోయే పనుల యొక్క యదార్థస్వరూపమును తెలుసుకొని, మంత్రులతో ఆలోచించి, తగు నిర్ణయం తీసుకోవాలి. తనకు ఏది హితము కలుగచేస్తుందో ఆ పనిని మాత్రమే చెయ్యాలి.

నాకు చూడ నీ మంత్రులు నీకు సరి అయిన ఆలోచనలు హితములు చెప్పినట్టు లేదు. అటువంటి వారి ఆలోచనలు ఇలాగే నిన్ను ఆపదలలోకి నెడుతాయి. బుద్ధిలేని వారితో ఆలోచిస్తే పరిణామాలు ఇలాగే ఉంటాయి. నిన్ను పొగిడే వాళ్లను, నీవు ఏం చెప్పినా ఎద్దులా తల ఊపేవాళ్లను దగ్గరకు చేరనీయవద్దు. అంతే కాకుండా శాస్త్ర జ్ఞానము, అర్థశాస్త్ర జ్ఞానము లేని వారిని దూరంగా ఉంచాలి. అలాంటి వారు నీకు

మంచి చేయకపోగా, నిన్ను ఆపదలలోకి నెడుతారు. కొంత మంది మంత్రులు శత్రువులతో చేతులు కలిపి రాజుతో చేయకూడని పనులు చేయించి అతనిని అప్రతిష్టపాలు చేస్తారు. అటువంటి వారిని దూరంగా ఉంచాలి. శత్రురాజుల నుండి కానుకలు పుచ్చుకొని, నీకు అనుకూలంగా ఉన్నట్టు నటిస్తూ నీకు ద్రోహం చేసేవారిని ఒక కంట కనిపెట్టి ఉండాలి. ఎలాంటి ఆలోచనా లేకుండా తొందరపాటుతో పనులు చేసే రాజును, శత్రువులు తొందరగా లొంగదీసుకుంటారు. శత్రువుల విషయంలో నిర్లక్ష్యంగా ఉంటూ తనను తాను నిర్లక్ష్యం చేసుకొనేవాడు, ఆపదలు పొందుతాడు.

ఆఖరుగా ఒక్కమాట. మన తమ్ముడు విభీషణుడు నీకు ఏమి చెప్పాడో అది చెయ్యి. లేకపోతే నీ ఇష్టం." అని ఊరుకున్నాడు కుంభకర్ణుడు.

కుంభకర్ణుని మాటలు విని రావణునికి కోపం వచ్చింది. "తమ్ముడా కుంభకర్ణా! ఏమిటి పెద్ద అన్నీ తెలిసిన వాడి మాదిరి మాట్లాడుతున్నావు. గురువు మాదిరి నాకు ఉపదేశిస్తున్నావు. అనవసరంగా మాట్లాడి నీ సమయం నా సమయం వృధా చెయ్యకు. ప్రస్తుతం వచ్చిన సమస్యకు పరిష్కారం ఆలోచించు. తగిన విధంగా ఆచరించు. తెలిసి చేసానో, తెలియక చేసానో, చిత్తభ్రమతో చేసానో, నా బలపరాక్రమముల మీద నమ్మకంతో చేసానో, రాముడి వద్దనుండి సీతను అపహరించి తెచ్చాను. ప్రస్తుతం దానిని గురించి ఆలోచించడం అనవసరము. నీకు నా యందు ప్రేమ ఉంటే, నాకు సాయం చెయ్యాలని నీకు అనిపిస్తే, ఈ కార్యము చేయతగినది అని నీకు అనిపిస్తే కేవలం నా పొరపాటు వలన సంభవించిన ఈ

ఆపదనుంచి నన్ను గట్టెక్కించు. అది నీ ఒక్కడి వల్లనే సాధ్యం అవుతుంది అని నా నమ్మకం. కుంభకర్ణా! నీవు నాకు తమ్ముడివే కాదు. మంచి స్నేహితుడివి కూడా! కష్టములలో ఉన్న వాడిని ఆదుకున్నవాడే స్నేహితుడు. నీతి తప్పి ప్రవర్తించినా, సహృదయంతో సాయం చేసినవాడే బంధువు. ప్రస్తుతము నేను కష్టాలలో ఉన్నాను. నన్ను రక్షించు." అని అన్నాడు.

తన మాటలకు రావణునికి కోపం వచ్చిందని తెలుసుకున్నాడు కుంభకర్ణుడు. అందుకని అన్నతో మృదువుగా మాట్లాడాడు. "అన్నయ్యా! రావణా! నా మాటలకు బాధపడకు. స్థిరచిత్తంతో ఉండు. నేను జీవించి ఉండగా నీకు ఏ ఆపదా రాదు. ధైర్యంగా ఉండు. ఎవరి వలన నీకు ఈ దు:ఖము కలిగిందో ఆ దు:ఖకారకుడిని నేను చంపుతాను. నీవు ఏ పరిస్థితులలో ఉన్నా నీకు హితము చెప్పడం నా ధర్మము. నీకు నాకు ఉన్న బంధుత్వము వలనా సోదర ప్రేమ వలనా. నాకు తోచిన మంచి మాటలు చెప్పాను. నీకు బాధ కలిగించి ఉంటే క్షమించు. ఇప్పుడు నీ సోదరుడిగా నేను నిన్ను ఆదుకుంటాను. నీ కోసరం యుద్ధం చేస్తాను. శత్రువులను సంహరిస్తాను. నేను రామలక్ష్మణులను యుద్ధంలో సంహరిస్తాను. అది చూచి వానరులు పారిపోతారు. నేను రాముని తలను ఖండించి తీసుకొని వస్తాను. నీకు సంతోషము, సీతకు దు:ఖము కలిగిస్తాను. రాముని చేతిలో చంపబడ్డ రాక్షసుల బంధువులు ఈ నాడు రాముని మరణమును కళ్లారా చూస్తారు. రామలక్ష్మణులనే కాదు, ఆ సుగ్రీవుని కూడా కిందపడవేసి నలిపివేస్తాను. నేను రాముని చంపాలని నిర్ణయం తీసుకున్న తరువాత కూడా ఎందుకు బాధపడుతున్నావు. రాముని

మరణం కళ్లారా చూడటానికి సిద్ధంగా ఉండు.

అన్నా రావణా! నేను బతికి ఉండగా రాముడు నిన్ను ఏమీ చెయ్యలేడు. నన్ను చంపిన తరువాతనే రాముడు నిన్ను చంపగలడు. నన్ను చంపడం ముల్లోకములలో ఎవరి తరమూ కాదు. ఇంక ఈ నర, వానరులు ఎంత. రాముడి వెంట ఇంద్రుడు, వరుణుడు, అగ్ని, కుబేరుడు వచ్చినా నేను భయపడను. అందరినీ ఓడిస్తాను. నీకు జయం చేకూరుస్తాను. నేను గట్టిగా గర్జిస్తే ఇంద్రుడు కూడా గడ గడ వణికిపోతాడు. అసలు నేను ఆయుధమును కూడా పట్టుకోపని లేదు. నా ఎదుట నిలిస్తే చాలు. వాడి ప్రాణాలు అనంత వాయువుల్లో కలిసిపోతాయి. నేను నా చేతులతోనే ఎవరినైనా చంపగలను. అంతశక్తి ఉంది నాకు. కాబట్టి నేను రాముని ఒకే ఒక్క పిడికిలి గుద్దుతో చంపుతాను. నా పిడికిలి గుద్దుకు కూడా రాముడు చావకపోతే, అప్పుడే నేను మారణాయుధములు, అస్త్రములు ఉపయోగించి రాముని చంపుతాను.

అన్నా రావణా! నేను ఇప్పుడే యుద్ధమునకు బయలుదేరుతున్నాను. రాముని గురించి భయం వదిలిపెట్టు. సంతోషంగా ఉండు. ఒక్క రాముని కాదు, వానర నాయకుడు సుగ్రీవుని, లంకను కాల్చిన హనుమంతుని చంపుతాను. వానరులను చుట్ట చుట్టి నోటిలో పెట్టుకొని తినేస్తాను. నాకు కోపం వస్తే ఇంద్రుడు, దేవతలు కూడా గడగడవణికిపోతారు. దేవతలు, అసురులు, గంధర్వులు చాలా కాలం తరువాత కుంభకర్ణుని పరాక్రమాన్ని చూస్తారు.

నీవు భయం వదిలిపెట్టు. మద్యం సేవించు. అందమైన స్త్రీలతో క్రీడించు. ఆనందాన్ని అనుభవించు. నేను రాముని చంపిన తరువాత సీత నీపక్కన చేరగలదు.” అని అన్నాడు కుంభకర్ణుడు.

శ్రీమద్రామాయణము
యుద్ధకాండము అరువది మూడవ సర్గ సంపూర్ణము
ఓం తత్సత్ ఓం తత్సత్ ఓం తత్సత్

యుద్ధకాండము
అరువది నాలుగవ సర్గ.

కుంభకర్ణుడు రావణునితో పలికిన పలుకులు అన్నీ పక్కనే కూర్చుని ఉన్న మహెూదరుడు విన్నాడు. మహెూదరుడు కుంభకర్ణునితో ఇలా అన్నాడు. “ఓ కుంభకర్ణా! నీవు ఉన్నత వంశంలో జన్మించావు. కాని ఉన్నతంగా ఆలోచించడం లేదు. గర్వంతో ఎప్పుడు ఏమి చెయ్యాలో తెలియకుండా మాట్లాడుతున్నావు. రావణుడు మహారాజు. ఆయనకు తెలియని నీతి లేదు. నీవు ఇప్పుడు రావణునికి నీతులు చెప్ప పనిలేదు. ఏదో బాల్యచాపల్యంతో మాట్లాడుతున్నావు. రావణుడు లంకాధిపతి. దేశ కాలములను బాగా ఎరిగిన వాడు. ఎప్పుడు ఎక్కడ ఏ పని చెయ్యాలో తెలిసినవాడు. తాను చేయబోయే పని గురించి మంచి చెడ్డలు బాగా తెలిసినవాడు.

నీవు ధర్మము అర్థము కామము గురించి మాట్లాడావు. కానీ వాటి లక్షణముల గురించి, స్వరూప స్వభావముల గురించి

నీకు తెలుసా! సుఖం కలిగినా దు:ఖము కలిగినా, దానికి ముందు చేసిన కర్మలే కారణము. కానీ ఒక్కోసారి చెడ్డపనులు కూడా మంచి ఫలితాలను ఇస్తాయి. ధర్మం కోసరం చేసే పనులూ, అధర్మం కోసం చేసే పనులూ రెండూ శ్రేయస్సును కలుగచేస్తాయి. ఒక్కోసారి ధర్మం కొరకు చేసే పనులు కీడును కలిగిస్తాయి. పురుషులు ఈ లోకానికి పరలోకానికి పనికి వచ్చే కర్మలను కోరికలతో చేస్తూ ఉంటారు. ఆ కర్మలు సత్ఫలితాలను ఇస్తున్నాయి కదా! కాబట్టి మంచి పనులు చేస్తే పుణ్యం, చెడ్డ పనులు చేస్తే పాపం వస్తుంది అన్న మాట సరికాదు. ధర్మంగా కర్మలు చేస్తే శ్రేయస్సు కలుగుతుంది. అధర్మ ప్రవృత్తితో కర్మలు చేస్తే దు:ఖము కలుగుతుంది అని చెప్పడానికి కారణం ఏమీ లేదు. అందుకని రావణుడు తనకు తోచిన పని చేసాడు. మేమంతా దానికి సమ్మతించాము. దాని వలన యుద్ధం వచ్చింది. యుద్ధం చెయ్యాలి కానీ జరిగిన దానికి చింతించడం అవివేకము.

ఏదో నువ్వు ఒక్కడివే రాముడిని, లక్ష్మణుడిని, వానర సేనలను అందర్నీ చంపుతాను అని అంటున్నావు. కాని జనస్థానములో ఒంటి చేత్తో 14,000 మంది రాక్షసులను చంపిన రాముని నువ్వు ఎలా చంపగలవు. జనస్థానములో రాముడి చేతిలో నుండి చావు తప్పించుకొన్న రాక్షసులు ప్రస్తుతము లంకలో రాముని వలన భయంతో బతుకుతున్నారు. ఆ సంగతి నీకు తెలియదా! రాముడు నిద్రపోతున్న సింహము అని తెలిసికూడా ఆ సింహము జూలుపట్టుకొని లాగడానికి వెళుతున్నావు. రాముడికి కోపం వస్తే అతని ముందు ఎవరూ నిలువలేరు. కాబట్టి నువ్వు ఒక్కడివే యుద్ధం చేసి రాముని చంపుతాను అనడం సరికాదు. నీవు ఒంటరిగా యుద్ధానికి వెళ్లడానికి వీలులేదు. ప్రస్తుతము మన బలము క్షీణదశలో ఉంది. రాముని బలం

మెండుగా ఉంది. ఇటువంటి సమయంలో ఎవరైనా రామునితో యుద్ధానికి వెళతారా! రామునితో సమానమైన బలపరాక్రమములు కలవాడు ముల్లోకములలో లేడు. అట్టి రామునితో నీవు ఒంటరిగా ఎలా యుద్ధంచేయాలని అనుకుంటున్నావు?"అని పలికాడు మహోదరుడు.

తరువాత రావణుని చూచి మహోదరుడు ఇలా అన్నాడు. "లంకేశ్వరా! నీవు సీతను అపహరించి తెచ్చావు. సీత లంకలో నీ ఎదురుగా ఉంది. ఇంకా ఎందుకు ఆలస్యం చేస్తున్నావు. నీవు తలచుకుంటే సీతను అనుభవించడం క్షణంలో పని. సీతను లొంగదీసుకొనే ఉపాయము ఒకటి చెబుతాను విను.

రాముని మీదికి యుద్ధమునకు నేను, కుంభకర్ణుడు, మహోదరుడు, ద్విజిహ్వుడు, సంహ్రాది, వితర్దనుడు, ఈ ఐదుగురు వెళుతున్నారు అని లంకానగరంలో ప్రచారం చేయించు. మేము రామలక్ష్మణులను, వానరవీరులను జయిస్తే ఇంక ఏ ఉపాయముతో పని లేదు. ఒక వేళ, రాముడు విజయం సాధిస్తే, మేము మా ఒంటి మీద రామ బాణములతో గాయములు చేసుకొని యుద్ధభూమి నుండి వస్తాము. "మేము రామలక్ష్మణులను భక్షించాము" అని నీకు విన్నవించుకుంటాము. నీవు మాకు తగిన పారితోషికములను బహుమానములను ఇస్తావు. తరువాత రాముడు లక్ష్మణుడు సుగ్రీవుడు యుద్ధములో మరణించారు అని లంకానగరంలో ఘోషణ చేయించు. నీవు మహా సంతోషంతో ఉన్నట్టు నటించు. రాక్షస సేనలకు బహుమానాలు పంచిపెట్టు. అందరూ మద్యపానము చేస్తూ

ఆనందిస్తారు

తరువాత నీవు సీతను ఏకాంతంగా కలుసుకో. రామలక్ష్మణుల మరణ వార్త సీతకు చెప్పు. ఆమెకు ధనమును, రత్నమణిమాణిక్యాదులను ఆశచూపించు. దీనంగా బతిమాలుకో. వినకపోతే భయపెట్టు. చంపుతానని బెదిరించు. రాముడు ఎటూ మరణించాడు కాబట్టి సీత తనకు ఇష్టం లేకపోయినా, వేరు గత్యంతరము లేక నిన్ను వరిస్తుంది. ఎందుకంటే జీవితమంతా సుఖాలలో పెరిగిన సీత, 12 ఏళ్లు కష్టాలను అనుభవించింది. తను సుఖపడాలంటే నీకు లొంగాలని తెలుసుకున్న సీత సులభంగా నీకు లొంగిపోతుంది. ఇదంతా నేను బాగా ఆలోచించి వేసిన ప్రణాళిక. మనము రామునితో యుద్ధము చేయకుండానే సీతను దక్కించు కోవచ్చు. ఒక సారి సీత నీకు లొంగితే, రాముడు యుద్ధం విరమిస్తాడు. వెనక్కుతిరిగి వెళ్లిపోతాడు. మనకు సైన్య నష్టం లేకుండా, యుద్ధము చేయకుండా, రాముని జయించ వచ్చును. నీకు సీత దక్కుతుంది. సీతతో పాటు కీర్తియశస్సు కూడా దక్కుతాయి. నీవు మనసు పడ్డ సీతతో సుఖిస్తావు." అని అన్నాడు మహోదరుడు.

శ్రీమద్రామాయణము
యుద్ధకాండము అరువది నాలుగవ సర్గ సంపూర్ణము
ఓం తత్సత్ ఓం తత్సత్ ఓం తత్సత్

యుద్ధకాండము

అరువది ఐదవ సర్గ.

మహోదరుని మాటలు విన్న కుంభకర్ణునికి మిక్కుటంగా కోపం వచ్చింది. మహోదరుని ఒక్కసారిగా విదిలించి కొట్టాడు. తన అన్న రావణుని చూచి ఇలా అన్నాడు. "రాక్షసేంద్రా! నీవు నిశ్చింతగా ఉండు. నేను యుద్ధభూమికి పోయి ఆ రామలక్ష్మణులను చంపి నీ భయాన్ని పోగొడతాను. నావంటి శూరులు నీరులేని మేఘముల వలె ఊరికే గర్జించరు. నేను నా పరాక్రమము యుద్ధభూమిలో చూపిస్తాను కానీ మాటలలో చూపించను. నా వంటి శూరుడు తనను తాను పొగుడుకోడు. తనకు శక్యము కాని పనులను కూడా చేసి చూపిస్తాడు.

ఓ మహోదరా! నీ వంటి వారు పలికే మాటలు తమను తాము గొప్పవారము అనుకొనే రాజులు వింటారు కానీ రావణుడు కాదు. మీరు పిరికి పందలు. మీకు యుద్ధము అంటే భయము. కుయుక్తులు, కుతంత్రములతో పని కానిద్దామంటారు. రాజు దగ్గర ప్రగల్భాలు పలుకుతూ రాజు మెప్పు పొందడానికి ప్రయత్నిస్తూ ఉంటారు. రాజును అపకీర్తిపాలు చేస్తుంటారు. రావణుని హితం కోరేవారు, రామునికి మంచి సలహాలు చెప్పేవారు ఈ లంకలో లేనట్టుంది. పాపము రావణుడు ఒంటరివాడయ్యాడు. ఇప్పటి దాకా మీరు చేసిన తప్పులను నేను సరిదిద్దుతాను. ఇప్పుడే యుద్ధమునకు బయలుదేరుతున్నాను." అని అన్నాడు కుంభకర్ణుడు.

కుంభకర్ణుని మాటలు విని రావణుడు నవ్వాడు. "సహోదరా కుంభకర్ణా! నీవు చెప్పినది సత్యము. ఈ మహోదరుడు రామునికి భయపడుతున్నాడు. అందుకే రామునితో యుద్ధమునకు ఇష్టపడుటలేదు. రామునితో యుద్ధము చేయుటకు నీవే సమర్ధుడివి. శత్రువులను సంహరించి విజయుడవై తిరిగిరా! నాకు వేరు గత్యంతరము లేకనే కదా నిన్ను అర్ధాంతరంగా నిద్రలేపాను. ఆ రాజకుమారులను, వానరులను తనివితీరా భక్షించు. నీవు యుద్ధము చేయనక్కరలేదు. యుద్ధభూమిలో నిన్ను చూడగానే వానరులంతా పారిపోతారు. రామలక్ష్మణులకు గుండెలు పగులుతాయి. సునాయాసంగా యుద్ధము ముగిసిపోతుంది. నీకు విజయం సిద్ధిస్తుంది." అని పలికాడు రావణుడు.

తన అన్న రావణుడు పలికిన పలుకులకు కుంభకర్ణుడు మహదానందభరితుడయ్యాడు. యుద్ధమునకు పోవడానికి సన్నద్ధుడయ్యాడు. ఇనుముతో చేయబడిన తన ఆయుధము అయిన శూలమును తీసుకున్నాడు. రావణునితో ఇలా అన్నాడు. "రాక్షసేంద్రా! నాకు ఎవరి సాయమూ అక్కరలేదు. ఎలాంటి సైన్యసాయమూ అవసరము లేదు. నేను ఒంటరిగానేయుద్ధము చేయగలను. వానరులనందరినీ భక్షిస్తాను." అని అన్నాడు.

దానికి రావణుడు ఇలా అన్నాడు. "అలాకాదు. యుద్ధమునకు పోవడానికి సైనిక బలము అత్యావశ్యకము. నీ వెంట శూలములు, ముద్గరలు ధరించిన సైనికులు వస్తారు. వారు వానరులను కొరికి చంపుతారు. నీకు సాయంగా ఉంటారు. కాబట్టి నీవు రాక్షస సైన్యముతో కలిసి వెళ్లి రామలక్ష్మణులతో యుద్ధము

చెయ్యి." అని అన్నాడు రావణుడు.

తరువాత రావణుడు తన ఆసనము నుండి లేచాడు. మణులతో తయారు చేయబడిన ఒక కంకణమును కుంభకర్ణుని చేతికి కట్టాడు. కుంభకర్ణుడికి సకల అలంకారములు చేయించాడు. నిలబడి ఉన్న కుంభకర్ణుడు పాలసముద్రములో నిలబెట్టబడిన మంధర పర్వతము మాదిరి ఉన్నాడు. సర్వాలంకార భూషితుడైన కుంభకర్ణుడు అన్న రావణునికి ప్రదక్షిణము చేసి నమస్కరించాడు. రావణుడు కుంభకర్ణుని విజయోస్తు అని దీవించాడు. రణదుందుభులు, భేరీలు మోగుతుండగా, శంఖధ్వానములు మిన్నుముట్టగా, గజబలము, అశ్వికబలము, కాల్బలములతో కుంభకర్ణుడు యుద్ధమునకు బయలుదేరాడు.

చేత శూలము ధరించిన కుంభకర్ణుడు సేనలకు ముందు నడుస్తున్నాడు. ఆ రాక్షసుల చేతుల్లో శూలములు, కత్తులు, గండ్ర గొడ్డళ్లు, పరిఘలు, గదలు, ముసలములు, పెద్ద పెద్ద తాటి చెట్లు ఆయుధములుగా ఉన్నాయి. కుంభకర్ణుడు చూచేవారికి భయం కలిగించే ఆకారంలో ప్రకాశిస్తున్నాడు. కుంభకర్ణుని శరీరము చుట్టుకొలత నూరు ధనుస్సుల పొడుగు అనగా రెండువందల గజాల పొడుగు, ఆరువందల ధనుస్సుల ఎత్తు, 1200 గజాల ఎత్తు, కలిగి మహాపర్వతము మాదిరి ఉంది. అటువంటి భయంకరాకారము కలిగిన కుంభకర్ణుడు రాక్షసులతో ఇలా అన్నాడు. "ఇప్పుడు మనము వానరులతో యుద్ధం చేయబోతున్నాము. నేను వానరులను చిన్న చిన్న భాగములుగా చేసి కాల్చి తింటాను. ఈ వానరులు అడవులలో,

ఉద్యానవనములతో తిరిగేవారు. నిజానికి వారు నాకు ఏ అపకారమూ చేయలేదు. ఆ వానరులను చంపడం వృధా. దీని కంతటికీ రాముడు మూలము. కాబట్టి ముందు రాముని చంపుతాను. రాముని చంపితే అందరినీ చంపినట్టే. అందుకని మన దృష్టి అంతా రాముని మీద ఉండాలి." అని పలికాడు కుంభకర్ణుడు. ఆమాటలకు రాక్షసులు పెద్దగా హర్షధ్వానాలు చేసారు.

కుంభకర్ణుడు యుద్ధమునకు బయలుదేరగానే, ఇదివరకు మాదిరిగానే ఎన్నో దుశ్శకునములు గోచరించాయి. ఉల్కాపాతం జరిగింది. ఆకాశంలో నల్లటి మేఘాలు కమ్ముకున్నాయి. తీవ్రమైన గాలులు వీచాయి. పిడుగులు పడ్డాయి. నక్కలు వికృతంగా అరుస్తున్నాయి. ఆకాశంలో పక్షులు అపసవ్యంగా తిరుగుతున్నాయి. కుంభకర్ణుని శూలము మీద ఒక గద్ద వాలింది. అతని ఎడమ కన్ను ఎడమ భుజము అదిరింది. సూర్యుడు మబ్బులచాటుకు పోయాడు. అమిత బలపరాక్రమములు కలిగిన కుంభకర్ణుడు ఈ దుర్నిమిత్తము లను ఏ మాత్రమూ లెక్కచెయ్యలేదు.

పెద్ద పర్వతము మాదిరి నడుస్తున్న కుంభకర్ణుడు లంకా నగర ప్రాకారమును, చిన్న బండరాయిని దాటినట్టు తన పాదములతో దాటాడు. ప్రాకారము వెలుపల మోహరించి ఉన్న వానరసైన్యము ముందు నిలబడ్డాడు. పెద్ద పర్వతము తమ ముందు నిలబడి ఉందా అని భ్రమపడ్డ వానరులు కుంభకర్ణుని చూడగానే దిక్కులు పట్టిపారిపోయారు. తనను చూచి పారిపోతున్న వానరులను చూచి కుంభకర్ణుడు పెద్దగా వికటాట్టహాసము చేసాడు. మేఘము ఉరిమినట్టు గర్జించాడు. కుంభకర్ణుని వికటాట్టహాసము, గర్జన వల్ల

పుట్టిన విపరీతమైన ధ్వనికి వానరులు ఎక్కడి వాళ్లు అక్కడ కూలిపోయారు. చేత శూలము ధరించిన కుంభకర్ణుడు గద ధరించిన యమధర్మరాజు మాదిరి యుద్ధభూమిలో నిలబడ్డాడు.

శ్రీమద్రామాయణము

యుద్ధకాండము అరువది ఐదవ సర్గ సంపూర్ణము.

ఓం తత్సత్ ఓం తత్సత్ ఓం తత్సత్

యుద్ధకాండము

అరువది ఆరవ సర్గ.

కుంభకర్ణుని చూచి పారిపోతున్న వానరులలో వానర ప్రముఖులైన నలుడు, నీలుడు, గవాక్షుడు, కుముదుడు మొదలగువారు ఉన్నారు. ఆ ప్రకారంగా పారిపోతున్న వానర ప్రముఖులను చూచి అంగదుడు ఇలా అన్నాడు. “ఓ వానరవీరులారా! ఒక రాక్షసుని చూచి ఇలా పారిపోవడం ధర్మమా! మీరు ఎంతటి ఉన్నత కుటుంబంలో జన్మించారు. ఒక నీచ రాక్షసునికి భయపడు తున్నారా! అయిన పారిపోయి ఎక్కడికి పోతారు! ఎంత దూరం పోతారు! వెనక్కురండి. ఇతడు రాక్షసుడు కాడు. మనలను భయపెట్టడానికి రాక్షసులు సృష్టించిన పెద్ద విగ్రహము. రండి. మనమందరమూ కలిసి ఈ బొమ్మను తునాతునకలు చేద్దాము.” అని ఎలుగెత్తి అరిచాడు.

అంగదుని మాటలకు వానరులకు ధైర్యము వచ్చింది. పారిపోయిన వాళ్లు తిరిగి వచ్చారు. చేతికి అందిన వృక్షములను,

పర్వత శిఖరములను పట్టుకొని యుద్ధమునకు సిద్ధం అయ్యారు. ఆ కుంభకర్ణుని చుట్టూ చేరి వాడిని వృక్షములతో పర్వతశిఖరములతో కొట్టారు. ఆ వానరులు కొట్టే దెబ్బలు కుంభకర్ణునికి చీమకుట్టినట్టయినా లేదు. కుంభకర్ణుని మీదకు విసిరిన వృక్షములు, పర్వతశిఖరములు కుంభకర్ణుని శరీరమునకు తగిలి తునాతునకలై పోతున్నాయి. కుంభకర్ణుడు కోపించి వానరసేనలను తన చేతులతో నలిపేస్తున్నాడు. యుద్ధభూమి అంతా వానరుల శవాలతో నిండిపోయింది. కుంభకర్ణుని చేతిలోపడకుండా తప్పించుకున్న వానరులు కొంతమంది పారిపోయారు. కొంతమంది సముద్రంలో దూకారు. మరి కొంత మంది ఆకాశంలోకి ఎగిరిపోయారు. దొరికిన వారిని దొరికినట్టు చంపుతున్నాడు కుంభకర్ణుడు.

కుంభకర్ణుని ధాటికి తట్టుకోలేక భల్లూకములు కొన్ని చెట్టు ఎక్కాయి. కొన్ని పర్వతముల మీదికి పారిపోయాయి. మరి కొన్ని కొండగుహలలో తలదాచుకున్నాయి. మరి కొంత మంది వానరులు, భల్లూకములు చచ్చినట్టు నేలమీద కదలకుండా పడుకున్నారు. ఇలా ఎవరి దోవన వారు పారిపోతున్న వానరులను చూచి అంగదుడు బిగ్గరగా అరుస్తున్నాడు.

"ఓ వానరవీరులారా! భయపడకండి పారిపోకండి. యుద్ధము చేయండి. ఎక్కడికి పోయి ప్రాణాలు రక్షించుకుంటారు. వెనక్కురండి. యుద్ధమునుండి పారిపోయి వచ్చిన మిమ్ముల్ని చూచి మీ భార్యలు పరిహాసం చేస్తారు. ఆ అవమానం కంటే యుద్ధంలో చావడం మేలు కదా! మనమందరమూ ఉత్తమ కులంలో పుట్టాము. సాధారణ వానరుల వలె పారిపోవడం భావ్యమా! అది గౌరవ ప్రతిష్ఠలను

తెచ్చిపెడుతుందా! యుద్ధానికి బయలుదేరేముందు మీరు అన్న మాటలు పలికిన వీరాలాపాలు ఒక్కసారి జ్ఞప్తికి తెచ్చుకోండి. ఇప్పుడు ఆ వీరాలాపాలు అన్నీ ఎక్కడికి పోయాయి. యుద్ధము నుండి పారిపోయి, పదిమంది చేత ఛీ అనిపించుకోడం కన్నా, యుద్ధంలో మరణించి వీరస్వర్గం పొందడం మేలు కదా!

ఓ వానరవీరులారా! మనకు ఆయుర్దాయము లేకపోతే ఎక్కడ ఉన్నా చస్తాము. ఆయుర్దాయము ఉంటే యుద్ధములో విజయం సాధిస్తాము. ఒక్కమాట! మనము యుద్ధంలో గెలిస్తే కీర్తిపొందుతాము. మరణిస్తే వీరస్వర్గము పొందుతాము. కాని పారిపోతే దిక్కులేని చావు చస్తాము. కాబట్టి పారి పోకండి. వెనుకకు రండి. రాముడి పరాక్రమము ముందు ఈ రాక్షసుడు ఎంత! క్షణంలో నాశనమై పోతాడు.

ఇప్పటి దాకా మనము ఎంతో మంది రాక్షస వీరులను జయించాము. ఈ ఒక్కడికి భయపడి పారిపోతే మనము ఇప్పటిదాకా గడించిన కీర్తి అంతా బూడిదలో పోసిన పన్నీరు అవుతుంది. రండి. వెనుదిరగండి. యుద్ధము చేయండి" అని అరుస్తున్నాడు కానీ ఎవరూ అతని అరుపులు పట్టించుకోవడం లేదు.

కాని కొంతమంది వానర వీరులు అంగదునితో ఇలా అన్నాడు. "అంగదా! ఇప్పటిదాకా చేసిన యుద్ధము చాలు. మాకు ఈ యుద్ధము అక్కరలేదు. మా ప్రాణాలే మాకు తీపి. నీవుకావలిస్తే ఆ భయంకరాకారుడితో యుద్ధం చెయ్యి" అని పలికి పారిపోయారు.

కాని అంగదుడు తన ప్రయత్నము మానుకోలేదు. పోయిన వారు పోగా మిగిలిన వారిని బతిమాలి వెనుకకు తీసుకొని వస్తున్నాడు. వెనకకు వచ్చినవారంతా అంగదుని ఆజ్ఞల కొరకు ఎదురుచూస్తున్నారు.

శ్రీమద్రామాయణము
యుద్ధకాండము అరువది ఆరవ సర్గ సంపూర్ణము
ఓం తత్సత్ ఓం తత్సత్ ఓం తత్సత్

యుద్ధకాండము
అరువది ఏడవ సర్గ.

పారిపోయి తిరిగివచ్చిన వానర వీరులు ప్రాణాలకు తెగించి యుద్ధంచేస్తున్నారు. వారు పెద్ద పెద్ద వృక్షములను, గండ శిలలను, పర్వత శిఖరములను తీసుకొని కుంభకర్ణుని మీదికి విసురుతున్నారు. కుంభకర్ణుడు తన గదను అటు ఇటు ఊపుతూ వానరులను చెదరగొడుతున్నాడు. ఆ చెదర గొట్టడంలో వందలు వేలు వానరులు దూరంగా విసిరివేయబడుతున్నారు. కుంభ కర్ణుడు వందల కొద్దీ వానరులను రెండు చేతులతో పట్టుకొని నోట్లో కుక్కుకొని తింటున్నాడు. అయినా వానరులు కుంభకర్ణుని మీదికి వృక్షములు, రాళ్లు విసురుతూ యుద్ధం చేస్తున్నారు.

ఇంతలో ద్వివిదుడు ఒక పర్వత శిఖరమును పెకలించి చేతపట్టుకొని కుంభకర్ణుని వైపుకు పరుగెత్తాడు. ద్వివిదుడు ఆ పర్వతమును తీసుకొని పైకి ఎగిరి దానిని కుంభకర్ణుని మీదికి విసిరాడు. ఆ పర్వత శిఖరము కుంభకర్ణుని మీద పడకుండా

రాక్షససేనల మీద పడింది. ఆ పర్వతము కిందపడి వందలకొద్దీ రాక్షసులు మరణించారు. అది చూచిన రాక్షస సైనికులు వానరుల మీద పడి బాణములతో వానరుల శిరస్సులను బంతుల మాదిరి ఎగురగొడుతున్నారు. వానరులు కూడా పెద్ద పెద్దవృక్షములను బండరాళ్లను తీసుకొని రాక్షసులను చంపుతున్నారు.

హనుమంతుడు ఆకాశంలోకి ఎగిరి పైనుండి కుంభకర్ణుని మీదికి బండరాళ్లను, వృక్షములను విసురుతున్నాడు. కుంభకర్ణుడు తన శూలముతో వాటిని అటు ఇటు చెదరగొడుతున్నాడు. హనుమంతుడు పెద్ద పర్వత శిఖరమును చేతబట్టుకొని కుంభకర్ణుని ముందు నిలబడ్డాడు. తన శరీరాన్ని కుంభకర్ణునితో సమానంగా పెంచాడు. ఆ పర్వతశిఖరంతో కుంభకర్ణుని శిరస్సు బద్దలు కొట్టాడు. కుంభకర్ణుని శరీరం అంతా రక్తసిక్తము అయింది. దానికి కోపించిన కుంభకర్ణుడు తన శూలముతో హనుమంతుని గుండెల మీద కొట్టాడు. ఆ దెబ్బకు హనుమంతుని ముఖం నుండి రక్తం స్రవించింది. హనుమంతుడు పెద్దగా అరుస్తున్నాడు. రక్తం కక్కుతున్న హనుమంతుని చూడగానే రాక్షసులు ఆనందంతో కేరింతలు కొట్టారు. హనుమంతుని చూచిన మిగిలిన వానర సేనలు భయంతో పారిపోయారు.

ఇది చూచిన నీలుడు వానర సైన్యమునకు ధైర్యము చెప్పి వారిని వెనక్కు మళ్లించాడు. కుంభకర్ణునిమీదికి ఒక పెద్ద పర్వత శిఖరమును విసిరాడు. అది చూచిన కుంభకర్ణుడు పిడికిలి బిగించి ఆ పర్వత శిఖరమును గట్టిగా గుద్దాడు. ఆ గుద్దుకు పర్వతశిఖరము

బద్దలైపోయింది. ఇంతలో ఋషభుడు, శరభుడు, నీలుడు, గవాక్షుడు, గంధమాధనుడు ఒక్కుమ్మడిగా కుంభకర్ణుని మీదికి వెళ్లారు. వారందరూ వృక్షములతోనూ. పర్వతశిఖరములతోనూ కుంభకర్ణుని నలువైపులా మోదారు. ఆ దెబ్బలకు కుంభకర్ణుడు చలించలేదు. ఋషభుడిని కుంభకర్ణుడు గట్టిగా పట్టుకున్నాడు. తన చేతులతో నలిపేసాడు. ఋషభుడు రక్తం కక్కుకుంటూ నేలమీద పడ్డాడు. కుంభకర్ణుడు కోపించి శరభుడిని తన పిడికిలితోనూ, నీలుడిని తన మోకాలితోనూ, గవాక్షుడిని తన అరిచేతితోనూ, గంధమాధనుడిని కాలితోనూ తన్నాడు. ఆ దెబ్బలకు తట్టుకోలేక ఆ వానరవీరులు కింద పడి గిలా గిలా కొట్టుకున్నారు.

ఇంక తెగించిన వానరులు వేల కొద్దీ కుంభకర్ణుని మీదికి పరుగెత్తారు. వారందరూ అతని చేతికి కాలికి దొరకకుండా కుంభకర్ణుని మీదికి ఎక్కారు. అతని శరీరం అంతా గోళ్లతోరక్కారు. కొరికారు. పిడికిళ్లు బిగించి కొట్టారు. కుంభకర్ణుడి ఒంటినిండా వానరులు పాకుతున్నారు. కుంభకర్ణుడు ఆ వానరులను చేతికి దొరికిన వారిని దొరికినట్టు నోట్లో పెట్టుకొని తింటున్నాడు. కుంభకర్ణుని నోట్లోకి పోయిన వానరులు కుంభకర్ణుని ముక్కు, చెవి రంధ్రములలోనుండి బయటకు వస్తున్నారు. కుంభకర్ణుని కాళ్ల కిందపడి చాలా మంది వానరులు మరణిస్తున్నారు.

కుంభకర్ణుడు ఎంతకూ లొంగడం లేదని వానరులు అందరూ రాముని వద్దకు పరుగెత్తారు. ఇంతలో అంగదుడు ఒక పెద్ద పర్వత శిఖరమును తీసుకొని కుంభకర్ణుని తలమీద మోదాడు. ఆ దెబ్బతిన్న కుంభకర్ణుడు కోపంతో అంగదుని వైపు పరుగెత్తాడు. తన

శూలమును అంగదుని మీదికి విసిరాడు. కాని అంగదుడు పక్కకు ఎగిరి ఆ శూలమును తప్పించుకున్నాడు. అంగదుడు పైకి ఎగిరి కుంభకర్ణుని వక్షస్థలము మీద బలంగా చరిచాడు. ఆ దెబ్బకు కుంభకర్ణుడు కళ్లు బైర్లు కమ్మాయి. తూలిపోయాడు. అంతలోనే తేరుకున్న కుంభకర్ణుడు పిడికిలి బిగించి అంగదుని గుద్దాడు. ఆ దెబ్బకు అంగదుడు నేల మీద పడి మూర్ఛపోయాడు.

తరువాత కుంభకర్ణుడు తన శూలము తీసుకొని సుగ్రీవుడు ఉన్న వైపుకు వెళ్లాడు. కుంభకర్ణుడు తన వైపుకు రావడం చూచిన సుగ్రీవుడు ఒక పెద్ద పర్వతమును చేత్తో పట్టుకొని పైకి ఎగిరాడు. కుంభకర్ణుని వైపుకు వేగంగా వెళ్లాడు. తన వైపు వస్తున్న సుగ్రీవుని చూచి కుంభకర్ణుడు రొమ్మువిరుచుకొని నిలబడ్డాడు. అప్పుడు కుంభకర్ణుని చూచి సుగ్రీవుడు ఇలా అన్నాడు.

“ఓ కుంభకర్ణా! సాధారణ వానరులను ఎందుకు చంపుతావు. అది ఒక కీర్తి అనుకుంటున్నావా! నేను నీ మీదికి ఈ పర్వతమును విసురుతున్నాను. ఈ దెబ్బకాచుకో!” అన్నాడు సుగ్రీవుడు.

ఆ మాటలు విన్న కుంభకర్ణుడు ఇలా అన్నాడు. “ఓ సుగ్రీవా! నీవు బ్రహ్మదేవుని మనుమడివి. ఋక్షరజస్సు కుమారుడివి. ఊరికే ఎందుకు అరుస్తావు. నీకు చేతనయింది చెయ్యి.” అన్నాడు కుంభకర్ణుడు.

అప్పుడు సుగ్రీవుడు తన చేతిలో ఉన్న పర్వతమును కుంభకర్ణుని వక్షస్థలము మీదికి విసిరాడు. ఆ పర్వతము కుంభకర్ణుని గుండెలకు తగిలేలా నుగ్గు నుగ్గు అయిపోయింది. అది చూచి రాక్షసులు పెద్దగా కేకలు పెట్టారు. వానరులు దిగులుతో దిగాలు పడ్డారు. కుంభకర్ణుడు తన శూలమును సుగ్రీవుని మీదికి బలంగా విసిరాడు. ఇంతలో సుగ్రీవుడు పైకి ఎగిరి ఆ శూలమును చేత్తో పట్టుకొని రెండుగా విరిచాడు. అది చూచి వానరులు హర్షధ్వానాలు చేసారు. తన చేతిలో ఉన్న శూలం విరిగిపోవడంతో కుంభకర్ణుడు కలవరపడ్డాడు. కుంభకర్ణుడు ఒక పర్వత శిఖరమును పెకలించి సుగ్రీవుని మీదికి విసిరాడు. ఆ దెబ్బకు సుగ్రీవుడు కిందపడి మూర్ఛపోయాడు. రాక్షసులు పెద్దగా కేకలు పెట్టి కుంభకర్ణుని పొగిడారు.

కుంభకర్ణుడు సుగ్రీవుడిని పైకి ఎత్తుకున్నాడు. అక్కడి నుండి వెళ్లిపోతున్నాడు. “వీడిని చంపితే వానర సైన్యము అంతా పారిపోతుంది.” అని అనుకున్నాడు కుంభకర్ణుడు. సుగ్రీవుడిని కుంభకర్ణుడు మోసుకొని పోవడం, అది చూచి వానర సేనలు పారిపోవడం, చూచాడు హనుమంతుడు. ఇలా ఆలోచించాడు. “అయ్యో! సుగ్రీవుని కుంభకర్ణుడు తీసుకొని పోతున్నాడు. వానరులు పారిపోతున్నారు. ఇప్పుడే నేనేంచెయ్యాలి. నా శరీరాన్ని పెంచి కుంభకర్ణుని శరీరాన్ని పిడికిళ్లతో గుద్ది చంపేస్తాను. సుగ్రీవుడిని విడిపిస్తాను. అప్పుడు వానరులు అంతా సంతోషిస్తారు. కుంభకర్ణుడు కొట్టిన దెబ్బకు సుగ్రీవుడు స్పృహ కోల్పోయాడు. లేకపోతే సుగ్రీవుడు దేవతలు, దానవులు, గంధర్వులు పట్టుకున్నా విడిపించుకోగల సమర్థుడు. సుగ్రీవునికి స్పృహ వస్తే చాలు, తనంత తాను కుంభకర్ణుని

నుండి విడిపించుకోగల సమర్ధుడు. ఇప్పుడు నేను సుగ్రీవుని విడిపిస్తే అతనికి అపకీర్తి తెచ్చినవాడిని అవుతాను. నేను విడిపించడం సుగ్రీవునికి రుచించకపోవచ్చు. అందుకని సుగ్రీవునికి స్పృహ వచ్చేవరకూ వేచిఉండక తప్పదు. ఈ లోపల పారిపోతున్న వానరసేనలకు ధైర్యం చెప్పడం అవసరం.” అని అనుకున్నాడు హనుమంతుడు.

వెంటనే హనుమంతుడు పారిపోతున్న వానర సేనలకు ధైర్యము చెప్పి వెనుకకు మళ్లించాడు. ఈ లోగా కుంభకర్ణుడు సుగ్రీవుని తీసుకొని లంకానగరంలోకి వెళ్లిపోయాడు. సుగ్రీవుని బందీగా తీసుకొని వచ్చిన కుంభకర్ణుని మీద లంకా నగరవాసులు పుష్పవర్షము కురిపించారు. చల్లగా పూలు, గంధము నీరు తన మీద పడటంతో సుగ్రీవునికి మెల్లగా స్పృహవచ్చింది. తాను కుంభకర్ణుని బుజంమీద ఉన్నట్టు తెలుసుకున్నాడు సుగ్రీవుడు. ఇలా అనుకున్నాడు.

“నన్ను కుంభకర్ణుడు బందీగా పట్టుకున్నాడు. ఇప్పుడు నేనేం చెయ్యాలి.” అని క్షణకాలం ఆలోచించాడు. ఆలస్యం చేయకుండా తన గోళ్లతోనూ, దంతాలతోనూ కుంభకర్ణుని చెవులను కొరికాడు. పీకాడు. ముక్కును శరీరాన్ని చీల్చాడు. ఆ బాధ తట్టుకోలేక కుంభకర్ణుడు సుగ్రీవుని నేలకేసి కొట్టాడు. వెంటనే సుగ్రీవుడు బంతి మాదిరి ఆకాశంలోకి ఎగిరాడు. లంకా నగరం అవతల సేనల మధ్యలో ఉన్న రాముని దగ్గర పడ్డాడు.

చెవులూ ముక్కు కొరకబడిన కుంభకర్ణుని శరీరం రక్తసిక్తం అయింది. మరలా యుద్ధరంగానికి పరుగెత్తాడు కుంభకర్ణుడు. తన చేతిలో ఒక ముద్గరను తీసుకున్నాడు. మరలా వానరులను పట్టుకొని తినడం మొదలెట్టాడు కుంభకర్ణుడు. వారూ వీరూ అని చూడటం లేదు. దొరికిన వాళ్లను దొరికినట్టు తింటున్నాడు. వానరులను, ఎలుగుబంట్లను, రాక్షసులను కూడా తినేస్తున్నాడు. ఒక పక్కనుండి వానరులు పర్వతశిఖరములతో, వృక్షములతో కొడుతూ ఉంటే మరొక పక్క కుంభకర్ణుడు వానరులను భక్షిస్తూ ఉన్నాడు.

వానరులందరూ గబ గబా రాముని వద్దకు వెళ్లారు. తమను కుంభకర్ణుని బారి నుండి కాపాడమని రాముని శరణువేడారు. ఇదేమీ పట్టని కుంభకర్ణుడు తన ఆకలి తీరేట్టు వానరులను తింటూఉన్నాడు. ఒక్కో పట్టుకు పది, ఇరవై, యాభై మంది వానరులను పట్టుకొని నోట్లో కుక్కుకుంటున్నాడు. కుంభకర్ణుని నోటి నుండి దంతముల నుండి వానరుల పేగులు వేలాడుతున్నాయి. అతని శరీరం అంతా వానరుల రక్తంతో తడిసిపోయింది.

అది చూచిన లక్ష్మణుడు కుంభకర్ణునితో యుద్ధానికి తలపడ్డాడు. మొదటగా ఏడు బాణములను కుంభకర్ణుని శరీరంలో నాటాడు. ఇంకా పెక్కు బాణములను కుంభకర్ణుని మీద ప్రయోగించాడు. కాని ఆ బాణములు కుంభకర్ణుని ఏమీ చేయలేకపోయాయి. వాటిని చేతితో విదిలించుకున్నాడు కుంభకర్ణుడు. లక్ష్మణునికి కోపం వచ్చింది. కుంభకర్ణుని శరీరం అంతా తన బాణములను నాటాడు. కుంభకర్ణుని శరీరం అంతా బాణములతో నిండిపోయింది.

అది చూచి కుంభకర్ణుడు లక్ష్మణుని తో ఇలా అన్నాడు. “కుమారా! నీ ధైర్యానికి పరాక్రమానికి నాకు చాలా సంతోషంగా ఉంది. యముడు కూడా నా ఎదుట నిలబడ్డానికి భయపడతాడు. అటువంటిది నువ్వు నా ఎదురుగా ధైర్యం గా నిలబడి నా మీద బాణవర్షము కురిపించావు. నా ఎదుట ధైర్యంగా నిలబడ్డందుకే నిన్ను గౌరవించాలి. ఇంక యుద్ధం కూడా చేసినందుకు చెప్పపనిలేదు. ఇప్పటి దాకా నాతో చేసిన యుద్ధము చాలు. ఇంక నీవు రాముని వద్దకు వెళ్లు. నీ వంటి ధైర్యవంతుడిని, పరాక్రమవంతుడిని చంపడం నాకు ఇష్టం లేదు. నా గురి రాముని మీదనే. రాముని చంపితే అందరినీ చంపినట్టే కదా! ముందు నేను రాముణ్ణి చంపుతాను. తరువాత మా సైనికులు మిగిలిన వాళ్లను చంపుతారు.” అని అన్నాడు.

కుంభకర్ణుడు తనను తాను పొగుడుకుంటూ పలికిన మాటలకు లక్ష్మణుడు బిగ్గరగా నవ్వాడు. “ఓ రాక్షస వీరుడా! ఇది యుద్ధ భూమి. పౌరుషము పరాక్రమము చూపించవలసిన సమయము. నీ ముందు ఇంద్రుడు మొదలగు దేవతలు నిలువలేరని పలికావు. అది నిజమే కావచ్చు. ఎందుకంటే ఇప్పటిదాకా నీ పరాక్రమమును కళ్లారా చూచాము. కాని నీ పరాక్రమము, పౌరుషము పర్వతము మాదిరి నిలబడి ఉన్న రాముని ముందు గడ్డిపోచతో సమానము. నీ వీరత్వము రాముని మీద చూపించు.” అని అన్నాడు లక్ష్మణుడు.

ఆమాటలకు కోపించిన కుంభకర్ణుడు లక్ష్మణుని వదిలి రాముని వైపుకు దూసుకు వెళ్లాడు. తన వంక వస్తున్న కుంభకర్ణుని

మీద రాముడు రౌద్రాస్త్ర అస్త్రమును ప్రయోగించాడు. అది కుంభకర్ణుని వక్షస్థలమును తాకింది. ఆ దెబ్బ తిన్న కుంభకర్ణుని ముఖము నుండి అగ్ని గోళములు వెలువడ్డాయి. రౌద్రాస్త్రము దెబ్బతిన్న కుంభకర్ణుడు పెద్దగా అరుస్తూ రాముని వంకకు పరుగెత్తాడు. రాముడు మరలా వాడి అయిన బాణములను కుంభకర్ణుని వక్షస్థలమునకు గురి చూచి కొట్టాడు. ఆ దెబ్బకు కుంభకర్ణుని చేతిలోని గదజారిపోయింది. రాముడు కుంభకర్ణుని మీద ఎడతెరిపి లేకుండా బాణవర్షము కురిపిస్తున్నాడు. కుంభకర్ణుని శరీరం అంతా రక్తంతో తడిసిపోయింది. సెలయేరు మాదిరి రక్తం ప్రవహిస్తూ ఉంది. అయినా కుంభకర్ణుడు చేతి కందిన వానరులను, భల్లూకములను తినడం మానలేదు.

కుంభకర్ణుడు ఒక పర్వత శిఖరమును పెకలించి రాముని మీదికి విసిరాడు. రాముడు ఏడు బాణములతో ఆ పర్వతశిఖరమును ఖండించాడు. ఆ శిఖరము కిందపడి రెండు వందల మంది వానరులు చనిపోయారు. అప్పుడు లక్ష్మణుడు రామునితో ఇలా అన్నాడు. "రామా! ఇతడికి వానరులు ఎవరో రాక్షసులు ఎవరో తెలియడం లేదు. రాక్షసులను కూడా భక్షిస్తున్నాడు. మన వానరులు అందరూ ఈ కుంభకర్ణుని మీదికి అన్ని వైపుల నుండీ ఎక్కుతారు. మన వానర సేనానాయకులు వీడి చుట్టు చేరి ఇతడికి దిక్కుతోచకుండా చేస్తారు. వానరుల బరువుకు వీడు నిలబడలేక నేల మీద పడిపోతాడు. అప్పుడు వీడు మన వానరులను చంపలేడు." అని అన్నాడు.

ఆ మాటలు విన్న వానరులు సంతోషంతో గంతులు వేసారు. అందరూ అన్ని వైపుల నుండి కుంభకర్ణుని చుట్టు ముట్టి వాడికి మీదికి ఎక్కారు. వాడి శరీరం అంతా వానరులతో నిండి పోయింది. కుంభ

కర్ణుడు తన మీదకు ఎక్కిన వానరులను చీమలు దులిపినట్టు దులిపేసాడు.

ఈ ఉపాయం కూడా పనిచేయకపోవడంతో రాముడు మరలా తన ధనుస్సును తీసుకున్నాడు. లక్ష్మణుడు వెంట రాగా కుంభకర్ణుని మీదికి యుద్ధానికి బయలుదేరాడు. వానర వీరులు రామలక్ష్మణులను అనుసరించారు. కుంభకర్ణుని చుట్టూ రాక్షసులు వలయంలా రక్షణ కవచంలా నిలబడ్డారు. వారందరూ వానరులను తరుముతున్నారు. మధ్యలో ఉన్న కుంభకర్ణుడు వానరులను భక్షిస్తూ, తన నాలుకతో పెదాలకు అంటుకున్న రక్తాన్ని నాక్కుంటున్నాడు. రాముడు కుంభకర్ణుని సమీపించి ధనుష్టంకారము చేసాడు. ఆ ధ్వని విన్న కుంభకర్ణుడు తలతిప్పి రాముని వంక చూచాడు. రాముని వైపుకు నడిచాడు.

అప్పుడు రాముడు కుంభకర్ణుని చూచి ఇలా అన్నాడు. "ఓ రాక్షస వీరుడా! నాతో యుద్ధానికిరా. చావబోతున్నానని దిగులుపడకు. నేను ధనుస్సు పట్టుకొని నీ ఎదుట నిలబడ్డాను. నిన్నేకాదు నీ రాక్షస వంశమును పూర్తిగా నాశనం చేస్తాను. ఇంకొద్దిసేపట్లో నీ ప్రాణాలు గాలిలో కలిసిపోతాయి." అని అన్నాడు రాముడు.

కుంభకర్ణుడు రాముని తేరిపార చూచాడు. అతని వైపు అడుగులు వేసాడు. పెద్దగా వికాటాట్టహాసం చేసాడు. రామునితో ఇలా అన్నాడు. "నువ్వేనా రాముడివి. ఓ రామా! నేను విరాధుడిని, కబంధుడిని, ఖరుడిని, మారీచుడిని, వాలిని కాను. నన్ను వాళ్ల మాదిరి

అనుకోకు. నేను కుంభకర్ణుడను. నీ చేతిలో ధనుస్సు ఉంటే నాచేతిలో ముద్గర ఉంది. దీనితో నేను దేవతలను, దానవులను జయించాను. నాముక్కు చెవులు మీ వానరులు తినేసారు. కాని నాకు ఏ బాధా లేదు. నీకు పరాక్రమము ఉంటే నా శరీరం అంతా కొట్టు. నీ బలపరాక్రమములను చూచిన తరువాత నిన్ను భక్షిస్తాను." అని గర్వంగా పలికాడు కుంభకర్ణుడు.

రాముడు మారు మాట్లాడకుండా కుంభకర్ణుని మీద వాడి అయిన బాణములను ప్రయోగించాడు. కాని రాముని బాణములు కుంభకర్ణునికి ఏమీ బాధ కలిగించలేదు. కుంభకర్ణుడు తన ముద్గరను వేగంగా తిప్పుతూ ఆ బాణములను మధ్యలోనే తునాతునకలు చేస్తున్నాడు. ఒక పక్క రాముని బాణములను అడ్డుకుంటూ మరొక పక్క ముద్గరతో వానరులను తరుముతున్నాడు కుంభకర్ణుడు. రాముడు వెంటనే వాయవ్యాస్త్రమును సంధించాడు. ముద్గర ఉన్న కుంభకర్ణుని చేతిని భుజము దగ్గర ఖండించాడు. కుంభకర్ణుని చేయి ముద్గరతో సహా ఎగిరి అవతల పడింది. కుంభకర్ణుడు పెద్దగా కేకపెట్టాడు. ఎగిరి పడ్డ కుంభకర్ణుని చేతి కిందపడి వందలకొద్దీ వానరులు మరణించారు. మిగిలిన వానరులు పక్కలకు పరుగెత్తి రాముడు, కుంభకర్ణుని యుద్ధమును ఆసక్తిగా చూస్తున్నారు.

ఒక చేతిని పోగొట్టుకున్న కుంభకర్ణుడు రెండవ చేత్తో ఒక వృక్షమును పెకలించి, దానిని చేతబట్టుకొని, రాముని మీదికి పరుగెత్తాడు. రాముడు ఇంద్ర అస్త్రమును ప్రయోగించి కుంభకర్ణుని రెండవచేతిని వృక్షముతో సహా ఖండించాడు. కుంభకర్ణుడి చేయి భుజము దాకా తెగి కిందపడింది. రెండు చేతులు లేకపోయినా,

కుంభకర్ణుడు రంకెలు వేస్తూ వానర సైన్యము మీదికి పరుగెడు తున్నాడు. రాముడు రెండు అర్ధచంద్రబాణములతో కుంభ కర్ణుని రెండు కాళ్లు ఖండించాడు. మొదలు నరికిన వృక్షము వలె కుంభకర్ణుడు నేలమీద పడిపోయాడు. కుంభకర్ణుని రెండు కాళ్లు రెండు వైపులకు విసిరివేయబడ్డాయి. అయినా కుంభకర్ణుని పౌరుషము చావలేదు. పాక్కుంటూ, దేక్కుంటూ రాముని వైపుకు వెళుతున్నాడు. రాముడు వాడి అయిన బాణములను కుంభకర్ణుని ముఖం నిండా కొట్టాడు. కుంభకర్ణునికి అరవడానికి కూడా వీలులేదు. ఆ స్థితిలో కుంభకర్ణుడు మూర్ఛపోయాడు.

తరువాత రాముడు ఇంద్ర అస్త్రమును తీసుకున్నాడు. అది వాయువేగము కలది. సూర్యుని వలె ప్రకాశవంతమైనది. ఆ అస్త్రమును రాముడు కుంభకర్ణుని మీద ప్రయోగించాడు. ఇంద్రుని వజ్రాయుధ మును పోలిన ఆ అస్త్రము కుంభకర్ణుని మీదికి దూసుకొని వెళ్లింది. కుంభకర్ణుని శిరస్సును ఖండించింది. చేతులు కాళ్లు తల లేని కుంభకర్ణుని మొండెము నేల మీద పడిపోయింది. కిరీటముతోనూ కుండలములతోనూ ప్రకాశిస్తున్న కుంభకర్ణుని తల ఎగిరి ప్రాకారము అవతల పడింది. ఆ శిరస్సుదెబ్బకు లంకా ప్రాకారము కూడా విరిగిపోయింది.

లోకకంటకుడైన ఒక మహారాక్షసుని మరణానికి దేవతలు, ఋషులు, గంధర్వులు, యక్షులు, ఆకాశము నుండి రాముని మీద పుష్పములు కురిపించారు. రాముని పరాక్రమమునకు ఎంతో సంతోషించారు. కుంభకర్ణుడు మరణించడం చూచి రాక్షసులు

బిగ్గరగా అరిచారు. ఏడిచారు. భయంతో పరుగెట్టారు. వానరులందరూ సంతోషంతో కేరింతలు కొట్టారు. బిగ్గరగా హర్షధ్వానాలు చేసారు.

శ్రీమద్రామాయణము

యుద్ధకాండము అరవై ఏడవ సర్గ సంపూర్ణము

ఓం తత్సత్ ఓం తత్సత్ ఓం తత్సత్

యుద్ధకాండము

అరవై ఎనిమిదవ సర్గ.

కుంభకర్ణుడు మరణించడం కళ్లారా చూచిన రాక్షసులు పరుగు పరుగున లంకా నగరం వైపు పరుగెత్తారు. రావణునికి ఈ వార్త చెప్పారు. “లంకేశ్వరా! మహావీరుడు కుంభకర్ణుడు ఎంతో మంది వానరులను చంపి, భక్షించి, కాలవశమున వీరగతి పొందాడు. కుంభకర్ణుడు తన పరాక్రమమును ప్రదర్శించి, తుదకు రాముని బాణములకు హతమైనాడు. చేతులు, కాళ్లు తెగి పడి, ముక్కు చెవులు కొరకబడి, శిరస్సు తెగి, మాంసపు ముద్ద వలె పడిఉన్నాడు. ” అని వివరించారు.

కుంభకర్ణుని మరణ వార్త విని రావణుడు నిర్ఘాంత పోయాడు. నేల మీద పడి మూర్ఛపోయాడు. తమ పినతండ్రి మరణించిన వార్త విన్న త్రిశిరుడు, దేవాంతకుడు, నరాంతకుడు, అతికాయుడు రోదించారు. మహెూదరుడు, మహాపార్శ్వుడు చింతించారు.

రావణునికి తెలివి వచ్చింది. కుంభకర్ణుని తలచుకుంటూ రోదిస్తున్నాడు. “తమ్ముడా కుంభకర్ణా! నీవు శత్రువులను చంపి నాకు సంతోషము కలిగిస్తావు అని అనుకున్నాను కానీ నన్ను విడిచి యముడిని కలుసుకోడానికి పోతావని అనుకోలేదు. నాకు శత్రువులనుండి విముక్తి కలిగించ కుండానే నన్ను ఒంటరిగా వదిలి ఎక్కడికి వెళ్లిపోయావు. నీ మరణంతో నా కుడిభుజము పడిపోయి నట్టు అయింది. దేవతలను, దానవులను జయించిన వాడివి, నిన్ను ఒక మానవుడు ఎలా చంపగలిగాడో అర్థం కావడం లేదు. దేవేంద్రుడి వజ్రాయుధము కూడా నిన్ను ఏమీ చేయలేకపోయింది. అటువంటిది ఒక మానవుడైన రాముని బాణములకు బలిఅయిపోయావా! నీకు ఇంతబలము ఇంత శౌర్యము ఉండి కూడా దైవ వశమున యమలోకమునకు వెళ్లిపోయావా! హంసతూలికా తల్పము మీద తప్ప శయనించని వాడవు, కటికనేలమీద పడి ఉన్నావా!

దేవతలు, ఋషులు, యక్షులు, గంధర్వులు ఆకాశంలో నిలబడి నీ మరణ వార్త విని హర్షధ్వానాలు చేస్తున్నారు. నీవు మరణించగానే ఆ వానరులకు అడ్డు ఆపు లేకుండా పోతుంది. లంకానగర ప్రాకారములు ఎక్కి లంకానగరంలోకి ప్రవేశిస్తారు. నీవులేని నాకు ఈ లంకా రాజ్యము ఎందుకు? ఈ సీత ఎందుకు? ఆ రాక్షస సైన్యము ఎందుకు? నీవులేని నాకు ఈ జీవితము మీద కూడా ఆసక్తి లేదు. నా సోదరుడు కుంభకర్ణుని చంపిన రాముని చంపి పగతీర్చుకుంటాను. లేకపోతే నేను జీవించి ఉండి కూడా వృధా! నేను తక్షణం నా తమ్ముడిని చూడాలి. నేను అక్కడకు వెళ్లాలి. నేను నా తమ్ముడిని విడిచి క్షణకాలం కూడా ఉండలేను. నీ అండలేని నన్ను

చూచి దేవతలు నవ్వుతారు. పరిహాసం చేస్తారు. నువ్వు లేకుండా నేను ఇంద్రుని మీదికి ఎలా యుద్ధానికి పోగలను. ఇంద్రుని ఎలా జయించగలను.

ఆనాడు విభీషణుడు చెప్పిన మాటలు నేను నా అజ్ఞానంతో పెడచెవిని పెట్టాను. ఆ మాటలు ఈనాడు నిజం అయ్యాయి. కుంభకర్ణుడు, ప్రహస్తుడు ప్రాణాలు కోల్పోయారు. విభీషణుని మాటలు ఒక్కొక్కటీ నిజం అవుతున్నాయి. నేను నా తమ్ముని అవమానించిన దానికి ఫలితం ఇప్పుడు అనుభవిస్తున్నాను. మహావీరుడైన నా తమ్ముడు కుంభకర్ణుని పోగొట్టుకున్నాను." అలా పరి పరి విధాలుగా విలపిస్తూ రావణుడు మూర్ఛపోయాడు.

శ్రీమద్రామాయణము
యుద్ధకాండము అరవై ఎనిమిదవ సర్గ సంపూర్ణము
ఓం తత్సత్ ఓం తత్సత్ ఓం తత్సత్

యుద్ధకాండము
అరవై తొమ్మిదవ సర్గ.

రావణుని తమ్ముడు, మహావీరుడు, కుంభకర్ణుడు, రాముని చేతిలో మరణించాడు. కుంభకర్ణుడు మరణించాడని తెలిసి రావణుడు భోరున విలపించాడు. అప్పుడు త్రిశిరుడు రావణుని చూచి ఇలా అన్నాడు. "ఓ రాక్షస రాజా! కుంభకర్ణుడు మరణించాడు. నిజమే. కాని వీరుడవైన నీవు ఈ మాదిరి శోకించడం తగదు. నీవు మూడు లోకములను గెలువ సమర్థుడవు. అట్టి నీవు ఒక సామాన్యుని వలె

ఇలా శోకించడం తగదు. నీ వద్ద బ్రహ్మదేవుడు ప్రసాదించిన అస్త్రములు, శక్తి కవచము, ధనుస్సు, దివ్యమైన రథము ఉన్నాయి కదా. మరి చింత ఎందుకు. ఓ రావణా! నీవు పెక్కు సార్లు దేవతలను, దానవులను ఓడించావు. అట్టి నీవు నీ వద్ద ఉన్న అస్త్రములు, శస్త్రములతో రాముని ఓడించలేవా! పైగా మేమంతా నీ వెంట ఉన్నప్పుడు నీకు దిగులు ఎందుకు. ఇప్పుడే నేను రణభూమికి వెళ్తాను. నీ శత్రువులను సంహరిస్తాను. విజయంతో తిరిగి వస్తాను. నాచేత చంపబడ్డ రాముని నీవు చూడగలవు." అని పలికాడు త్రిశిరుడు.

త్రిశిరుని మాటలకు రావణుడు ఎంతో సంతోషించాడు. త్రిశిరుని వెంట దేవాంతకుడు, నరాంతకుడు, అతికాయుడు బయలుదేరారు. వారి వెంట రావణుని కుమారులు కూడా యుద్ధానికి బయలుదేరారు. వారందరూ ఆకాశంలో ఎగరగల సమర్థత ఉన్నవారు. పైగా మాయాయుద్ధములో ఆరితేరినవారు. అందరూ దేవతలతోనూ, దానవులతోనూ, యక్షులు, గంధర్వులు, పన్నగులతోనూ యుద్ధము చేసి వారిని ఓడించిన పరాక్రమవంతులు. అందరికీ అస్త్రవిద్య బాగా తెలుసు. పైగా అందరూ వరములు పొందినవారే. రావణుడు తన కుమారులను కౌగలించుకొని వారిని ఆశీర్వదించి యుద్ధమునకు పంపాడు. రావణుడు తన కుమారుల రక్షణ కొరకు ప్రత్యేకంగా తన సోదరులు, యుద్ధోన్మత్తుడు అయిన మహోదరుని, మత్తుడు అయిన మహాపార్శ్వుడిని పంపాడు. త్రిశిరుడు, అతికాయుడు, దేవాంతకుడు, నరాంతకుడు, మహోదరుడు, మహాపార్శ్వుడు యుద్ధానికి మహోత్సాహంతో బయలుదేరారు.

మహోదరుడు ఐరావతమును పోలిన ఏనుగును ఎక్కి యుద్ధానికి వెళ్లాడు. రావణుని కుమారుడు త్రిశిరుడు రథము మీద బయలుదేరాడు. (త్రిశిరుడు అంటే మూడు తలలు కలవాడు అని అర్థం చెప్పుకోవచ్చు. తరువాతి శ్లోకంలో వాడు మూడు కిరీటములు ధరించాడు అని ఉంది. కాబట్టి వాడికి మూడు తలలు ఉన్నాయని చెప్పవచ్చును.) రావణుని కుమారుడు అతికాయుడు కూడా రథము మీద బయలుదేరాడు. నరాంతకుడు తెల్లటి గుర్రమును ఎక్కి యుద్ధానికి బయలుదేరాడు. చేతిలో ప్రాస అనే ఆయుధమును ధరించాడు. దేవాంతకుడు పరిఘ అనే ఆయుధమును ధరించి బయలు దేరాడు. మహాపార్శ్వుడు గదను చేత ధరించి బయలు దేరాడు. వారి వెనక రాక్షస సైన్యము బయలు దేరింది. వారందరూ, వస్తే విజయులై తిరిగిరావాలి లేకపోతే యుద్ధములో మరణించి వీరస్వర్గము పొందాలి, అనే కృతనిశ్చయంతో బయలుదేరారు. వారందరూ పెద్దగా గర్జిస్తూ సింహనాదాలు చేస్తూ వెళుతున్నారు. వాళ్ల అరుపులతోనూ సింహనాదాలతోనూ భూమి ఆకాశము బద్దలవు తున్నాయా అన్నట్టు ఉంది.

వారందరూ లంకానగరము వెలుపలికి వచ్చి వానర సైన్యమును చూచారు. వానరులు కూడా రాక్షససైన్యమును చూచారు. వానరులు అందరూ తమ తమ చేతులలో పెద్ద పెద్ద వృక్షములను పర్వతములను ఎత్తి పట్టుకొని అరుస్తున్నారు. యుద్ధానికి సన్నద్ధము అవుతున్నారు. వానరుల అరుపులు విన్న రాక్షసులు వారి కన్నా ఇంకా పెద్దగా అరుస్తున్నారు. గర్జిస్తున్నారు. వికటాట్టహాసం చేస్తున్నారు. వానరులు కొంత మంది నేల మీదా మరి కొంతమంది ఆకాశంలోకి ఎగిరి యుద్ధం చేస్తున్నారు. రాక్షసుల మీద వృక్షములను,

రాళ్లను, విసురుతున్నారు. రాక్షసులు వదులుతున్న బాణములను ఎదుర్కొంటూ రాక్షసుల మీదికి పర్వతములను విసురుతున్నారు. వానరులు విసురుతున్న పర్వతముల కిందపడి రాక్షసులు పొడి పొడి అవుతున్నారు. వానరులు విజృంభించి కవచములను ధరించిన రాక్షసులను వెతికి వెతికి మరీ చంపుతున్నారు. వారి రథములను విరగ్గొడుతున్నారు. మరి కొందరు వానర వీరులు గుర్రములను, ఏనుగులను, వాటి మీద ఎక్కిన వారిని చంపుతున్నారు. రాక్షసులు బాణాలు వేసే లోపల వారి మీద పెద్ద పెద్ద పర్వతశిఖరములు పడుతున్నాయి. ఆ దెబ్బకు వారు చేతిలో బాణములు చేతిలోనే ఉన్నట్టు మరణిస్తున్నారు. కింద పడ్డ రాక్షసులను వానరులు గోళ్లతో చీలుస్తున్నారు, పిడికిళ్లతో గుద్దుతున్నారు. రాక్షసులు కూడా వాడి అయిన బాణములతో వానరుల శరీరములను చీలుస్తున్నారు. శూలములతోనూ ముద్గరలతోనూ, కత్తులతోనూ కొడుతున్నారు. చంపుతున్నారు.

ఆ ప్రకారంగా వానరులు రాక్షసులు, వారి వారి ప్రభువులకు జయము సంపాదించి పెట్టడానికి, ఒకరిని ఒకరు దారుణంగా చంపుకుంటున్నారు. రణభూమి అంతా రక్తసిక్తమయింది. రణభూమి అంతా వానరుల యొక్క రాక్షసుల యొక్క మృతకళేబరములతో నిండి పోయింది. తమ తమ ఆయుధములు విరిగి పోగా రాక్షసులు వానరులతో ద్వంద్వయుద్ధము చేస్తున్నారు. ఒకరిని ఒకరు చంపుకుంటున్నారు. రాక్షసుల మీదికి విసరడానికి వానరులు తెచ్చిన వృక్షములను, పర్వతములను వారి నుండి లాక్కుని రాక్షసులు వానరులను చంపుతున్నారు. అలాగే వానరులు కూడా రాక్షసుల చేతిలో ఉన్న ఆయుధములను లాక్కొని, వాటి తోనే రాక్షసులను

చంపుతున్నారు. వానరులు రాక్షసులు ఒకరి శరీరములను ఒకరు బద్దలు కొట్టుకుంటున్నారు. సింహనాదాలు చేస్తున్నారు. యుద్ధము చేయడానికి వృక్షములు, పర్వతములు దొరకని వానరులు, విరిగిన రథములను, ఏనుగు కళేబరములను ఆయుధములుగా చేసుకొని రాక్షసులను చంపుతున్నారు. వానరులు విసురుతున్న వృక్షములను, పర్వతశిఖరములను రాక్షసులు అర్ధచంద్రబాణము లతోనూ, భల్లబాణములతోనూ పిండి పిండి చేస్తున్నారు. యుద్ధభూమి అంతా వానరులు, రాక్షసుల కళేబరాలతోనూ, ఏనుగులు, గుర్రముల కళేబరములతోనూ, విరిగిన రథములతోనూ నిండి పోయి నడవడానికి కూడా వీలుకాకుండా ఉంది.

వానరులు ఇంక తెగించారు. రాక్షసులతో తెగించి పోరాడుతున్నారు. వానరుల దెబ్బకు రాక్షసులు వందలు వేలు మరణిస్తున్నారు. వానరులు హర్షధ్వానాలు చేస్తున్నారు. పైనుండి దేవతలు, గంధర్వులు, యక్షులు రాక్షసుల పరాజయాన్ని చూచి సంతోషిస్తున్నారు. ఇది చూచిన నరాంతకుడికి కోపం మిన్నుముట్టింది. తన గుర్రము మీద ప్రాస అనే ఆయుధమును ధరించి వాయువేగంతో యుద్ధభూమి అంతా కలయదిరుగుతున్నాడు. నరాంతకుడు తన ప్రాస ఆయుధంతో దెబ్బకు ఏడువందలమంది వానరులను చంపుతున్నాడు. వానరులు అతడిని ఎదుర్కోవాలి అనుకునే లోపలనే నరాంతకుడు వారిని చంపుతున్నాడు. అంతవేగంగా తిరుగుతున్నాడు నరాంతకుడు. వానరులు వృక్షములను, కొండలను పెకలించే లోపే నరాంతకుని ప్రాసకు బలి అవుతున్నారు. కార్చిచ్చు అరణ్యమును కాల్చినట్టు నరాంతకుడు వానర సేనలను కాలరాస్తున్నాడు.

నరాంతకుడు ఆ ప్రాసను ఎత్తుకొని గుర్రంమీద తిరుగుతుంటే వానరులు మాటలాడుకోడానికి కానీ, నిలబడుటకు కానీ వీలు కావడం లేదు. నిలబడ్డవారిని నిలబడ్డట్టు, ఎగిరిన వారిని ఎగిరినట్టు కొడుతున్నాడు నరాంతకుడు. ఆ నరాంతకుడు వానరాంతకుడుగా ప్రకాశిస్తున్నాడు. నరాంతకుని ప్రాస ఆయుధము ధాటికి తట్టుకోలేక వానరులు పెద్ద గా కేకలు పెడుతున్నారు. వారందరూ సుగ్రీవుని వద్దకు పరుగెత్తారు. సుగ్రీవుడికి నరాంతకునికి భయపడి పారిపోతున్న వానరసేన కంటబడింది. వారి వెంట గుర్రము ఎక్కి తరుముతున్న నరాంతకుడు కనపడ్డాడు.

వెంటనే అంగదుని చూచి సుగ్రీవుడు ఇలా అన్నాడు. "అంగదా! అటు చూడు. ఆ గుర్రము మీద ఎక్కి వానరులను తరుముతున్న ఆ రాక్షసుడిని చూడు. వాడిని వెంటనే చంపు. వానరులను వెనక్కు మళ్లించు." అని అన్నాడు. వెంటనే అంగదుడు ఆకాశంలోకి ఎగిరాడు. నరాంతకుని ముందు నిలిచాడు. వాడితో ఇలా అన్నాడు. "నీ ప్రాస ప్రతాపము సామాన్య వానరుల మీద కాదు. నీ ప్రాసను నా మీదికి విసురు." అని రొమ్ము విరుచుకొని నిలబడ్డాడు. ఆమాటలు విన్న నరాంతకుడుతన ప్రాసను అంగదుని మీదికి విసిరాడు. అది అంగదుని వక్షస్థలమును తాకి రెండు ముక్కలై కిందపడి పోయింది. వెంటనే అంగదుడు తన అరిచేతితో నరాంతకుడు ఎక్కిన గుర్రము తలమీద బలంగా కొట్టాడు. ఆ దెబ్బకు ఆ గుర్రము కిందపడి పోయింది. గిలా గిలా కొట్టుకొని మరణించింది.

తన గుర్రము చావడం చూచిన నరాంతకుడు తన పిడికిలితో అంగదుని తలమీద కొట్టాడు. ఆ దెబ్బకు అంగదుని తల పగిలింది. రక్తం కారింది. స్పృహ తప్పింది. అంతలోనే తెలివి వచ్చిన అంగదుడు తన పిడికిలి బిగించి నరాంతకుని వక్షస్థలము మీద బలంగా మోదాడు. ఆ దెబ్బకు నరాంతకుడి గుండెలు బద్దలయ్యాయి. కింతపడిపోయాడు. గిలా గిలా కొట్టుకొని మరణించాడు. అంగదుని చేతిలో నరాంతకుడు చావగానే వానరులు హర్షధ్వానాలు చేసారు. నరాంతకుని చంపినందుకు రాముడు అంగదుని ప్రశంసించాడు.

శ్రీమద్రామాయణము
యుద్ధకాండము అరవై తొమ్మిదవ సర్గ సంపూర్ణము
ఓం తత్సత్ ఓం తత్సత్ ఓం తత్సత్

యుద్ధకాండము
డెబ్బయ్యవ సర్గ.

నరాంతకుడు మరణించడం చూచిన దేవాంతకుడు, త్రిశిరస్సు, మహోదరుడు పెద్దగా శోకించారు. మహోదరుడికి కోపం మిన్ను ముట్టింది. ఒక పర్వతము మాదిరి ఉన్న పెద్ద ఏనుగును ఎక్కి అంగదుని మీదికి యుద్ధానికి బయలుదేరాడు. తన అన్నయ్య మరణాన్ని కళ్లారా చూచిన దేవాంతకుడు అంగదుని మీద పగ తీర్చుకోవాలని అనుకున్నాడు. తన పరిఘను తీసుకొని అంగదుని మీదికి ఉరికాడు. త్రిశిరస్సుడు కూడా తన రథము మీద ఎక్కి అంగదుని మీదికి వెళ్లాడు. ఈ ముగ్గురు రాక్షస వీరులు ఒక్కుమ్మడిగా అంగదుని చుట్టు ముట్టారు.

ఇది చూచిన అంగదుడు ఒక పెద్ద చెట్టును పెకలించాడు. ఆ చెట్టును దేవాంతకుని మీదికి విసిరాడు అంగదుడు. త్రిశిరస్సుడు ఆ చెట్టును తన బాణములతో ఛేదించాడు. అది చూచిన అంగదుడు ఆకాశంలోకి ఎగిరాడు. ఆకాశంనుండి అంగదుడు చెట్లను, బండరాళ్లను వర్షం మాదిరి కురిపించాడు. త్రిశిరస్సుడు వాటిని తన బాణములతో నుగ్గు నుగ్గుచేసాడు. మహెదరుడు తన మీదికి విసిరిన వృక్షములను తన పరిఘతో విరుగగొట్టాడు. త్రిశిరస్సుడు బాణములను అంగదుని మీద వర్షిస్తూ అతనిమీదికి వెళ్లాడు. మహొదరుడు తన ఏనుగు మీద అంగదుని వద్దకు పోయి తన తోమరము అనే ఆయుధముతో అంగదుని గుండెలమీద కొట్టాడు. దేవాంతకుడు కూడా తన పరిఘతో అంగదుని కొట్టి దూరంగా పారిపోయాడు.

ఆ ప్రకారంగా ముగ్గురు రాక్షస వీరులు ఒక్కుమ్మడిగా తనను చుట్టుముట్టి బాధపెడుతున్నా అంగదుడు చలించలేదు. అంగదుడు సమయం చూచి తన అరిచేతితో దేవాంతకుడు ఎక్కిన ఏనుగును బలంగా మోదాడు. ఆ దెబ్బకు ఆ ఏనుగు కిందపడి చచ్చిపోయింది. అంగదుడు ఆ ఏనుగు దంతమును ఊడపీకి, దానినే ఆయుధముగా ధరించి దేవాంతకుని కొట్టాడు. ఆ దెబ్బకు దేవాంతకుడికి దిమ్మతిరిగి రక్తం కక్కుకున్నాడు. అంతలోనే తేరుకున్న దేవాంతకుడు తన పరిఘను తీసుకొని అంగదుని కొట్టాడు.ఆ పరిఘ దెబ్బకు అంగదుడు బోర్లాపడ్డాడు. వెంటనే పైకి లేచాడు. ఆకాశంలోకి ఎగిరాడు. అలా ఎగురుతున్న అంగదుని లలాటమునకు గురిపెట్టి మూడు బాణములను కొట్టాడు త్రిశిరస్సుడు.

ఆప్రకారంగా ముగ్గురు రాక్షస వీరులు అంగదుని చుట్టుముట్టడం చూచిన హనుమంతుడు, నీలుడు అంగదునికి సాయంగా వెళ్లారు. నీలుడు ఒక పర్వతమును ఎత్తి త్రిశిరస్సుని మీదకు విసిరాడు. దానిని త్రిశిరస్సుడు తన బాణాలతో బద్దలు కొట్టాడు. ఇంతలో దేవాంతకుడు పరిఘను చేత ధరించి హనుమంతుని మీదికి వెళ్లాడు. అది చూచిన హనుమంతుడు వేగంగా పైకి ఎగిరి తన పిడికిలితో దేవాంతకుని తలమీద కొట్టాడు. హనుమంతుడు కొట్టిన దెబ్బకు దేవాంతకుని తల ముక్కలైపోయింది. దేవాంతకుడు నేలమీద పడి ప్రాణాలు వదిలాడు.

అది చూచిన త్రిశిరస్సుడు నీలుని వక్షస్థలమునకు గురిచూచి బాణాలు వదిలాడు. మహోదరుడు కూడా తన ఏనుగును ఎక్కి నీలుని మీద శరవర్షము కురిపించాడు. ఆ ఇరువురు రాక్షస వీరులు కురిపించిన శరవర్షమునకు నీలుని శరీరం తూట్లు పడిపోయింది. నీలుడు కదలలేక కూలబడిపోయాడు. స్పృహ తప్పాడు. అంతలోనే తేరుకొని, నీలుడు ఒక పర్వతమును పెకలించి గాలిలోకి ఎగిరాడు. ఆ పర్వతముతో మహోదరుని తల మీద మోదాడు. ఆ దెబ్బకు మహోదరుని తల బద్దలు అయింది. నేల మీద పడి మరణించాడు.

మహోదరుని మరణం చూచిన త్రిశిరస్సుడు కోపంతో ఊగిపోయాడు. తన ధనుస్సును సంధించి హనుమంతుని మీద వాడి అయిన బాణములను ప్రయోగించాడు. హనుమంతుడు ఒక పెద్ద పర్వత శిఖరమును ఎత్తి త్రిశిరస్సుడి మీదికి విసిరాడు. త్రిశిరస్సుడు ఆ పర్వత శిఖరమును తన బాణములతో ముక్కలు చేసాడు. తాను

విసిరిన పర్వతశిఖరము వృధాకావడం చూచిన హనుమంతుడు వృక్షములను పెకలించి త్రిశిరస్సుడి మీదికి వేగంగా విసురుతున్నాడు. తన మీదికి వేగంగా వస్తున్న వృక్షములను త్రిశిరస్సుడు తన బాణములతో ఖండిస్తున్నాడు. హనుమంతునికి కోపం మిన్నుముట్టింది. వేగంగా త్రిశిరస్సుడి రథం మీదికి దూకి రథమునకు కట్టిన గుర్రములను తన గోళ్లతో చీల్చాడు. అది చూచిన త్రిశిరస్సుడు శక్తి ఆయుధమును హనుమంతుని మీద ప్రయోగించాడు. హనుమంతుడు ఆ శక్తి ఆయుధమును ఒడుపుగా తన చేతితో పట్టుకొని రెండుగా విరిచాడు. అది చూచిన వానరులు హర్షధ్వానాలు చేసారు కేరింతలు కొట్టారు.

వారి కేరింతలు విన్న త్రిశిరస్సుడు కోపంతో తన కత్తిని హనుమంతుని గుండెల్లో గుచ్చాడు. ఆ దెబ్బను తప్పించుకున్న హనుమంతుడు తన అరిచేతితో త్రిశిరస్సుని గుండెల మీద చరిచాడు. ఆ దెబ్బకు త్రిశిరస్సుడు చేతిలోని ఆయుధము కిందపడిపోయింది. వాడికి స్పృహ తప్పింది. హనుమంతుడు కిందపడిపోయిన త్రిశిరస్సుని ఖడ్గమును తీసుకొని పెద్దగా అరిచాడు. అంతలోనే స్పృహవచ్చిన త్రిశిరస్సుడు గాలిలోకి ఎగిరి హనుమంతుడిని తన పిడికిలితో మోదాడు. ఆ దెబ్బను తప్పించుకున్న హనుమంతుడు తన చేతిలోని కత్తితో త్రిశిరస్సుని శిరస్సులను ఖండించాడు. త్రిశిరస్సుని మూడు తలలూ నేలమీదపడి దొర్లాయి.

త్రిశిరస్సుని మరణమును కళ్లారా చూచిన రాక్షసులు లంకా నగరం వైపుకు పారిపోయారు. వానరులు హర్షధ్వానాలు చేస్తూ పారిపోతున్న రాక్షసులను తరుముతున్నారు.

ఇంక మహాపార్శ్వుడు మిగిలాడు. మహాపార్శ్వుడు తన గదను చేత ధరించాడు. పూర్వము ఆ గదతో మహాపార్శ్వుడు ఇంద్రుని ఐరావతమును కూడా కొట్టాడు. అటువంటి గదను చేత ధరించి మహాపార్శ్వుడు వానరుల మీదికి వెళ్లాడు. అది చూచిన ఋషభుడు అనే వానర వీరుడు ఎగిరి వచ్చి మహాపార్శ్వుడి ముందు నిలబడ్డాడు. మహాపార్శ్వుడు తన గదతో ఋషభుని గుండెలమీద మోదాడు. ఆ దెబ్బకు ఋషభుని గుండెలు బద్దలయ్యాయి. రక్తం కారుతూ ఉంది. ఋషభుడు స్పృహ తప్పిపోయాడు.

చాలాసేపటికి కానీ అతనికి స్పృహ రాలేదు. తనకు స్పృహరాగానే ఋషభుడు మహాపార్శ్వుడు కోసం వెదికాడు. మహాపార్శ్వుడు కనపడగానే ఋషభుడు తన పిడికిలి బిగించి మహాపార్శ్వుని గుండెల మీద బలంగా మోదాడు. ఆ దెబ్బకు మహాపార్శ్వుడు మొదలు నరికిన చెట్టు మాదిరి కిందపడి మూర్ఛపోయాడు. ఋషభుడు వెంటనే ఆ రాక్షసుని గదను తీసుకొని భయంకరంగా అరిచాడు.

ఇంతలోనే స్పృహ వచ్చిన మహాపార్శ్వుడు ఋషభుణ్ణి కొట్టాడు. ఆ దెబ్బకు కోపించిన ఋషభుడు తన చేతిలో ఉన్న గదతో మహాపార్శ్వుని గుండెలమీద మోదాడు. ఆ గదా ఘాతానికి మహాపార్శ్వుని గుండెలు బద్దలయ్యాయి. అంతటితో ఆగకుండా ఋషభుడు మహాపార్శ్వుని, గదతో కొట్టిన చోట కొట్టకుండా, కొట్టాడు. ఆ దెబ్బలకు మహాపార్శ్వుడు మరణించాడు.

తిరుగులేని రాక్షస వీరుడు మహాపార్శ్వుడు కూడా మరణించడం చూచిన రాక్షస సేనలు తమ ప్రాణాలు రక్షించుకోడానికి పారిపోయాయి.

శ్రీమద్రామాయణము
యుద్ధకాండము డెబ్బయ్యవ సర్గ సంపూర్ణము
ఓం తత్సత్ ఓం తత్సత్ ఓం తత్సత్

యుద్ధకాండము
డెబ్బైఒకటవ సర్గ.

ఇంక మిగిలిన వాడు అతికాయుడు. వాడు సామాన్యుడు కాడు. బ్రహ్మచేత వరములను పొందిన వాడు. దేవతలను, దానవులను జయించిన వాడు. అటువంటి అతికాయుడు తన వాళ్లు అందరూ మరణించడం చూచి ఆగ్రహోదగ్రుడు అయ్యాడు. వెంటనే తన రథము ఎక్కి వానరుల మీదికి యుద్ధానికి బయలుదేరాడు. పెద్దగా సింహనాదం చేస్తున్నాడు.

అతికాయుని శరీరము, అరుపులు, ధనుష్టంకారములు వానరుల గుండెల్లో గుబులుపుట్టించాయి. అతికాయుని చూడగానే కుంభకర్ణుడు మరలా లేచి వచ్చాడా అన్నట్టు అనిపించింది వానరులకు. ఇదంతా రాముడు దూరంనుండి చూచాడు. కుంభకర్ణుని వంటి దేహము కల అతికాయుని చూచిన రాముడు విభీషణుని చూచి ఇలా అన్నాడు. "విభీషణా! కుంభకర్ణుడు మరలా బతికి వచ్చాడా అన్నట్టు

ఉన్న ఈ రాక్షసుడు ఎవరు? వీడు పర్వతము వలె ఉన్నాడు. వీడు రథం మీద వస్తుంటే మృత్యుదేవత వస్తున్నట్టు ఉంది. వీడి రథము కూడా విచిత్రంగా ఉంది. దానికి వెయ్యి అశ్వములు కట్టారు. నలుగురు సారథులు ఉన్నారు. వీడి రథము నిండా ధనుస్సులు అస్త్రములు, శస్త్రములు సమృద్ధిగా ఉన్నాయి. వీడి చేతిలో ఉన్న ఒక్కొక్క ఖడ్గము పదిచేతుల పొడుగు ఉంది. ఇంతకూ వీడు ఎవరు? వీడి చరిత్ర ఏమిటి? ఎందుకంటే వీడిని చూచి వానరులు అంతా పారిపోతున్నారు. వీడిని త్వరగా సంహరించకపోతే వానరులు యుద్ధం చేసేటట్టు లేరు."అని అన్నాడు రాముడు.

విభీషణుడు రామునితో ఇలా అన్నాడు. "ఓ రామా! రావణుడు, కుబేరుడు అన్నదమ్ములు. రావణునికి ధాన్యమాలికి పుట్టిన వాడు ఈ అతికాయుడు. వీడు అత్యంత శక్తిమంతుడు. ఇతడు రావణునితో సమానమైన బలపరాక్రమములు కలవాడు. వేదాధ్యనము చేసినవాడు. సకల శాస్త్రపారంగతుడు. అస్త్ర,శస్త్ర విద్యలు తెలిసినవాడు. మంచి ఆలోచనా పరుడు. నీతిమంతుడు. ఇతని బాహు బలముతోనే లంక సురక్షితంగా ఉంది. ఇతడు బ్రహ్మను గూర్చి తపస్సు చేసి వరములను పొందాడు. దేవ, దానవులను, యక్షులను యుద్ధములో ఓడించాడు. రాక్షసులను సదా రక్షిస్తూ ఉంటాడు. తన అస్త్రములతో ఇంద్రుని కూడా కదలకుండా చేసిన మహావీరుడు అతికాయుడు. ఇతడిని వరుణ పాశము కూడా ఏమీ చేయలేదు. ఓ రామా! నీవు ఇతనిని తొందరగా చంపాలి. లేకపోతే వానర సేనలకు అపార నష్టం కలుగుతుంది." అన్నిఅన్నాడు విభీషణుడు.

ఒక పక్క విభీషణుడు ఈ మాటలు రామునితో అంటూ ఉండగానే అతికాయుడు తన రథం మీద సింహము లేళ్లగుంపు లోకి చొరబడ్డట్టు వానర సేనలోకి చొరబడ్డాడు. తనతో యుద్ధం చేయడానికి వచ్చిన వానరులను తన బాణాలతో కొడుతున్నాడు. ఇది చూచిన కుముదుడు, ద్వివిదుడు, మైందుడు, నీలుడు, శరభుడు అందరూ కలిసి ఒక్కుమ్మడిగా వృక్షములతోనూ, పర్వత శిఖరముల తోనూ అతికాయుని మీద దాడి చేసారు. అతికాయుడు తన వాడి అయిన బాణములతో ఆ వృక్షములను, పర్వత శిఖరములను పగలకొడుతున్నాడు. అంతే కాకుండా తన వాడి అయిన బాణములతో వానర వీరుల శరీరములను కొడుతున్నాడు. అతికాయుని బాణముల ధాటికి వానర వీరుల శరీరములు శిథిలమైపోయాయి.

అతి కాయుడు ఒక నియమాన్ని పాటిస్తున్నాడు. కేవలం తనతో యుద్ధముచేస్తున్నవారి మీదనే బాణప్రయోగము చేస్తున్నాడు. ఇతరుల వంక కన్నెత్తి కూడా చూడ్డం లేదు. అతికాయుని ధాటికి భయపడి ఎవరూ అతని ఎదుటికి పోవడం లేదు. అందుకని అతికాయుడు తన రథాన్ని రాముని వద్దకు పోనిచ్చాడు. రాముని ఎదుట నిలిచి ఇలా అన్నాడు.

"ఓరామా! ఈ చిన్న చిన్న వానరులను చంపి ఏమి ప్రయోజనము. నేను నీ ఎదుట నిలబడి ఉన్నాను. నీకు శక్తి, ఉత్సాహము, పరాక్రమము వీరత్వము ఉంటే నాతో యుద్ధం చెయ్యి." అని రాముని యుద్ధానికి పిలిచాడు. ఆ మాటలకు లక్ష్మణునికి కోపం వచ్చింది. వెంటనే లక్ష్మణుడు అతికాయుని ఎదుట నిలబడి

ధనుష్టంకారము చేసాడు. అతికాయుడు లక్ష్మణుని చూచి ఇలా అన్నాడు. “లక్ష్మణా! నాతో పోలిస్తే నీవు బాలుడవు.. యుద్ధవిద్యలో నీకు నేర్పు లేదు. అనుభవమూ లేదు. కాలయముని వంటి నాతో నీవు యుద్ధము చేయలేవు. నా ధనుస్సు నుండి వెలువడిన బాణములకు హిమవత్పర్వతము కూడా ఎదురు నిలువ లేదు. నా వాడి అయిన శరములకు భూమ్యాకాశాలు బద్దలు అవుతాయి. నాలో ఉన్న ప్రళయాగ్నిని నిద్రలేపకు. దయచేసి వెళ్లిపో. నీ ప్రాణాలు దక్కించుకో. నా లక్ష్యం రాముడు కానీ నువ్వు కాదు. వెళ్లు. నా మాట వినకుండా మొండిగా ఇలాగే ఉన్నావనుకో, నేను ఏమీ చెయ్యలేను-- నీతో యుద్ధంచేసి నిన్ను చంపడం తప్ప. యముని సందర్శనమునకు సిద్ధంగా ఉండు. నీకు మరొక సారి చెబుతున్నాను. నా బాణములు సామాన్యమైనవి కావు. నా బాణములు పరమేశ్వరుని పాశు పతాస్త్రముతో సమానములు. నిన్ను క్షణంలో కూలుస్తాయి. కాచుకో” అని అన్నాడు అతికాయుడు.

లక్ష్మణుని మీద బాణమును సంధించాడు. అతి కాయుని మాటలు విన్న లక్ష్మణుడు ఇలా అన్నాడు. “ఓ రాక్షసాధమా! నేను నీ ఎదుట నిలిచి ఉన్నాను. చేతనైతే నీ బలం పరాక్రమం చూపించు. కేవలం నిన్ను నీవు పొగుడుకోవడం వల్ల ప్రయోజనం లేదు. ఎవరిని వారు పొగుడుకొనేవారు ఉత్తములు కారు. పరాక్రమం చూపేవాడినే శూరుడు అంటారు కానీ కేవలం మాటలతో పొద్దుపుచ్చేవాడిని కాదు. ఇక్కడ నోరు కాదు, బాణాలు మాట్లాడాలి. నీవు రథం మీద ఉన్నావు. అన్ని రకములైన అస్త్ర శస్త్రములు కలిగి ఉన్నావు. ఇంకెందుకు ఆలస్యం. శరప్రయోగం చెయ్యి. ఆ తరువాత నా పరాక్రమము ఏపాటిదో చూద్దువుగానీ! నేను కొట్టిన ఒకే ఒక బాణమునకు, పక్వమైన తాటి

పండు చెట్టునుండి పడినట్టు నీ తల తెగి నేలమీద పడుతుంది. నా బాణాలు నీ రక్తం తనివిదీరా తాగుతాయి. నీవు చెప్పినట్టు నేను నీ కన్నా చిన్నవాడినే. కాని గట్టి వాడను. చిన్న వాడు అని చులకనగా చూడకు. నేను చిన్నవాడినైనా వృద్ధుడను అయినా నీ పాలిట మృత్యువును. మృత్యువుకు వయోబేధం లేదు కదా! బాలుడైన వామనుడు బలి చక్రవర్తిని పాతాళానికి అణగతొక్కడం నీవు వినలేదా! నేనూ అంతే." అని ముగించాడు లక్ష్మణుడు.

ఏదో చిన్నవాడు కదా, చెబితే వింటాడు కదా అని అనుకున్నాడు అతికాయుడు. కానీ లక్ష్మణుడు రెచ్చిపోవడం చూచి సహించలేకపోయాడు. ఆగ్రహోదగ్రుడయ్యాడు. వెంటనే బాణమును సంధించాడు. ఏం జరుగుతుందో ఏమో అని ఆకాశం నుండి దేవతలు, గంధర్వులు, యక్షులు, ఋషులు ఆతురతగా ఎదురుచూస్తున్నారు. అతికాయుడు ఒక వాడి అయిన బాణమును లక్ష్మణుని మీదకు వదిలాడు. తన మీదికి దూసుకువస్తున్న ఆ అస్త్రమును లక్ష్మణుడు ఒక అర్ధచంద్రబాణంతో రెండుగా ఖండించాడు. తాను విడిచిన శరము వృథా కావడంతో అతికాయుడికి కోపం వచ్చింది. వెంటనే లక్ష్మణుని మీద ఐదుబాణములను సంధించాడు. దానికి సిద్ధంగా ఉన్న లక్ష్మణుడు ఆ బాణములను కూడా మధ్యలోనే విరిచాడు. అతికాయుడు ఆశ్చర్యపోయాడు. లక్ష్మణుడు ఆలస్యం చేయకుండా మరొక వాడి అయిన బాణంతో అతికాయుని నుదుటి భాగమునకు గురి చూచి కొట్టాడు. లక్ష్మణుని బాణము అతికాయుని నుదుటిలో లోతుగా దిగబడింది. రక్తం ధారగా కారుతూ ఉంది.

ఆ దెబ్బకు అతి కాయుడు అటు ఇటు తూలాడు. అంతలోనే సర్దుకున్నాడు. లక్ష్మణుని వంక ప్రశంసాపూర్వకంగా చూచాడు. “ఇన్నాళ్లకు నాకు సరి అయిన శత్రువు దొరికావు. నీ అస్త్రలాఘవానికి మెచ్చుకుంటున్నాను. కానీ నా నుండి తప్పించుకోలేవు. కాచుకో.” అన్నాడు అతికాయుడు. వెంటనే తన ధనుస్సు నుండి వరుసగా రెండు, ఐదు, ఏడు బాణములను ఒకే సారి సంధించి వేగంగా లక్ష్మణుని మీదికి విడిచిపెట్టాడు. తన మీదికి దూసుకువస్తున్న వాడి అయిన ఆ బాణములను చూచి లక్ష్మణుడు ఏ మాత్రం కంగారు పడలేదు. తాను కూడా వాటికి దీటుగా బాణములను సంధించి అతికాయుడు సంధించిన బాణములను అన్నిటినీ మధ్యలోనే తుంచాడు.

ఒకే ఒక బాణంతో లక్ష్మణుని చంపవచ్చు అనుకున్న అతికాయునకు. తన బాణములు అన్నీ వృథా కావడం చూచి మండిపోయింది. ఈ సారి అమోఘము వాడి అయిన బాణం ఒకటి తీసాడు. ఆ బాణమును లక్ష్మణుని గుండెలకు గురిచూచి కొట్టాడు. ఆ బాణము సూటిగా వచ్చి లక్ష్మణుని వక్షస్థలమును తాకింది. రక్తం ధారగా కారింది. లక్ష్మణుడు ఆ బాణమును తన శరీరమునుండి లాగేసాడు. లక్షణుడు ఒక బాణమును తీసి దాని మీద ఆగ్నేయాస్త్రమును సంధించి అతికాయుని మీదకు ప్రయోగించాడు. దానికి ప్రతిగా అతికాయుడు తన బాణము మీద సౌరాస్త్రమును ఆహ్వానించి సంధించాడు. లక్ష్మణునికి గురిచూచి వదిలాడు. లక్ష్మణుడు ప్రయోగించిన ఆగ్నేయాస్త్రము అతికాయుడు ప్రయోగించిన సూర్యాస్త్రము ఆకాశంలో ఒకదానిని ఒకటి ఢీకొన్నాయి. రెండు అస్త్రములు కాలిపోయి నేలమీద పడ్డాయి.

తన అస్త్రము వృథా కావడం చూచిన అతికాయుడు మరొక అస్త్రమును సంధించి దాని మీద త్వష్ట అనే దేవతను ఆహ్వానించి, లక్ష్మణుని మీదికి ప్రయోగించాడు. అప్పుడు లక్ష్మణుడు ఆ అస్త్రమును ఇంద్రాస్త్రముతో నిర్వీర్యము గావించాడు. అతికాయుడు మరొక బాణం మీద యముడిని ఆహ్వానించి దానిని లక్ష్మణుని మీదికి విడిచిపెట్టాడు. లక్ష్మణుడు ఆ యమ అస్త్రమును వాయవ్యాస్త్రముతో ఛేదించాడు. రెండు అస్త్రములు పనికిరాకుండా పోయాయి.

ఇలా అస్త్రములతో లాభం లేదని లక్ష్మణుడు అతికాయుని మీద శరవర్షము కురిపించాడు. ఎడతెరిపి లేకుండా బాణవర్షము కురిపించాడు. లక్ష్మణుడు ప్రయోగించిన బాణములు అన్నీ అతికాయుని కవచమునకు తగిలి విరిగిపోతున్నాయి. అయినా లక్ష్మణుడు తన పట్టువిడువలేదు. మరొక వేయి బాణములను అతికాయుని మీద వర్షము వలె కురిపించాడు. కాని ఆ బాణముల బారి నుండి అతికాయుని దివ్య కవచము రక్షిస్తూ ఉంది. కాబట్టి లక్ష్మణుని బాణ పరంపరకు అతికాయుడు ఏ మాత్రం బెదరడం లేదు. అతికాయుడు సర్పము వంటి బాణము ఒకదానిని తీసుకొని దానిని లక్ష్మణుని మీద ప్రయోగించాడు.

ఆ బాణము దెబ్బకు లక్ష్మణుడు క్షణకాలము మూర్ఛపోయాడు. వెంటనే తేరుకున్నాడు. అతి కాయుడిని వదిలి పెట్టి వాడి రథము మీద పడ్డాడు. నాలుగు బాణములతో అతికాయుని రథము మీద జెండాను విరగగొట్టాడు. మరొక నాలుగు బాణములతో అతికాయుని రథమునకు కట్టిన హయములను చంపాడు. మరొక బాణంతో సారథిని చంపాడు. ఇప్పుడు అతికాయుడు విరథుడు

అయ్యాడు. తరువాత లక్ష్మణుడు ఎన్నోబాణములను అతికాయుని చంపడానికి ప్రయోగించాడు కానీ ఆ బాణములు అతికాయుని ఏమీ చెయ్యలేకపోయాయి. అప్పుడు వాయుదేవుడు లక్ష్మణుని మీదుగా వీస్తూ అతని చెవిలో ఇలా అన్నాడు. “కుమారా! ఇతడు బ్రహ్మదేవుని గురించి తపస్సుచేసి వరములు పొందాడు. ఆ కవచము బ్రహ్మదేవుడు ప్రసాదించింది. నీవు ఎన్ని బాణములు వేసినను అతనిని ఏమీ చేయలేవు. ఆ కవచమును బ్రహ్మాస్త్రముతో ఛేదించు. అతని కవచము ఉన్నంతవరకూ నీవు అతనిని చంపలేవు.” అని అన్నాడు వాయుదేవుడు.

వెంటనే లక్ష్మణుడు ఒక బాణమును సంధించి దాని మీద బ్రహ్మాస్త్రమును ఆవాహనం చేసాడు. బ్రహ్మాస్త్రమును అతికాయుని మీద సంధించాడు. తన మీదికి నిప్పులు చిమ్ముకుంటూ వస్తున్న బ్రహ్మాస్త్రమును చూచాడు అతికాయుడు. తన దగ్గర ఉన్న అన్ని రకములైన బాణములతో ఆ బ్రహ్మాస్త్రమును కొట్టాడు. కానీ ప్రయోజనం లేకపోయింది. బ్రహ్మాస్త్రము అతికాయుని సమీపించింది. అతి కాయుడు ఏ మాత్రం కంగారు పడలేదు. తన వద్ద ఉన్న అన్ని అస్త్ర శస్త్రములను ప్రయోగించాడు. ఆ ఆయుధములు అన్నీ వృథా అయ్యాయి. బ్రహ్మాస్త్రము అతికాయుని సమీపించింది. దివ్యమైన కిరీటమును కుండలములను ధరించిన అతికాయుని శిరస్సును ఖండించింది. అతికాయుని శిరస్సు నేలమీద పడిపోయింది. శిరస్సు తెగిపోగానే అతి కాయుని మొండెము పెద్ద వృక్షము కూలినట్టు నేలమీద కూలిపోయింది.

అతికాయుని మరణము చూచిన రాక్షసులు శోకించారు. వారికి భయంపట్టుకుంది. ఆ భయంతో పెద్ద పెద్దగా అరుస్తున్నారు. కేకలు పెడుతున్నారు. నలువైపులా పరుగెట్టారు. కొంత మంది లంకానగరం వైపు పారిపోయారు. వానర వీరులు, వానరులు లక్ష్మణుని చుట్టు చేరి అతనిని శ్లాఘించారు. వానరులందరితో కలిసి లక్ష్మణుడు రాముని వద్దకు వెళ్లాడు.

శ్రీమద్రామాయణము
యుద్ధకాండము డెబ్బయ్యి ఒకటవ సర్గ సంపూర్ణము
ఓం తత్సత్ ఓం తత్సత్ ఓం తత్సత్

యుద్ధకాండము
డెబ్బయ్యి రెండవ సర్గ.

అతికాయుని మరణవార్త విన్న రావణునికి ఒంట్లో భయం ప్రవేశించింది. మంత్రులను పిలిపించాడు. వారితో ఇలా అన్నాడు. “ధూమ్రాక్షుడు, అకంపనుడు, ప్రహస్తుడు, కుంభకర్ణుడు వీరందరూ మహాబలవంతులు. కానీ మానవుడైన రాముని చేతిలో చంపబడ్డారు. వీరే కాదు వీరిని అనుసరించిన రాక్షస సైన్యము కూడా నాశనం అయింది. ఒకరోజు నా కుమారుడైన ఇంద్రజిత్తు రామలక్ష్మణులను సర్పబాణములతో శరబంధము చేసాడు. వారిరువురిని మూర్ఛపోయేట్టు చేసాడు. ఇంద్రజిత్తు చేసిన శరబంధము నుండి రామలక్ష్మణులను విడిపించడం, దేవ,దానవ,గంధర్వ,యక్ష, కిన్నర,సాధ్య,సిద్ధులకు కూడా సాధ్యము కాదు. కాని ఏజరిగిందో ఏమిటో అర్థం కాలేదు. రామలక్ష్మణులు ఆ శరబంధం నుండి విడిపించుకున్నారు. అది వాళ్ల

మహిమో, లేక ఏమన్నా మాయచేసారో, వేరేవాళ్ల ప్రభావమో అర్థం కావడం లేదు. నా ఆదేశము ప్రకారము యుద్ధమునకు వెళ్లిన రాక్షస యోధులు అందరూ ఆ వానరుల చేతిలో మరణించారు. ప్రస్తుతము రామలక్ష్మణులను, సుగ్రీవుని, విభీషణుని వానరులను చంపదగిన వీరుడు పరాక్రమవంతుడు లంకలో నాకు కనపడటం లేదు.

కేవలము రాముని పరాక్రమము చేత రాక్షసయోధు లందరూ మరణించారు. అట్టి రాముని పరాక్రమము ఎంత గొప్పది. అతని అస్త్రముల శక్తి అమోఘము. కాబట్టి మనము లంకను, లంకలో ఉన్న సీతను, సీత ఉన్న అశోక వనమును అనుక్షణము అప్రమత్తంగా రక్షించుకోనాలి. ఏ క్షణంలో నైనా వానరులు లంకా నగరమును స్వాధీనం చేసుకోవచ్చు. లంకానగరంలో నుండి బయటకు వెళ్లేవాళ్లను, లోపలకు వచ్చేవాళ్లను నిశితంగా పరిశీలించి మరీ వదలండి. ఏమరిపాటు తగదు. మీరందరూ వానరుల సంచారమును ఒక కంట కనిపెట్టి ఉండండి. వారి మాయలకు లోబడకండి. పగలు కానీ, రాత్రి కానీ అన్ని యామములు అప్రమత్తంగా ఉండండి. వానరుడు కనపడితే చంపండి దయాదాక్షిణ్యము చూపకండి. లంకా నగరమును ముట్టడించిన వానరుల నందరినీ ఒక కంట కనిపెట్టి ఉండండి. వారి వ్యూహములను ఎప్పడికప్పుడు తెలుసుకోండి. ఎప్పుడు యుద్ధానికి తయారవుతున్నారు. ఏ పక్కనుంచి వస్తున్నారు. ఎవరి నాయకత్వంలో వస్తున్నారు మొదలగు విషయాలను తెలుసుకోండి. జాగ్రత్తగా ఉండండి." అని ఆదేశాలు ఇచ్చాడు రావణుడు.

రాక్షస వీరులు రావణుని ఆదేశాలను ఖచ్చితంగా పాటిస్తామని ప్రతిజ్ఞచేసారు. ఎన్ని జాగ్రత్తలు తీసుకున్నా రావణునికి

కన్నకుమారులను, తన వారు అన్నవారందరినీ పోగొట్టుకున్న దు:ఖము మనసులో నుండి తొలగిపోలేదు. విచార వదనంనతో అంత:పురము నకు వెళ్లిపోయాడు.

శ్రీమద్రామాయణము

యుద్ధకాండము డెబ్బది రెండవ సర్గ సంపూర్ణము

ఓం తత్సత్ ఓం తత్సత్ ఓం తత్సత్

యుద్ధకాండము

డెబ్బది మూడవ సర్గ.

దేవాంతకుడు, నరాంతకుడు, త్రిశిరస్సు, అతికాయుడు మొదలగు యోధాను యోధులు యుద్ధములో మరణించారు అన్న వార్త రావణుని కుమారుడు ఇంద్రజిత్తుకు తెలిసింది. వెంటనే తన తండ్రి రావణుని వద్దకు వెళ్లాడు. చింతాక్రాంత వదనంతో ఉన్న రావణుని చూచి ఇలా అన్నాడు.

“తండ్రీ! మీరు ఈ రాక్షస రాజ్యమునకు సర్వాధికారులు. మీరు ఇలా చింతించడం తగదు. ఎంతమంది యోధులు మరణించినా నేను ఇంకా జీవించి ఉన్నాను కదా! నా చేతి బాణముల బారిన పడిన వాడు జీవించడం అరుదు. ఈ రోజే నేను యుద్ధమునకు వెళ్లి రామలక్ష్మణులను సంహరిస్తాను. ఈ రోజే యుద్ధము పరిసమాప్తి చేస్తాను. రామలక్ష్మణులు విగతజీవులై యుద్ధరంగములో పడిఉండటం నీవు కళ్లారా చూస్తావు. తండ్రీ! ఇదే నా ప్రతిజ్ఞ. ఈరోజు రామలక్ష్మణులను శరీరములను నా వాడియైన

శరములతో కప్పివేస్తాను. నాకు ఇంద్రుడు, యముడు, విష్ణువు, రుద్రుడు, సాధ్యులు, అగ్ని, వరుణుడు, సూర్యచంద్రులు వీరితో సమానమైన బలపరాక్రమములు ఉన్నాయి. నా పరాక్రమాన్ని రామలక్ష్మణులకు రుచి చూపిస్తాను. మీరు నిశ్చింతగా ఉండండి." అని పలికాడు ఇంద్రజిత్తు.

వెంటనే గాడిదలు కట్టిన రథాన్ని ఎక్కాడు. తండ్రి అనుమతి తీసుకొని యుద్ధరంగమునకు వెళ్లాడు. వెళ్లే ముందు రావణుడు ఇంద్రజిత్తుతో ఇలా అన్నాడు. "కుమారా! నీ బలపరాక్రమములు నాకు తెలియనివి కావు. నిన్ను జయించగలవాడు ముల్లోకములలో లేడు. నీవు దేవతల రాజైన దేవేంద్రుని జయించిన వాడవు. అటువంటి నీకు ఒక మానవుడు రాముడిని జయించడం పెద్ద పనికాదు. విజయుడవై తిరిగిరా" అని ఆశీర్వదించాడు.

తండ్రి ఆశీర్వాదము తీసుకొని ఇంద్రజిత్తు యుద్ధానికి బయలుదేరాడు. ఇంద్రజిత్తు వెంట రాక్షస సేన బయలుదేరింది. వారు ధనుస్సులు, ముద్గరలు, ప్రాసలు, పరిఘలు ధరించి ఇంద్రజిత్తు వెంట బయలుదేరారు. రకరకాలైన వాహనముల మీద వెళ్లారు. కొంతమంది నడిచి వెళ్లారు. అంతా యుద్ధరంగము చేరుకున్నారు. యుద్ధభేరీ మ్రోగించారు. ఇంద్రజిత్తు తన శంఖమును పూరించాడు. అంతా యుద్ధానికి సన్నద్ధము అయ్యారు.

అప్పుడు ఇంద్రజిత్తు యుద్ధరంగము నుండి బయలుదేరి యజ్ఞశాలకు చేరుకున్నాడు. శుచి అయ్యాడు. అగ్నిని రగిల్చాడు. అభిచార హెూమం చెయ్యడం మొదలెట్టాడు. బిగ్గరగా మంత్రాలు

చదువుతూ హోమం చేస్తున్నాడు. హవిస్సును, పేలాలను, ఎర్రటి పుష్పములను, సుగంధ ద్రవ్యములను అగ్నిలో హోమం చేసాడు. ఆ హోమం చేసేటప్పుడు ఇంద్రజిత్తు శస్త్రములను, శరపత్రములను, విభీతర వృక్షముల నుండి సేకరించిన సమిధలను, ఎర్రటి గుడ్డలను, అగ్నిలో హోమం చేసాడు. హోమం చేసేటప్పుడు ఇనప గరిటెలను ఉపయోగించాడు. అగ్నిహోత్రము చుట్టు శరపత్రములను, తోమరములు అనే ఆయుధములను పరిచాడు. ఒక నల్లని మేకను బలి ఇచ్చాడు. ఆ మేక మాంసమును అగ్నిలో హోమం చేసాడు. అప్పుడు హోమాగ్ని భగ్గుమని పైకి లేచింది. అది విజయసూచకంగా కనపడింది ఇంద్రజిత్తుకు. తరువాత తన ధనుస్సును, బాణములను అగ్ని ముందు ఉంచాడు. తన రథమును కూడా అగ్ని ముందు నిలబెట్టాడు. ధనుర్బాణములను, రథమును అభిమంత్రించాడు. తరువాత బ్రహ్మాస్త్రమును ఆవాహన చేసాడు. ఇంద్రజిత్తు బ్రహ్మాస్త్రమును ఆవాహన చేస్తుంటే భూమి చలించింది.

ఆ ప్రకారంగా బ్రహ్మాస్త్రమును ఆవాహన చేసిన ఇంద్రజిత్తు హోమమును పూర్తి చేసాడు. తరువాత తన రథమును ఎక్కి ధనుర్బాణములను తీసుకున్నాడు. తన మంత్రమహిమతో ఆకాశంలోకి ఎగిరిపోయాడు. యుద్ధరంగము చేరుకున్నాడు. అప్పటికే రాక్షస సైన్యము వానరులతో యుద్ధం చేస్తున్నారు. ఇంద్రజిత్తు అక్కడకు చేరుకొని ఒక్క వానరుని కూడా వదలకుండా చంపమని రాక్షసులను ఉత్సాహపరుస్తున్నాడు. రెట్టించిన ఉత్సాహంతో రాక్షస వీరులు వానరుల మీద శరవర్షము కురిపిస్తున్నారు. ఇంద్రజిత్తు కూడా రక రకాలైన బాణములతో వానరులను చంపుతున్నాడు. రాక్షసులు కూడా

గదలతోనూ, ముసలములతోనూ వానరులను చంపుతున్నారు. వానరులు తమ చేతులలో వృక్షములు బండరాళ్లు ధరించి రాక్షసులతో యుద్ధము చేస్తున్నారు. రాక్షసుల ధాటికి వానర సైన్యము నశించి పోతూ ఉంది. ఇంద్రజిత్తు తాను వదిలే ఒకొక్క బాణానికి ఇద్దరు, ముగ్గురు ఐదుగురు ఏడుగురు చొప్పున వానరులను చంపుతున్నాడు. ఇది చూచిన వానర వీరులు ఇంద్రజిత్తు మీదికి ఒక్కుమ్మడిగా వెళ్లారు. కాని ఇంద్రజిత్తు ధాటికి తట్టుకోలేక పారిపోయారు. యుద్ధభూమి అంతా వానరుల మృతకళేబరాలతో నిండిపోయింది. రక్తం ఏరులై ప్రవహిస్తూ ఉంది.

పారి పోయిన వానరులు పారి పోగా, మిగిలిన వానరులు రాముని కొరకు రాక్షసులతో యుద్ధం చేసి మరణిస్తున్నారు. మరి కొంతమంది వానరులు ఇంద్రజిత్తు చుట్టు చేరి వృక్షములను, పర్వతశిఖరములను ఇంద్రజిత్తు మీదికి విసురుతున్నారు. కాని ఇంద్రజిత్తు ఆ వృక్షములను, పర్వతశిఖరములను తన బాణములతో చూర్ణం చేస్తున్నాడు. వానరవీరుల మీద సర్పములవంటి బాణములను ప్రయోగిస్తున్నాడు. పదునెనిమిది బాణములతో గంధమాధనుడిని, తొమ్మిది బాణములతో నలుడిని కొట్టాడు ఇంద్రజిత్తు. ఏడు బాణములతో మైందుడిని, ఐదు బాణములతో గజుడిని కొట్టాడు. జాంబవంతుడిని పదిబాణములతోనూ, నీలుడిని ముప్పది బాణములతోనూ కొట్టాడు. మహాబలవంతులైన సుగ్రీవుడిని, ఋషభుడిని, అంగదుణ్ణి స్పృహలేకుండా చేసాడు. వారినే కాకుండా ఇతర వానర వీరులను కూడా తన బాణాలతో ఎడతెరిపి లేకుండా కొట్టాడు. వానర వీరులంతా రక్తపు మడుగులతో తేలియాడుతుంటే ఇంద్రజిత్తు సంతోషంతో అరుస్తున్నాడు.

అంతే కాకుండా ఇంద్రజిత్తు తన మాయాయుద్ధంతో నలువైపుల నుండి వానరుల మీద శరవర్షము కురిపించాడు. ఇంద్రజిత్తు ఎక్కడ ఉన్నాడో తెలియదు. కాని బాణములు మాత్రం వర్షము వలె కురుస్తున్నాయి. ఆ బాణములు తమ శరీరములను చీలుస్తుంటే వానరులు నేలకూలుతున్నారు. ఇంద్రజిత్తు తమకు కనపడకపోవడం వల్ల వానరులు ఇంద్రజిత్తును కొట్టలేకపోతున్నారు. తన మాయాయుద్ధంతో ఇంద్రజిత్తు వానరులను తన బాణములతో చీలుస్తున్నాడు. ఒక్క బాణములనే కాదు శూలములను గండ్ర గొడ్డళ్లను, ఖడ్గములను నలుదిక్కులనుండి ప్రయోగిస్తున్నాడు ఇంద్రజిత్తు. నలువైపుల నుండి బాణములు వచ్చి గుచ్చుకుంటుంటే వానరులు వికృతంగా అరుస్తున్నారు. ఆ బాణాలు ఎక్కడి నుండి వస్తున్నాయో తెలీక ఆకాశం వంక దీనంగా చూస్తూ కింద పడి ప్రాణాలు వదులుతున్నారు వానరులు.

అంతటితో ఆగలేదు ఇంద్రజిత్తు. తన వద్దఉన్న అన్ని ఆయుధముల మీద అంటే ప్రాసలు, శూలములు,బాణముల మీద బ్రహ్మాస్త్రమును అభిమంత్రించి వానర వీరులయిన హనుమంతుడు, అంగదుడు, సుగ్రీవుడు, గంధమాధనుడు, జాంబవంతుడు, సుషేణుడు, వేగదర్శుడు, మైందుడు, ద్వివిదుడు, నీలుడు, గవాక్షుడు, నీలుడు, గవయుడు, కేసరి, హరిలోముడు, విద్యుద్దంష్ట్రుడు, సూర్యాననుడు, జ్యోతిముఖుడు, దధిముఖుడు, పావకాక్షుడు, నలుడు, కుముదుడు మొదలగు వానరవీరుల మీద వదులుతున్నాడు. తరువాత రామలక్ష్మణుల మీద కూడా వాడి అయిన బాణములను వర్షము మాదిరి కురిపించాడు.

ఇది చూచిన రాముడు లక్ష్మణునితో ఇలా అన్నాడు. “లక్ష్మణా! ఈ రాక్షసుడు తన బాణముల మీద బ్రహ్మాస్త్రమును అభిమంత్రించి వానరులను చంపుతున్నాడు. మన మీద కూడా శరవర్షము కురిపిస్తున్నాడు. ఇతడు బ్రహ్మవరప్రసాది. ఇతనిని ఎలా జయించాలో తెలియకున్నది. ఇతడు ప్రయోగిస్తున్న అస్త్రములకు శస్త్రములకు అధి దేవత బ్రహ్మదేవుడు. వీటిని మనము అడ్డుకోలేము. లక్ష్మణా! నీవు ఈ అస్త్రములకు భయపడకు నా వెంట ఉండు. ఈ బ్రహ్మాస్త్రప్రభావం చేత మనము ఇద్దరమూ కిందపడి పోయి మూర్ఛపోదాము. అప్పుడు ఆ రాక్షస వీరుడు సంతోషంతో బాణప్రయోగాన్ని ఆపుతాడు. విజయ గర్వంతో లంకానగరానికి తిరిగి వెళతాడు. ప్రస్తుతానికి ఈ ఆపద గట్టెక్కవచ్చును. లేకపోతే ఇతని చేతిలో మన వానర సేన పూర్తిగా నాశనం అయిపోతుంది.” అని అన్నాడు. దానికి లక్ష్మణుడు అంగీకరించాడు.

ఇంద్రజిత్తు బాణములు వేస్తుంటే రామలక్ష్మణులు సహిస్తున్నారు. ఇంద్రజిత్తు సంతోషంతో హర్షధ్వానాలు చేస్తున్నాడు. రామలక్ష్మణులు కిందపడిపోయారు. కదలకమెదలక పడిఉన్నారు. రాక్షసులు ఇంద్రజిత్తును పొగుడుతూ కేరింతలు కొడుతున్నారు. రాక్షస సేనలు లంకానగరం వైపుకు సాగిపోయారు.

శ్రీమద్రామాయణము

యుద్ధకాండము డెబ్బదిమూడవ సర్గ సంపూర్ణము

ఓం తత్సత్ ఓం తత్సత్ ఓం తత్సత్

యుద్ధకాండము

డెబ్బది నాలుగవ సర్గ.

ఇంద్రజిత్తు ప్రయోగిస్తున్న బ్రహ్మాస్త్రముల ధాటికి తట్టుకోలేక రామలక్ష్మణులు, వానర నాయకులు మూర్ఛపోయారు. అది చూచిన వానర వీరులు కలవరపడ్డారు. ఇంతలో విభీషణుడు అతనితో ఇలా అన్నాడు. “మీరు ఏమీ దిగులుపడకండి. రాముడు, లక్ష్మణుడు బ్రహ్మాస్త్రమును మన్నించి మూర్ఛపోయారు. ఈ బ్రహ్మాస్త్రమును బ్రహ్మదేవుడు ఇంద్రజిత్తుకు ప్రసాదించాడు. ఆ బ్రహ్మాస్త్రమును ఇంద్రజిత్తు దుర్వినియోగపరుస్తున్నాడు. బ్రహ్మదేవుని అస్త్రమును ఏ అస్త్రమూ వెనుకకు మళ్లించలేదు. కాబట్టి రామలక్ష్మణులు కేవలము మూర్ఛిల్లారు. మీరు దిగులుపడకండి.” అని అన్నాడు.

ఇంతలో హనుమంతుడు బ్రహ్మాస్త్రమునకు కొంచెం సేపు కట్టుబడి తరువాత మూర్ఛనుండి తేరుకున్నాడు. విభీషణుని మాటలు విన్నాడు. “విభీషణా! వానర సైన్యము అంతా బ్రహ్మాస్త్ర ప్రభావంలో ఉంది. వీళ్లలో ఎంతమంది ప్రాణాలతో ఉన్నారో చూడాలి.” అని అన్నాడు. తరవాత హనుమంతుడు, విభీషణుడు చేతిలో కాగడాలు ధరించి ఒక్కొక్క వానరుడిని పరీక్షిస్తున్నారు. యుద్ధభూమి అంతా వెదుకు తున్నారు. యుద్ధభూమి అంతా వానర వీరుల మృతశరీరములో తెగిపడిన కాళ్లు చేతులతో నిండి ఉంది. వారు బ్రహ్మాస్త్రమునకు కట్టుబడి ఉన్న సుగ్రీవుడు, మైందుడు, ద్వివిదుడు, అంగదుడు, నీలుడు, శరభుడు, గంధమాధనుడు, గవాక్షుడు, సుషేణుడు, వేగదర్శుడు, నలుడు, జ్యోతిముఖుడు మొదలగు వానర వీరులను చూచాడు.

ఆ రోజు ఇంద్రజిత్తు అరవైఏడు కోట్ల వానరములను కొట్టాడు. ఇంతలో వృద్ధుడైన జాంబవంతుడు కూడా అక్కడకు వచ్చాడు.

జాంబవంతుని చూచి విభీషణుడు ఇలా అన్నాడు. “జాంబవంతా మీకు క్షేమమే కదా!” అని అడిగాడు. “లేదు విభీషణా! నా శరీరం అంతా బాణములు గుచ్చుకున్నాయి. కదలలేకుండా ఉన్నాను. నా కళ్లుకూడా కనపడడం లేదు. నీ కంఠస్వరమును బట్టి నిన్ను గుర్తు పట్టాను. విభీషణా! హనుమంతుడు క్షేమమేనా! అతనిని నువ్వు చూచావా!” అని అడిగాడు. విభీషణునికి ఆశ్చర్యం వేసింది. ఇదేమిటి! జాంబవంతుడు రామలక్ష్మణుల క్షేమం గురించి అడగకుండా హనుమంతుని గురించి అడుగుతున్నాడు అని అనుకున్నాడు. ఆతురత ఆపుకోలేక అడిగేసాడు.

“జాంబవంతా! నీవు రామలక్ష్మణుల క్షేమము అడగకుండా, సుగ్రీవుని క్షేమము అడగకుండా కేవలము హనుమంతుని మీద ఎందుకు అధికమైన ప్రేమ చూపుతున్నావు. తెలుసుకోవచ్చునా!” అని అడిగాడు. దానికి జాంబవంతుడు ఇలా అన్నాడు. “విభీషణా! హనుమంతుడు జీవించి ఉంటే మొత్తము వానర సైన్యము జీవించి ఉన్నట్టే. అతడు మరణిస్తే యుద్ధము ముగిసినట్టే. అందుకని అడిగాను. వాయుపుత్రుడైన హనుమ జీవించి ఉంటే మన జీవితములకు భయం లేదు.” అని అన్నాడు.

అప్పుడు హనుమంతుడు వినయంగా వృద్ధుడైన జాంబవంతుని పాదాలకు నమస్కరించాడు. భారంగా కనురెప్పలు ఎత్తి హనుమంతుని చూచిన జాంబవంతుడు తాను పునర్జన్మఎత్తినట్టు

సంతోషించాడు. "హనుమా! వచ్చావా. రా నాయనా. వానర వీరులను రక్షించు. ఇప్పుడు నీ బలపరాక్రమములు చూపే సమయం వచ్చింది. రామలక్ష్మణుల శరీరములో గుచ్చుకున్న బాణములను తొలగించు. హనుమా! ఇప్పుడు నీవు హిమవత్పర్వతమునకు వెళ్లాలి. అక్కడ ఋషభము అనే పర్వతము, కైలాస శిఖరము కనపడతాయి.. ఆ రెండింటి మధ్య ఓషధీ పర్వతము ఉంది. ఆ పర్వత శిఖరము మీద నాలుగు ఓషధీ మొక్కలు ఉన్నాయి. అవి దివ్యంగా ప్రకాశిస్తూ ఉంటాయి. అవే మృతసంజీవని, విశల్యకరణి, సువర్ణకరణి, సంధాన కరణి అనే ఓషధులు. నీవు వెళ్లి ఆ ఓషధులను తీసుకొని రా! అప్పుడు ఈ వానరులందరూ బతుకుతారు." అని అన్నాడు.

ఆ మాటలు విన్న హనుమంతుడు హిమాలయ పర్వతమునకు వెళ్లడానికి ఉద్యుక్తుడయ్యాడు. పక్కనే ఉన్న ఒక పర్వతము మీదికి ఎక్కాడు. కాళ్లతో పర్వతమును తన్ని పెట్టాడు. పెద్దగా గర్జించాడు. తన తోకను పైకి ఎత్తాడు. రెండు చేతులు ముందుకు చాచి ఒక్క ఉదుటున పైకి ఎగిరాడు. ఆ ఊపుకు పర్వతము ఊగిసలాడింది. భూమి కంపించి లంకా నగరము వణికిపోయింది. రాక్షసులు దిక్కుతోచకుండా అటు ఇటు పరుగులు తీసారు. హనుమంతుడు ఉత్తరదిశగా ఉన్న హిమవత్పర్వతము వైపుకు సాగిపోయాడు. హనుమంతుడు పర్వతములను, అడవులను, జనపదములను, నదులను, సరస్సులను దాటుకుంటూ ఆకాశ మార్గంలో వెళుతున్నాడు.

అతి స్వల్పకాలంలోనే హిమవద్పర్వతమును చేరుకున్నాడు. హిమవత్పర్వతము మీద ఎన్నో గుహలు, జల ప్రవాహములు కనపడ్డాయి. తెల్లటి మంచుతో కప్పబడిన పర్వత శిఖరములు ప్రకాశిస్తున్నాయి. హిమత్పర్వత శిఖరముల మీద ఉన్న దేవతా సమూహములను, ఋషి సమూహములను, మునుల ఆశ్రమములను చూచాడు. హిమవత్పర్వతము మీద ఉన్న బ్రహ్మదేవుని నివాసమును, కైలాస పర్వతమును, ఇంద్రుని నివాసమును, రుద్రుని క్రీడాస్థలమును, హయగ్రీవుని ఆరాధనా ప్రదేశమును, చూచాడు. అవే కాకుండా బ్రహ్మదేవుడు ఇంద్రునకు వజ్రాయుధము ఇచ్చిన ప్రదేశమును, కుబేరుని నివాసమును, విశ్వకర్మ సూర్యుని బంధించిన స్థానమును, బ్రహ్మ యొక్క ఆసనమును, శంకరుడు తన ధనుస్సును, బాణమును పెట్టుకొనె స్థలమును, పాతాళమునకు వెళ్లుద్వారమును చూచాడు.

హనుమంతుడు కైలాస పర్వతమును, హిమవత్పర్వత శిఖరములను, ఋషభ పర్వతమును, మేరుపర్వతమును, ఓషధీ పర్వతమును చూచాడు. హనుమంతుడు ఓషధీ పర్వతము మీదికి దిగాడు. అక్కడ ఉన్న ఓషధులను వెతికాడు. ఎవరో తమకోసం వెదుకుతున్నారు అని తెలుసుకున్న ఓషధులు హనుమంతునికి కనపడకుండా మాయం అయ్యాయి. అప్పటి దాకా మిలా మిలా మెరుస్తూ ఉన్న ఓషధులు ఒక్కసారిగా అదృశ్యం అయ్యేసరికి హనుమంతునికి కోపం వచ్చింది. గట్టిగా అరిచాడు. కేకలు పెట్టాడు. "ఓ ఓషధీ పర్వతమా! ఈ ఓషధులు రాముని కొరకు తీసుకొని పోవుటకు వచ్చాను. కాని నీవు జాలి చూపడం లేదు. కాని నేను వదలను. నిన్ను పెకలించి తీసుకొని పోతాను. అప్పుడు ఎలా నా వెంట రారో చూస్తాను." అంటూ తన రెండు చేతులతో ఆ ఓషధీపర్వతమును

పెకలించాడు. చేతులతో ఎత్తుకొని పైకి ఎగిరాడు. గరుడుని మాదిరి భయంకరమైన వేగంతో లంక వైపు సాగిపోయాడు. హనుమంతుని చేతిలో ఉన్న ఆ పర్వతము రెండవ సూర్యుని వలె ప్రకాశిస్తూ ఉంది. ఆ పర్వతమును తీసుకొని పోతున్న హనుమంతుడు విష్ణుమూర్తి చేతిలో ఉన్న సుదర్శన చక్రము మాదిరి ప్రకాశించాడు.

హనుమంతుడు సముద్రమును దాటి లంకను చేరుకున్నాడు. ఆకాశంలో ఉన్న హనుమంతుని చూచి కింద ఉన్న వానరసేనలు పెద్దగా కేకలు పెట్టాయి హర్షధ్వానాలు చేసాయి. ఆ కేకలకు లంకలో నిద్రపోతున్న రాక్షసులు కంగారుగా నిద్రలేచారు. హనుమంతుడు మెల్లగా వానర సైన్యము మధ్య దిగాడు. ఆ ఓషధీ పర్వతము మీద ఉన్న ఓషధుల వాసన తగలగానే, ఆ ప్రభావానికి ఇంద్రజిత్తు చేతిలో చంపబడిన, గాయపడిన, వానరులు అందరి శరీరములలో నుండి బాణములు తొలగి పోయాయి. గాయములు మానిపోయాయి. అందరూ నిద్రనుండి లేచినట్టు పైకి లేచారు. రామలక్ష్మణుల శరీరములలో గుచ్చుకున్న బాణములు అన్నీ ఊడి కిందపడ్డాయి. రామలక్ష్మణులు ఆరోగ్యవంతులై లేచి కూర్చున్నారు.

వీరే కాకుండా రాక్షసులతో వానరుల యుద్ధము మొదలైనది మొదలు ఆ రోజు వరకూ రాక్షసుల చేతిలో మరణించిన వానరులందరూ ఆ ఓషధుల ప్రభావానికి పునర్జీవితులయ్యారు. కాని ఒక్క రాక్షసుడు కూడా బతకలేదు. దానికి కారణం, రాక్షసులు ప్రతిరోజూ యుద్ధములో వానరుల చేతిలో చచ్చిన రాక్షస సైనికులను ఏ రోజుకు ఆ రోజు రావణుని ఆజ్ఞ మేరకు, సముద్రములో

పారవేసేవారు. అందువలన ఆ సమయంలో ఒక్క రాక్షసుని మృతదేహము కూడా యుద్ధభూమిలో లేదు. అందువలన యుద్ధములో చనిపోయిన ఒక్క రాక్షసుడు కూడా, ఓషధీ ప్రభావంతో బతికే అవకాశం లేకపోయింది.

వెంటనే హనుమంతుడు ఆ ఓషధీ పర్వతమును తీసుకొని పోయి దాని యథాస్థానములో ఉంచి వచ్చాడు. వచ్చి రాముని ముందు నిలిచి, రామునికి నమస్కరించాడు.

శ్రీమద్రామాయణము
యుద్ధకాండము డెబ్బది నాలుగవ సర్గ సంపూర్ణము
ఓం తత్సత్ ఓం తత్సత్ ఓం తత్సత్

యుద్ధకాండము
డెబ్బది ఐదవ సర్గ.

ఆ ప్రకారంగా వానర సేనలు అందరూ పునర్జీవితులయ్యారు. సుగ్రీవుడు హనుమంతుని చూచి ఇలా అన్నాడు. "హనుమా! కుంభకర్ణుడు యుద్ధములో మరణించాడు. ప్రస్తుతము లంకనుండి మనతో యుద్ధము చేయడానికి వచ్చే వాళ్లు ఎవరూ ఉన్నట్టు కనపడటం లేదు. ఈ సమయంలో మన వానరులు అందరూ ఈ రాత్రికి లంకలో ప్రవేశించి రావణుని నివాసమును కాల్చివేస్తారు. ఇది నా ఆజ్ఞ." అని ఆదేశించాడు.

సుగ్రీవుని ఆదేశము ప్రకారము కొంత మంది వానర

వీరులు చేతిలో కాగడాలు ధరించి, చీకటి పడగానే లంక వైపుకు వెళ్లారు. ఆ వానరులను చూచి లంకకు కాపలాగా ఉన్న రాక్షసులు పారిపోయారు. చేతిలో కాగడాలు ధరించిన వానరులు లంకా నగరంలో ప్రవేశించారు. లంకలోని నివాసములకు, మేడలకు, చైత్యములకు అన్నిటికి నిప్పుపెట్టారు. లంకా నగరం అంతా తగలబడిపోయింది. ఎన్నో భవనములు చైత్యములు అగ్నిగి ఆహుతి అయ్యాయి. ఆయుధములు, రథములు, కవచములు, కత్తులు, డాళ్లు, ధనుస్సులు, బాణములు,, వస్త్రములు, అన్నీ కాలిబూడిదఅయ్యాయి. రాక్షస పౌరులందరూ భార్యా పిల్లలతో ప్రాణాలు దక్కించుకోడానికి పరుగులు పెడుతున్నారు. అగ్ని ఒక భవనము నుండి మరొక భవనమునకు వ్యాపిస్తూ అన్నిటినీ దహిస్తూ ఉంది. రాక్షస స్త్రీలందరూ వీధుల్లో పరుగులుపెడుతున్నారు. ఏనుగుల శాలలలో ఉన్న ఏనుగు లను, గుర్రపు శాలలలో ఉన్న గుర్రములను వాటి రక్షకులు కట్టు విప్పి పారి పొమ్మని సైగలు చేస్తున్నారు. ఏనుగులు, గుర్రములు తమ కట్లువిప్పగానే పారిపోతున్నాయి. కొన్ని ఏనుగులు, గుర్రములు బలవంతంగా కట్లు తెంచుకొని పారిపోతున్నాయి. కొద్ది సేపట్లోనే సుందరమైన లంకా నగరమంతా బూడిద అయింది. స్త్రీలు, పిల్లలు చేస్తున్న ఆర్తనాదాలతో లంక అంతా మార్మోగుతోంది.

ఇక్కడ రాముడు, లక్ష్మణుడు రాక్షసుల మీదికి యుద్ధానికి సన్నద్ధము అవుతున్నారు. తమ తమ ధనుస్సులను సారిస్తున్నారు. ధనుష్టంకారములు చేస్తున్నారు. ఒక పక్క ఇళ్లు వాకిళ్లు దగ్ధం అయిపోతుంటే, మరొక పక్క రాక్షస సైనికులు యుద్ధరంగానికి వెళు తున్నారు. రామలక్ష్మణులు లంకా నగరం మీదికి తమ బాణాలు

వదులుతున్నారు. ఆ బాణాల దెబ్బకు లంకా నగరంలోని పెద్ద పెద్ద చైత్యములు గోపురములు కూలిపోతున్నాయి. రాక్షస నాయకులకు ఆ రాత్రి కాళరాత్రి అయింది.

సుగ్రీవుడు వానర నాయకులనందరినీ సమావేశ పరిచి వారితో ఇలాఅన్నాడు. "వానర నాయకులారా! మీరందరూ మీ మీ స్థానములలో నిలబడి యుద్ధం చేయండి. ఎవరూ నా ఆజ్ఞను ధిక్కరించరాదు" అని ఆదేశించాడు. ఆ ప్రకారము వానర వీరులు తమ తమ సైన్యములతో చేత కాగడాలు ధరించి యుద్ధం చేస్తున్నారు. లంకా నగర ద్వారముల దాకా వచ్చిన వానర వీరులను చూచి రావణుడు కోపంతో ఊగిపోయాడు. వెంటనే కుంభకర్ణుని కుమారులైన కుంభుడు, నికుంభుడు అనే వారిని రాక్షస సేనలతో యుద్ధానికి పంపాడు. వారి వెంట యూపాక్షుడు, శోణితాక్షుడు, ప్రజంఘుడు, కంపనుడు అనే రాక్షస వీరులను కూడా పంపాడు. వారందరూ సింహనాదాలు చేస్తూ వానరుల మీదికి యుద్ధానికి బయలుదేరారు.

చంద్రుడు ప్రసరించే వెన్నెలలో, నక్షత్రాల కాంతిలో, చేతిలో ఉన్న కాగడాల కాంతిలో వారు ఒకరితో ఒకరు యుద్ధం చేస్తున్నారు. రాక్షసులు పరిఘలు, ప్రాసలు ధరించి యుద్ధము చేస్తున్నారు. వానరులు తమ చేతులలో వృక్షములు, పెద్ద పెద్ద బండరాళ్లు ధరించి యుద్ధము చేస్తున్నారు. దగ్గరకు వచ్చిన రాక్షసులను గోళ్లతో చీలుస్తున్నారు. రాక్షసులు తమ చేతిలో ఉన్న ధనస్సుల నుండి బాణములు సంధించి వానరులను చంపుతున్నారు. వానరులు రాక్షసుల చెవులను కొరుకుతున్నారు. తలలు పగలగొడుతున్నారు.

శరీరాలను రాళ్లతో మోదుతున్నారు. కొట్టండి, చంపండి, నిలవండి, వాడిని చంపు వీడిని చంపు అనే మాటలతో యుద్ధరంగము మార్మోగిపోతోంది. కొన్ని బాణములు సూటిగా వచ్చి తగులుతుంటే చాలా మటుకు గురితప్పి వ్యర్థము అవుతున్నాయి. ఈ ప్రకారంగా ఆ రాత్రి రాక్షసులు వానరులు ఒకరితో ఒకరు భీకరంగా పోరాడుతున్నారు.

శ్రీమద్రామాయణము

యుద్ధకాండము డెబ్బది ఐదవ సర్గ సంపూర్ణము

ఓం తత్సత్ ఓం తత్సత్ ఓం తత్సత్

యుద్ధకాండము

డెబ్బది ఆరవ సర్గ.

రాక్షసులు వానరులు ఆ ప్రకారంగా ఘోరయుద్ధము చేస్తుంటే అంగదుడు, రాక్షస వీరుడు కంపనునితో యుద్ధము చేస్తున్నాడు. అంగదుడు కంపనుని తన గదతో మోదాడు. ఆ దెబ్బకు కంపనుడు చలించిపోయాడు. కాసేపు కళ్లు బైర్లు కమ్మాయి. అంతలోనే తేరుకున్నాడు. ఈ అవకాశాన్ని ఉపయోగించుకొని అంగదుడు కంపనుడి మీద ఒక పర్వత శిఖరమును విసిరాడు. ఆ దెబ్బకు కంపనుడు నేలకూలాడు. గిలా గిలా కొట్టుకొని ప్రాణాలు వదిలాడు.

కంపనుడి మరణమును కళ్లారా చూచిన శోణితాక్షుడు

తన రథాన్ని అంగదుని మీదికి పోనిచ్చాడు. కాలాగ్నితో సమానమైన బాణములను అంగదుని మీద ప్రయోగించాడు. క్షురములు, నారాచములు, వత్సదంతములు, శిలీముఖములు మొదలగు వాడి అయిన బాణములను అంగదుని మీద ప్రయోగించాడు. దానికి ప్రతిగా అంగదుడు శోణితాక్షుని ధనుస్సును, బాణములను, రథమును విరగ్గొట్టాడు. అప్పుడు శోణితాక్షుడు రథమును దిగి తన ఖడ్గము, డాలు తీసుకొని ఆకాశంలోకి ఎగిరాడు. అంగదుడు వాడి కన్నా ఎత్తుకు ఎగిరి, వాడి చేతిలోని ఖడ్గము లాక్కుని పెద్దగా అరిచాడు. తన చేతిలో ఉన్న ఖడ్గముతో అంగదుడు శోణితాక్షుని భుజం దగ్గర నరికాడు. శోణితాక్షుడు నేల మీద పడి మూర్ఛపోయాడు.

ఆ ప్రకారంగా శోణితాక్షుని నేలకూల్చిన అంగదుడు చేతిలో ఉన్న ఖడ్గముతో సింహనాదము చేసాడు. రాక్షస సేనలమీదికి వెళ్లాడు. ఇది చూచిన యూపాక్షుడు, ప్రజంఘునుడు ఇద్దరూ అంగదుని మీదికి దూకారు. ఇంతలో మూర్ఛనుండి తేరుకున్న శోణితాక్షుడు ఒక గదను తీసుకొని అంగదుని ఎదుర్కొన్నాడు. మరొక పక్కనుండి ప్రజంఘుడు తన గదతీసుకొని అంగదుని మీదికి వెళ్లాడు. ఆ ప్రకారంగా ఆ ముగ్గురు రాక్షస వీరులు అంగదుని చుట్టుముట్టారు.

ఇది చూచిన మైందుడు, ద్వివిదుడు అంగదుని రక్షణ కోసరం అతని వద్దకు వచ్చారు. ఆ ముగ్గురు రాక్షస వీరులకు, ముగ్గురు వానర వీరులకు ఘోరమైన యుద్ధము జరిగింది. ఆ వానర వీరులు రాక్షసుల మీదికి వృక్షములు, పర్వతశిఖరములు విసురుతుంటే, యూపాక్షుడు తన బాణములతో వాటిని నాశనం చేస్తున్నాడు. ద్వివిదుడు, మైందుడు పెద్ద పెద్ద పర్వత శిఖరములను పెకలించి

రాక్షస వీరుల మీదికి విసురుతుంటే వాటిని శోణితాక్షుడు తన గదతో ఎదుర్కొంటున్నాడు. ప్రజంఘుడు తన ఖడ్గము తీసుకొని అంగదుని మీదికి వెళ్లాడు. ప్రజంఘుని తన దగ్గరగా రానిచ్చి, అంగదుడు ఒక పెద్ద మద్దిచెట్టుతో వాడిని తలమీద కొట్టాడు. తరువాత ప్రజంఘుని కత్తిపట్టుకున్న చేతిని విరిచాడు. ప్రజంఘుని ఖడ్గము నేలమీద పడిపోయింది. చేతిలో ఏమీ లేకపోవడంతో ప్రజంఘుడు పిడికిలి బిగించి అంగదుని మీదికి దూకాడు. అంగదుని నుదుటి మీద బలంగా కొట్టాడు. ఆ దెబ్బకు అంగదుడు స్పృహ తప్పాడు. అంతలోనే తేరుకున్న అంగదుడు ప్రజంఘుని తలనుపట్టుకొని గిరా గిరా తిప్పి మొండెము నుండి వేరు చేసాడు. ప్రజంఘుని తల నేల మీద దొర్లింది.

ప్రజంఘుడు యూపాక్షునికి పినతండ్రి అవుతాడు. కళ్లముందే పినతండ్రి తల నేల కూలడం చూచిన యూపాక్షుడు చలించిపోయాడు. అప్పటికే అతని వద్ద ఉన్న బాణములు అయిపోయాయి. అందువలన ఖడ్గము చేతిలోకి తీసుకొని రథము నుండి కిందికి దిగాడు. ద్వివిదుడిని ఎదుర్కొన్నాడు. ద్వివిదుడు వాడిని గట్టిగా పట్టుకొని గుండెల మీద కొట్టాడు. తన సోదరుడైన యూపాక్షుని ద్వివిదుడు పట్టుకోడం చూచి, శోణితాక్షుడు ద్వివిదుడిని వక్షస్థలం మీద బలంగా కొట్టాడు. ఆ దెబ్బకు ద్వివిదుడు తొట్రుపడ్డాడు. ద్వివిదుడిని కొట్టడానికి శోణితాక్షుడు గద పైకెత్తాడు. ద్వివిదుడు ఆ గదను లాక్కున్నాడు. ఇంతలో మైందుడు ద్వివిదునికి సాయంగా వచ్చాడు. తన అరిచేతితో యూపాక్షుడిని గుండెల మీద కొట్టాడు. ఒక పక్క మైందుడు, ద్వివిదుడు, మరొక పక్క శోణితాక్షుడు, యూపాక్షుడు ఘోరంగా యుద్ధం చేస్తున్నారు. ద్వివిదుడు శోణితాక్షుని

ముఖం అంతా తన గోళ్లతో రక్కాడు. కిందపడేసి తొక్కాడు. శోణితాక్షుడు మరలా లేవలేదు.

మైందుడు యూపాక్షుణ్ణి గట్టిగా పట్టుకున్నాడు. గట్టిగా నలిపేసాడు. మైందుడి చేతుల్లో నలిగిన యూపాక్షుడు ప్రాణాలు కోల్పోయాడు. యూపాక్షుడు, శోణితాక్షుడు చావడం చూచిన రాక్షస సేనలు కుంభకర్ణుని కుమారుడు కుంభుని వైపు పరుగెత్తారు. వారిని చూచిన కుంభుడు వారికి ధైర్యము చెప్పి వారిని యుద్ధోన్ముఖులను చేసాడు. కుంభుడు తన ధనుస్సును తీసుకొని అత్యంత విషపూరితము లైన సర్పములతో సమానమైన బాణములను(అంటే విషము పూసిన బాణములు) వానర సేనల మీదికి సంధించాడు. మొదటిసారిగా ద్వివిదుడిని కొట్టాడు. ఆ దెబ్బకు ద్వివిదుడు తూలి కిందపడ్డాడు. అది చూచిన మైందుడు ఒక పెద్ద గండశిలను తీసుకొని కుంభుడి మీదికి విసిరాడు. కుంభుడు ఆ శిలను తన బాణములతో ముక్కలు చేసాడు. కుంభుడు మైందుని వక్షస్థలము చీల్చేటట్టు ఒక బాణమును సంధించాడు. ఆదెబ్బకు మైందుడు కిందపడి మూర్ఛపోయాడు.

ఇది చూచిన అంగదుడు కుంభుని మీదికి ఉరికాడు. కుంభుడు ఐదు నారాచములను అంగదుని మీదికి ప్రయోగించాడు. అంగదుడు ఆ బాణములకు భయపడకుండా వృక్షములతోనూ బండరాళ్లతోనూ కుంభుని కొట్టాడు. అంగదుడు తన మీదికి విసిరిన వక్షములను, రాళ్లను తన బాణములతో పొడి పొడి చేసాడు కుంభుడు. అంతే కాకుండా రెండు బాణములతో అంగదుని ఫాలభాగమున కొట్టాడు. తన నుదురు నుండి రక్తం కారుతూ ఉంటే అంగదునికి కళ్లు కనిపించడం లేదు. రక్తం తుడుచుకుంటున్నాడు. అలాంటి స్థితిలో

కూడా అంగదుడు ఒక పెద్ద సాలవృక్షమును పెకలించి తీసుకొని కుంభుని మీదికి విసిరాడు. కుంభుడు ఆ సాలవృక్షమును రెండుగా ఖండించాడు.

నుదుటి మీద గాయంతో అంగదుడు అలసిపోయాడు. యుద్ధం చేయలేకపోతున్నాడు. ఈ విషయాన్ని వానరులు రామునికి తెలిపారు. రాముడు జాంబవంతుని వానర సేనలతో అంగదునికి సాయంగా పంపాడు. వానరులందరూ చేతులలో వృక్షములు, రాళ్లు తీసుకొని కుంభుని వైపు పరుగెత్తారు. వారి వెంట జాంబవంతుడు, సుషేణుడు, వేగదర్శీ అంగదునికి సాయంగా వెళ్లారు. ఇది చూచిన కుంభుడు ఆ వానర నాయకుల మీద శరవర్షము కురిపించాడు. ఆ వానర నాయకులు కుంభుని బాణముల ధాటికి తట్టుకోలేకపోతున్నారు. ఇది గమనించిన సుగ్రీవుడు తాను కూడా అంగదునికి సాయంగా వెళ్ళాడు.

సుగ్రీవుడు చేతికందిన వృక్షములను పెకలించి కుంభుని మీదికి వరుసగా ఎడతెరిపి లేకుండా విసురుతున్నాడు. తన మీద వర్షము వలె పడుతున్న ఆ వృక్షములను కుంభుడు తన శరవర్షముతో ఛేదించాడు. తాను విసిరిన వృక్షములు వృథా కావడం చూచిన సుగ్రవుడు, రెట్టించిన ఉత్సాహంతో కుంభుని మీదికి దూకాడు. వాడి ధనుస్సును విరిచాడు. కుంభుని పట్టుకొని ఇలా అన్నాడు.

"ఓ వీరుడా! నీ యుద్ధము ప్రశంసనీయము. నీ

శరప్రయోగము అభినందనీయము. యుద్ధములో నీవు, రావణుడు సరిసమానులే. నీ తండ్రికి తగ్గ కుమారుడవు అనిపించుకున్నావు. కాని ఇప్పుడు నేను నీతో యుద్ధము చేస్తున్నాను. నా పరాక్రమం కూడా చూడు. నీ తండ్రి కుంభకర్ణుడు తన సహజ పరాక్రమంతో మమ్ములను ఎదిరించాడు. కాని నీ పినతండ్రి రావణుడు వరబలంతో మమ్ములను ఎదిరించాడు. నువ్వు కూడా నీ తండ్రి మాదిరి సహజమైన బల పరాక్రమములు కలిగిన వాడవు. పరాక్రమంలో రావణుని, బాణ ప్రయోగంలో ఇంద్రజిత్తును మరిపిస్తున్నావు. ఇప్పటి దాకా నేను చూచిన రాక్షస వీరులలో నీవే గొప్పవాడివి. అటువంటి నిన్ను నేను యుద్ధంలో ఎదుర్కొంటున్నాను. ఇప్పటిదాకా నీ అస్త్రశస్త్ర నైపుణ్యంతో వానర వీరులను నిస్తేజులుగా చేసావు. నీవు ఇప్పటి దాకా వానర వీరులతో యుద్ధం చేయడం వలన అలసినట్టున్నావు, కొంచెంసేపు విశ్రాంతి తీసుకొని నాతో యుద్ధానికి తలపడు. అప్పుడు మనం ఇద్దరం బలాబలాలు చూసుకుందాము." అని అన్నాడు సుగ్రీవుడు.

ఈ మాటలు విన్న కుంభునికి అగ్నిలో ఆజ్యం పోసినట్ట యింది. మారు మాటాడకుండా కుంభుడు తన ఎదురుగా ఉన్న సుగ్రీవుని తన బాహువుల మధ్య గట్టిగా పట్టుకున్నాడు. సుగ్రీవుడు కుంభుడు ద్వంద్వ యుద్ధం చేస్తున్నారు. సుగ్రీవుడు కుంభుని పైకి ఎత్తి గిరా గిరా తిప్పి సముద్రంలోకి గిరాటు వేసాడు. సముద్రంలో పడ్డ కుంభుడు బంతి మాదిరి లేచి వచ్చి సుగ్రీవుని వక్షస్థలము మీద పిడికిలితో మోదాడు. ఆ దెబ్బకు సుగ్రీవుని గుండెల నుండి రక్తం స్రవిస్తూ ఉంది. దెబ్బ తిన్న సుగ్రీవుడు కోపంతో పిడికిలి బిగించాడు. కుంభుని వక్షస్థలము మీద బలంగా కొట్టాడు. ఆ దెబ్బను తట్టుకోలేక కుంభుడు నేలమీద పడిపోయాడు. కుంభుని గుండెలు బద్దలయ్యాయి.

కుంభుడు గిలా గిలా కొట్టుకొని మరణించాడు. కుంభుని మరణం చూడగానే రాక్షస వీరులు భయంతో వణికిపోయారు.

శ్రీమద్రామాయణము
యుద్ధకాండము డెబ్బై ఆరవ సర్గ సంపూర్ణము
ఓం తత్సత్ ఓం తత్సత్ ఓం తత్సత్

యుద్ధకాండము
డెబ్బై ఏడవ సర్గ.

కుంభుని సోదరుడు నికుంభుడు. తన సోదరుని మరణం కళ్లారా చూచిన నికుంభుడు కోపంతో రగిలిపోయాడు. ఒక పరిఘను తీసుకున్నాడు. పెద్దగా అరిచాడు. గర్జించాడు. వాడిని వాడి పరిఘను వానరులు అంతా ఆసక్తిగా చూస్తున్నారు. హనుమంతుడు వాడి ముందు రొమ్ము విరుచుకొని నిలబడ్డాడు. నికుంభుడు తన చేతిలో ఉన్న పరిఘను హనుమంతుని వక్షస్థలమునకు గురి చూచి విసిరాడు. హనుమంతుని వక్షస్థలమునకు తగిలి ఆ పరిఘ ముక్కలయింది.

ఆ పరిఘ దెబ్బకు హనుమంతుడు కూడా కొంచెం చలించాడు. కాని అంతలోనే నిలదొక్కుకున్నాడు. వెంటనే పిడికిలి బిగించాడు. బిగించిన పిడికిలితో హనుమ నికుంభుని గుండెల మీద చాచి ఒక దెబ్బ కొట్టాడు. ఆ దెబ్బకు నికుంభుని కవచము బద్దలయింది. వాడి గుండెలు పగిలి రక్తం కారింది. నికుంభుని కళ్ల

ముందు మెరుపు మెరిసినట్టయింది. కొంచెంసేపటికి తేరుకున్న నికుంభుడు హనుమను పట్టుకున్నాడు. పైకి లేపాడు. అది చూచి రాక్షసులు పెద్దగా అరుస్తూ కేరింతలు కొట్టారు. అప్పుడు హనుమంతుడు తన పిడికిలి బిగించి నికుంభుని తలమీద మోదాడు. వాడు హనుమను కిందికి జారవిడిచాడు. కింద పడ్డ హనుమంతుడు పైకి లేచి అదే ఊపుతో నికుంబుని కింద పడదోసాడు. హనుమ పైకి ఎగిరి వాడి గుండెల మీద పడ్డాడు. హనుమ నికుంభుని మెడ పట్టుకొని పిసికాడు. వాడి తలను బలవంతంగా శరీరం నుండి వేరు చేసాడు. ఆ ప్రకారంగా నికుంభుడు హనుమ చేతిలో మరణించాడు.

నికుంభుని చావు చూచిన వానరులు హనుమను పొగిడారు. హర్షధ్వానాలు చేసారు. రాక్షసులకు మనసులో భయం పట్టుకుంది.

శ్రీమద్రామాయణము
యుద్ధకాండము డెబ్బైఏడవ సర్గ సంపూర్ణము
ఓం తత్సత్ ఓం తత్సత్ ఓం తత్సత్

యుద్ధకాండము
డెబ్బైఎనిమిదవ సర్గ.

కుంభ, నికుంభుల మరణవార్త రావణునికి తెలిసింది. వరుసగా రాక్షస వీరుల మరణ వార్తలు వినడం అలవాటైపోయింది రావణునికి. అతని దు:ఖానికి అంతులేదు. అయినా పట్టినపట్టు వీడలేదు. అమీ తుమీ తేల్చుకోవాలని నిశ్చయించుకున్నాడు. జన

స్థానంలో రాముని చేతిలో చంపబడ్డ ఖరుని కుమారుడు అయిన మకరాక్షుడిని పిలిపించాడు. రాముని మీదికి యుద్ధానికి వెళ్లమని ఆజ్ఞాపించాడు. మకరాక్షుడు కూడా సంతోషంగా అంగీకరించాడు. వెంటనే తన రథమును. సైన్యమును సిద్ధం చేయమని సేనానాయకునికి ఆదేశాలు ఇచ్చాడు. వెంటనే మకరాక్షునికి ఒక రథము, రాక్షస సైన్యమును సమకూర్చారు. మకరాక్షుడు తన రథమునకు ప్రదక్షిణము చేసి రథము ఎక్కాడు. రాక్షస సేనలను చూచి ఇలా అన్నాడు.

"ఓ రాక్షస వీరులారా! రాక్షసరాజు రావణుని ఆజ్ఞమేరకు మనము రాముని మీదికి యుద్ధానికి పోతున్నాము. మీరందరూ మీ మీ ప్రాణాలు పణంగా పెట్టి వానర సేనలతో యుద్ధం చేయండి. నేను రామలక్ష్మణులతోనూ, సుగ్రీవునితోనూ, ఇతర వానర వీరులతోనూ యుద్ధం చేస్తాను. మనము వానర సైన్యమును అడవిని కార్చిచ్చు కాల్చినట్టు కాల్చివేయాలి." అని సేనలను ఉత్సాహపరిచాడు. రాక్షస సేనలు యుద్ధానికి సన్నద్ధులయ్యారు. భేరీ నినాదాలు మిన్నుముట్టాయి. శంఖములు పూరించారు. సింహ నాదాలు చేసారు. ఉత్సాహంతో యుద్ధభూమికి వెళ్లారు.

అంతలోనే కొన్ని దుశ్శకునములు కనిపించాయి. మకరాక్షుని సారథి చేతిలోని కొరడా జారి కిందపడింది. అతడి ధ్వజము విరిగి కిందపడింది. పెనుగాలులు వీచాయి. కాని మకరాక్షుడు ఆ శకునములను లెక్కచేయలేదు. ముందుకు కదిలాడు. అతని వెంట రాక్షస సేనలు కత్తులు ఝుళిపిస్తూ, జయజయధ్వానాలు

చేస్తూ కదిలారు.

శ్రీమద్రామాయణము
యుద్ధకాండము డెబ్బైఎనిమిదవ సర్గ సంపూర్ణము
ఓం తత్సత్ ఓం తత్సత్ ఓం తత్సత్

యుద్ధకాండము
డెబ్బైతొమ్మిదవ సర్గ.

కొత్తగా వచ్చిన మకరాక్షుడిని వింతగా చూస్తున్నారు వానరులు. వచ్చినవాడు వచ్చినట్టు యమలోకానికి ప్రయాణం కట్టడం యుద్ధము మొదలైనప్పటినుండి ఆనవాయితీ. అందుకని వీడు ఎంతసేపు నిలుస్తాడా అని లెక్కలు వేసుకుంటున్నారు వానరులు. యుద్ధము మొదలయింది. భీకరంగా పోరాడుతున్నారు రాక్షసులు, వానరులు. వానరుల చేతిలో వృక్షములు, శిలలు ఉంటే రాక్షసుల చేతిలో శూలములు, పరిఘలు ఉన్నాయి. వాటితో ఒకరిని ఒకరు పొడుచు కుంటున్నారు, నరుక్కుంటున్నారు.

రాత్రి అయినా కూడా వాళ్లు యుద్ధం ఆపలేదు. రాక్షసులు తమ చేతులలో వివిధ రకకములైన ఆయుధములను ధరించి వానరులను చంపుతున్నారు. వానరులు రాక్షసుల మీద వృక్షములను కొండ శిలలను విసిరి చంపుతున్నారు. ఫలితం నరమేధం. దానికి తోడు మకరాక్షుడు తన బాణములతో వానర సేనలను చికాకు పరుస్తున్నాడు. అతని శరవర్షమునకు భయపడి పారిపోతున్నారు వానరులు. పారిపోతున్న వానరులను చూచి రాక్షసులు హర్షధ్వానాలు

చేస్తున్నారు రాక్షసులు.

ఇది చూచాడు రాముడు. తాను రంగంలోకి దిగాడు. రాక్షస సైన్యం మీద బాణవర్షము కురిపించాడు. రాక్షస సేనలు ముందుకు చొచ్చుకు రాకుండా నిలువరించాడు. మకరాక్షుడు రాముని చూచి ఇలా అన్నాడు.

"ఓ రామా! నీవేనా నా తండ్రిని చంపిన నరుడివి. రా! నా ముందుకు రా! మనం ఇద్దరం యుద్ధం చేద్దాము. నా ధనుస్సునుండి వెలువడిన బాణము నీ ప్రాణాలు తీయగలదు. ఆ నాడు దండకా రణ్యములో తన మానాన తాను బతుకుతున్న నా తండ్రిని అకారణంగా చంపావు. నా తండ్రిని చంపిన దానికి ప్రతీకారము తీర్చుకొనే సమయం వచ్చింది. ఇన్నాళ్లు నీ కోసం నేను మృగము కొరకు సింహము వెదుకుతున్నట్టు వెదుకుతున్నాను. ఆ దేవుడు పంపినట్టు నువ్వే నా ఎదురుగా నిలబడ్డాడు. ఇంక నిన్ను ఎవరూ రక్షించలేరు. నీ చావు నాచేతిలో ఉంది. నిన్ను చంపి నా తండ్రి ఆత్మకు శాంతి చేకూరుస్తాను. నీవు చంపిన రాక్షసులు నీ కొరకు యమలోకంలో ఎదురుచూస్తున్నారు. నీ చేతిలో చచ్చిన నా వాళ్లను కలుసుకో.

రామా! మనం ఎలా యుద్ధం చేయాలో నువ్వే నిర్ణయించు. అస్త్రములా, శస్త్రములా, ద్వంద్వయుద్ధమా, లేక నీకు నచ్చిన, నీవు నేర్చిన యుద్ధవిద్య ప్రదర్శించు. దేనికైనా నేను సిద్ధముగా ఉన్నాను." అని ప్రగల్భాలు పలికాడు మకరాక్షుడు.

ఆ మాటలకు రాముడు నవ్వుకున్నాడు. మకరాక్షునితో ఇలా అన్నాడు. "కుమారా! శూరులు మాట్లాడరు. శౌర్యము ప్రదర్శిస్తారు.

నీవేమో యుద్ధం చేయడం మాని నీ వాక్చాతుర్యాన్ని వాగాడంబరాన్ని ప్రదర్శిస్తున్నావు. నీవు నన్ను ఏ విధంగా కూడా జయించలేవు. నేను దండకారణ్యములో నీ తండ్రినే కాదు, దూషణుని, త్రిశిరుడిని, పదునాలుగువేలమంది రాక్షస వీరులను చంపాను. ఇంక నీ వంతు వచ్చింది. రా. యుద్ధం చెయ్యి. వృథా మాటలు కట్టిపెట్టు." అని అన్నాడు రాముడు.

రాముని మాటలకు బదులుచెప్పకుండా మకరాక్షుడు రాముని మీద శరవర్షము కురిపించాడు. రాముడు ఆ బాణములను తన బాణములతో మార్గమధ్యములోనే విరిచాడు. రాముడు, మకరాక్షుడు ఒకరితో ఒకరు బాణములతో యుద్ధము చేస్తున్నారు. ఇద్దరి ధనుస్సుల నుండి వెలువడిన బాణములు ఒకదానితో ఒకటి కొట్టుకొని ఉరుములు ఉరిమినట్టు శబ్దం చేస్తున్నాయి. వారి యుద్ధమును చూడటానికి దేవతలు, గంధర్వులు, యక్షులు ఆకాశంలో బారులు తీరి నిలబడ్డారు.

రాముడు, మకరాక్షుడు ఒకరితో ఒకరు తీసిపోకుండా యుద్ధము చేస్తున్నారు. ఒకరు ప్రయోగించిన అస్త్రములను మరొకరు నిర్వీర్యం చేస్తున్నారు. వారు ఒకరి మీద ఒకరు వేసుకుంటున్న బాణములతో ఆకాశం అంతా కప్పబడి పోయింది. ఇలా కాదని రాముడు ఒకే ఒక బాణంతో మకరాక్షుని ధనుస్సును విరిచాడు. ఎనిమిది నారాచములతో సారథిని కొట్టాడు. తరువాత వరుస బాణాలతో రథమును విరిచాడు. రథమునకు కట్టిన గుర్రములను చంపాడు. మకరాక్షుడు రథము మీది నుండి దూకి కింద నిలబడ్డాడు. ఒక శూలమును తీసుకున్నాడు. మకరాక్షుడు ఆ శూలమును గిరా

గిరా తిప్పి రాముని మీదికి విసిరాడు. రాముడు నాలుగు బాణములతో ఆ శూలమును విరిచాడు. చేతిలో ఉన్న ఆయుధము కూడా విరిగి పోవడంతో మకరాక్షుడు తన పిడికిలి బిగించి రాముని మీదికి దూకాడు. తన మీదికి దూకుతున్న మకరాక్షుని మీదికి ఆగ్నేయాస్త్ర మును ప్రయోగించాడు రాముడు. ఆ అస్త్రము మకరాక్షుని దహించి వేసింది. మకరాక్షుడు కిందపడి మరణించాడు.

మకరాక్షుని మరణమును చూచిన రాక్షసులు రాముని బాణముల బారి నుండి తప్పించుకోడానికి లంకలోకి పారిపోయారు. మకరాక్షుని మరణానికి దేవతలు, గంధర్వులు, యక్షులు అమితానందము పొందారు.

శ్రీమద్రామాయణము
యుద్ధకాండము డెబ్బైతొమ్మిదవ సర్గ సంపూర్ణము
ఓం తత్సత్ ఓం తత్సత్ ఓం తత్సత్

యుద్ధకాండము
ఎనభయ్యవ సర్గ.

మకరాక్షుని మరణాన్ని కూడా యధావిధిగా రావణునికి తెలియజేసారు. రావణునికి దు:ఖం రాలేదు. కాని గుండెల్లో భయం పట్టుకుంది. యుద్ధానికి వెళ్లిన వారు తిరిగి రావడం లేదు. వెళ్లినవాడు వెళ్లినట్టే యుద్ధభూమికి బలి అవుతున్నాడు. అయినా పట్టినపట్టు విడవడం లేదు రావణుడు. తన కుమారుడు ఇంద్రజిత్తును పిలిపించాడు.

"కుమారా! రామలక్ష్మణులను ప్రత్యక్ష యుద్ధములో జయించడం సాధ్యంకాదు అనిపిస్తూ ఉంది. కాబట్టి మన రాక్షస మాయలు, మాయా యుద్ధమే శరణ్యము. మాయాయుద్ధములో నీవు సమర్థుడవు. కాబట్టి నీవు అంతర్హితుడవై రామలక్ష్మణులతో యుద్ధము చేసి వారిని సంహరించు. మాయా యుద్ధము వారికి చేత కాదు. నీవు మాయాయుద్ధములో ప్రవీణుడవు. మాయావి అయిన ఇంద్రుడినే జయించిన సమర్థుడివి. అటువంటిది ఇద్దరు మానవులు నీకు ఒక లెక్కా! కాబట్టి జయం మనకే దక్కుతుంది. విజయోస్తు." అని ఆశీర్వదించాడు రావణుడు.

రావణుని ఆజ్ఞమేరకు ఇంద్రజిత్తు రాముని మీదికి యుద్ధానికి బయలుదేరాడు. ముందు యజ్ఞవాటిక వద్దకు వెళ్లాడు. శత్రునాశనము కోరు అభిచార హెూమము చేయ సంకల్పించాడు. రాక్షసులు దానికి కావలసిన సంభారములు సిద్ధం చేసారు. ఇంద్రజిత్తు హెూమగుండంలో అగ్నిని వేల్చాడు. హెూమగుండం చుట్టు రెల్లుగడ్డిని పరిచాడు. విభీతక వృక్షమునుండి సేకరించిన ఎండు పుల్లలను సమిధలుగా ఉపయోగించాడు. తాను ఎర్రని వస్త్రములు కట్టుకున్నాడు. హెూమం చెయ్యడానికి ఇనుముతో చేసిన గరిటెను తీసుకున్నాడు. ఒక నల్ల మేకను తీసుకొని వచ్చారు ఇంద్రజిత్తు ఆ నల్లమేకను బలిఇచ్చాడు. నల్లమేక రక్తంతో హెూమం చేసాడు. హెూమాగ్ని సుడులు తిరుగుతూ పైకి లేచింది. ఏమాత్రం పొగ లేకుండా భగభగ మండుతూ ఉంది. అగ్ని కూడా ప్రదక్షిణపూర్వకంగా సుడులు తిరగడం చూచిన ఇంద్రజిత్తు అది శుభసూచకంగా భావించాడు. ఆ ప్రకారంగా హెూమం చేసి దేవతలకు, రాక్షసులకు, దానవులకు

హవిస్సులు సమర్పించాడు. తనకు మాత్రమే కనపడుతూ ఇతరులకు కనపడని రథాన్ని తెప్పించాడు. అందులో తనకు కావలసిన ఆయుధములను పెట్టించాడు. ఇంద్రజిత్తు ఆ రథం ఎక్కగానే తాను కూడా మాయం అయ్యాడు. అతని రథము కానీ, అతడు కానీ ఎవరికీ కనిపించడం లేదు.

ఇంద్రజిత్తు తన రాక్షస సేనలతో ఇలా అన్నాడు. "మనకు ఇంత క్షోభకలిగించిన ఆ రామలక్ష్మణులను ఈ రోజు చంపుతాను. వానరుడు అనే వాడు భూమి మీద లేకుండా చేస్తాను."అని పలికి రథముతో కూడా అంతర్ధానము అయ్యాడు ఇంద్రజిత్తు. ఇంద్రజిత్తు ఎవరికీ కనపడకుండా నారాచబాణములను వానరుల మీద ప్రయోగిస్తున్నాడు. రామలక్ష్మణులు కూడా ఆ బాణములు వస్తున్న దిక్కుకు బాణాలు వదులుతున్నారు. దానికి ప్రతిగా ఇంద్రజిత్తు తన బాణములతో రామలక్ష్మణులను కప్పివేసాడు. ఇంద్రజిత్తు ఎవరికీ కనపడకుండా ఆకాశంలో తిరుగుతూ రామలక్ష్మణుల మీద శరవర్షము కురిపిస్తున్నాడు. వాటిని రామలక్ష్మణులు తమ వద్ద ఉన్న దివ్యాస్త్రములను ప్రయోగించి తిప్పికొడుతున్నారు.

ఇంద్రజిత్తు వేసిన బాణములను ఎదుర్కొంటున్నారు కానీ, ఇంద్రజిత్తును గురి చూచి కొట్టలేకపోతున్నారు రామలక్ష్మణులు. ఎందుకంటే వారికి ఇంద్రజిత్తు కనపడటం లేదు. కనపడని లక్ష్యాన్ని బేధించడం కష్టం కదా! కాని రామలక్ష్మణులు వేసిన బాణములు ఇంద్రజిత్తుకు తగిలాయి అనడానికి గుర్తుగా అవి రక్తంతో తడిసి కిందపడుతున్నాయి. రామ లక్ష్మణులకు, తమ మీద ఇంద్రజిత్తు ప్రయోగిస్తున్న బాణములు కనపడుతున్నాయి కాబట్టి వాటిని మధ్యలోనే

భల్లబాణములతో ఛేదిస్తున్నారు. రామలక్ష్మణులు ఇంద్రజిత్తు ప్రయోగిస్తున్న బాణములు వస్తున్న దిక్కుకు అస్త్రప్రయోగం చేస్తున్నారు. కాని ఇంద్రజిత్తు ఆకాశంలో తన రథం మీద ఉన్నచోట ఉండకుండా వేగంగా తిరుగుతున్నాడు. అందుకని రామలక్ష్మణుల బాణాలు వృధా అవుతున్నాయి. కాని ఇంద్రజిత్తు రామలక్ష్మణుల మీద గురిచూసి వేస్తున్న బాణములు వారి శరీరములకు తగిలి గాయాలు కలుగజేస్తున్నాయి. రామలక్ష్మణులు కానీ, వానర వీరులు గానీ, ఇంద్రజిత్తు గమన వేగాన్ని కానీ, అతడు ఉన్న దిక్కును కానీ, అతని రూపమును కానీ తెలుసుకోలేకపోతున్నారు. కాని ఇంద్రజిత్తు ప్రయోగిస్తున్న బాణముల ధాటికి వందలకొద్దీ వానరులు మరణిస్తున్నారు.

ఇది చూచి లక్ష్మణునికి కోపం వచ్చింది. రాముని చూచి "అన్నయ్యా! ఇంక లాభం లేదు. భూమి మీద ఉన్న రాక్షస జాతిని మొత్తం నాశనం చెయ్యడానికి బ్రహ్మాస్త్ర ప్రయోగమే ఉత్తమమైన మార్గము. దానిని ప్రయోగిస్తాను." అని అన్నాడు.

ఆ మాటలకు రాముడు నవ్వి ఇలా అన్నాడు. "లక్ష్మణా! కేవలం దుర్మార్గులైన రావణుడు, ఇంద్రజిత్తులను చంపడం కోసరం, లోకంలో ఉన్న అమాయకులైన రాక్షస జాతిని నాశనం చెయ్యడం ధర్మం కాదు కదా! యుద్ధసమయంలో నీతో యుద్ధము చేయని వానిని కానీ, దాగి ఉన్న వానిని కానీ, నమస్కారం చేయుచున్నవాడిని కానీ, నిన్ను శరణు వేడిన వాడిని కానీ, పలాయనం చేస్తున్న వాడిని కానీ, చంపడం ధర్మం కాదు. ఇప్పుడు ఇంద్రజిత్తు మనకు కనపడకుండా యుద్ధం

చేస్తున్నాడు. కాని మనతో యుద్ధం చేస్తున్నాడు. ముందు మనము ఇంద్రజిత్తును చంపడానికి ప్రయత్నించాలి. వాడు కనపడకుండా యుద్ధం చేస్తున్నాడు కాబట్టి మన వానర వీరులు ఏమీ చేయలేక పోతున్నారు. అదే ఇంద్రజిత్తు ఎదుట నిలబడి యుద్ధం చేస్తే మన వానర వీరులు ఎప్పుడో అతనిని అంతమొందించి ఉండేవాళ్లు. మనదాకా రానివ్వరు.

వీడు కనపడకుండా యుద్ధం చేస్తూ మనలను బాధపెడుతున్నాడు కాబట్టి వీడిని మనం చంపక తప్పదు. వీడు ముల్లోకములలో ఎక్కడ దాక్కున్నా నా అస్త్రముల ధాటికి బలికాక తప్పదు." అని అన్నాడు రాముడు.

తరువాత వానర నాయకులతో కలిసి ఇంద్రజిత్తును ఎలా చంపాలా అని ఆలోచిస్తున్నాడు రాముడు.

శ్రీమద్రామాయణము
యుద్ధకాండము ఎనభయ్యవ సర్గ సంపూర్ణము
ఓం తత్సత్ ఓం తత్సత్ ఓం తత్సత్

యుద్ధకాండము

ఎనభైఒకటవ సర్గ.

ఆకాశంలో నిలబడి ఎవరికీ కనపడకుండా యుద్ధము చేస్తున్న ఇంద్రజిత్తుకు ఈ యుద్ధం ఒక పట్టాన ముగిసేటట్టు కనపడలేదు. పైగా రామలక్ష్మణులు తనను ఓడించడానికి ఉపాయాలు ఆలోచిస్తున్నట్టు గ్రహించాడు. తను కూడా ఒక మాయోపాయం పన్నాలని అనుకున్నాడు. కాసేపు యుద్ధం ఆపి లంకా నగరంలోకి ప్రవేశించాడు. ఒక మాయాసీతను సృష్టించాడు. ఆ మాయాసీతను తన రథం మీద ఎక్కించుకొని చుట్టు రాక్షసులు వెంట రాగా పడమటి ద్వారము గుండా లంకా నగరము నుండి బయటకు వచ్చాడు. తన రథాన్ని వానరులు ఉన్న వైపుకు పోనిచ్చాడు.

ఇంద్రజిత్తు తమ వైపు రావడం చూచి వానరులు రాళ్లు, వృక్షములు చేత ధరించి యుద్ధమునకు సిద్ధంగా ఉన్నారు. హనుమంతుడు కూడా ఒక పెద్ద పర్వత శిఖరమును చేత ధరించి ఇంద్రజిత్తు ఎదురుగా వెళ్లాడు. అంతలోనే హనుమంతునికి ఇంద్రజిత్తు రథంలో ఉన్న సీత కనపడింది. తాను అశోకవనములో శింశుపా వృక్షము కింద ఉండగా చూచిన సీత ఎలా ఉందో అలాగే ఉంది. ఒంటి జడ, నలిగిపోయిన చీర, దీనమైన ముఖము, తైల సంస్కారము లేని జుట్టు, ఒంటి మీద పేరుకుపోయిన దుమ్ము, సరిగ్గా అలాగే ఉంది.

యుద్ధభూమిలో ఇంద్రజిత్తు రథంమీద సీతను చూడగానే ఆశ్చర్యపోయాడు హనుమంతుడు. ఈ సీత ఇంద్రజిత్తు పక్కన కూర్చుని ఉంది. "ఇప్పుడు ఈ దుర్మార్గుడు ఈ సీతను ఏమి చేస్తాడో" అని

కలవరపడ్డాడు హనుమంతుడు. ఈ విషయాన్ని వానర వీరులందరికీ చెప్పాడు. అందరూ కలిసి ఇంద్రజిత్తు రథం వైపు వెళ్లారు. వానరులు అంతా తన రథం వైపు రావడం, సీత వంక ఆసక్తిగా చూడటం గమనించాడు ఇంద్రజిత్తు. వెంటనే మాయా సీత జుట్టుపట్టుకుని కిందికి లాగాడు. అప్పుడు మాయా సీత "రామా రామా రక్షించు రామా" అని ఏడుస్తూ ఉంది. సీత దుస్థితి చూచి హనుమంతుడు కన్నీరు కారుస్తున్నాడు. ఇంక తట్టుకోలేకపోయాడు. ఇంద్రజిత్తుతో ఇలా అన్నాడు.

"ఓరి దుర్మార్గుడా! పేరుకు బ్రాహ్మణ కులంలో జన్మించావు. కాని రాక్షసత్వము అవలంబించావు. నీ నాశనాన్ని చేజేతులా ఆహ్వానిస్తూ సీత జుట్టుపట్టుకొని లాగుతున్నావు. నీ మరణం తప్పదు. నీవు క్రూరుడవు. అనార్యుడవు. దుర్మార్గుడవు. నీచుడివి. నీకు జాలి దయ ఏకోశానా లేవు. నీవు పాపాత్ముడవు. లేకపోతే ఇంతటి పాపకార్యమునకు ఒడిగట్టవు.

ఈమె నీకు ఏమి అపకారము చేసింది రా ఈమెను అలా కొడుతున్నావు, జుట్టుపట్టుకొని ఈడుస్తున్నావు. రాజ్యము పోగొట్టుకుంది. భర్తకు దూరం అయింది. ఇంకా నీకు జాలిలేదా! ఆ ప్రకారము ఆమెను హింసిస్తున్నావు. నీవు సీతను చంపడానికి కత్తి ఎత్తుతున్నావు. జాగ్రత్త. సీతను చంపిన తరువాత నీవు క్షణకాలం కూడా జీవించలేవు. అందుకే నా ముందు ఇంతటి పాపమునకు ఒడిగట్టుతున్నావు." అని తిడుతూ హనుమంతుడు ఇంద్రజిత్తు మీదికి వెళ్లాడు.

కాని చుట్టు ఉన్న రాక్షస సేనలు హనుమంతుని వానరులను ముందుకు రాకుండా నిలువరించాయి. అది చూచిన ఇంద్రజిత్తు వానర సేనల మీద బాణవర్షము కురిపించి వారు ముందుకు రాకుండా చేసాడు.

అప్పుడు ఇంద్రజిత్తు హనుమంతుని చూచి ఇలా అన్నాడు. "ఏ సీత కోసరం నువ్వు నూరుయోజనముల దూరం ఉన్న సముద్రమును దాటి లంకకు వచ్చావో, ఏ సీత కోసం సుగ్రీవుడు, రాముడు, నువ్వు ఇక్కడకు వచ్చారో, ఆ సీతను ఇప్పుడే నీ కళ్లముందే చంపుతున్నాను. చూడు. సీతను చంపిన తరువాత నిన్ను, సుగ్రీవుని, విభీషణుని, రాముని కూడా ఇలాగే చంపుతాను. స్త్రీలను చంపకూడదు అని నీవు అన్నావు కదా. కానీ ఈ స్త్రీ లంకను సర్వనాశనం చేసింది. కాబట్టి సీతను చంపడంలో దోషం లేదు." అంటూ ఇంద్రజిత్తు తన చేతిలో ఉన్న కత్తితో, మాయాసీత జుట్టు పట్టుకొని ఆమె మెడను నరికాడు. మాయాసీత నేలమీద పడి మరణించింది.

ఇంద్రజిత్తు మరలా హనుమను చూచి ఇలా అన్నాడు. "రాముని భార్య సీతను నేను నా కత్తితో నరికాను. చంపాను. సీత మరణించింది. మీరు ఇక్కడకు వచ్చిన శ్రమ అంతా వృథా అయింది. ఈ విషయం పోయి నీ రామునితో చెప్పు. ఇంక యుద్ధం అనవసరం అని చెప్పు." అని ఇంద్రజిత్తు పెద్ద పెద్ద గా అరుస్తున్నాడు.

సీత మరణించింది అన్న వార్త వానర సేనలలో దావానలంలా వ్యాపించింది. వానరులలో నిరాశ నిస్పృహ పుట్టాయి ఎవరి దారిన వారు పారిపోయారు. తన పాచిక పారినందుకు ఇంద్రజిత్తు పరమానందభరితుడయ్యాడు.

శ్రీమద్రామాయణము

యుద్ధకాండము ఎనభైఒకటవ సర్గ సంపూర్ణము

ఓం తత్సత్ ఓం తత్సత్ ఓం తత్సత్

యుద్ధకాండము

ఎనభైరెండవ సర్గ.

వానరులంతా తలొక దిక్కుకు పారి పోవడం చూచి హనుమంతుడు ఇలా అన్నాడు. "ఓ వానరులారా! ఎందుకు పారిపోతున్నారు. ఇప్పుడు ఏమయింది. యుద్ధము చేద్దాము రండి. మీ పరాక్రమము అంతాఏమయింది. యుద్ధములో నేను ముందుంటాను. మీరంతా ఉత్తమకులంలో పుట్టారు ఇలా పారిపోవడం ధర్మంకాదు." అంటూ వానరులను యుద్ధానికి ఉత్తేజపరిచాడు. తాను కూడా రాక్షస సేనలతో పోరాడుతున్నాడు. ప్రళయ కాలములో యముని మాదిరి విజృంభించి రాక్షస సంహారం చేస్తున్నాడు. చేతికి అందిన పెద్ద కొండ శిలను తీసుకొని ఇంద్రజిత్తు రథం మీద వేసాడు. ఇంద్రజిత్తు రథసారథి రథమును పక్కకు తప్పించాడు. హనుమంతుడు విసిరిన ఆ బండరాయి రథం పక్కన పడి నేలలో పెద్ద సొరంగం చేసింది. ఆ బండరాయి కిందపడి వందలకొద్దీరాక్షసులు మరణించారు.

ఇది చూచిన ఇంద్రజిత్తు తన ధనుస్సును తీసుకొని వానరసేనలోకి చొచ్చుకుపోయాడు. వానర సేన మీద శరవర్షము కురిపించి వానరులను చంపుతున్నాడు. ఇది చూచిన రాక్షసులు రెట్టించిన ఉత్సాహంతో తమ చేతులలో ఉన్న శూలములు, ఖడ్గములు, ముద్గరలతో వానరులను చంపుతున్నారు. హనుమంతుడు పెద్ద పెద్ద వృక్షములను కొమ్మలను తెచ్చి వాటితో రాక్షసులను మోది చంపు తున్నాడు. హనుమంతుని ధాటికి తట్టుకోలేక రాక్షస సైన్యము వెనుకకు తగ్గింది.

అప్పుడు హనుమంతుడు వానరులతో ఇలా అన్నాడు. "ఇంక యుద్దం ఆపండి. ఈ రాక్షసులను చంపి ప్రయోజనము లేదు. ఇంత కాలమూ మనము ప్రాణాలకు తెగించి ఎవరికోసరం యుద్ధం చేసామో ఆ సీతను ఇంద్రజిత్తు చంపాడు. ఈ విషయం మనము రామునికి సుగ్రీవునికి చెప్పి వారు ఏమి చెయ్యమంటారో అది చేద్దాము." అని అన్నాడు. హనుమంతుని మాటలు విన్న వానరులు యుద్దం విరమించారు. అందరూ రాముని వద్దకు వెళ్లారు. హనుమంతుడు యుద్ధం విరమించి వెళ్లడం చూచిన ఇంద్రజిత్తు తాను కూడా వెనుదిరిగాడు. నికుంభిల అనే దేవత ఉన్న దేవాలయమునకు వెళ్లాడు. నికుంభిల అనే దేవత ప్రీతిగా యజ్ఞం చేయడం మొదలెట్టాడు. హోమగుండంలో రక్తము, మాంసము వేసాడు. రక్తమాంసములతో తృప్తిచెందిన అగ్నిజ్వాలలు నలుదిక్కుకు ప్రజ్వరిల్లాయి. తరువాత ఇంద్రజిత్తు రాక్షసుల విజయము కొరకు హోమం చేసాడు.

శ్రీమద్రామాయణము యుద్ధకాండము ఎనభైరెండవ సర్గ సంపూర్ణము

ఓం తత్సత్ ఓం తత్సత్ ఓం తత్సత్

యుద్ధకాండము

ఎనభైమూడవ సర్గ.

హనుమంతుడు ఉన్న యుద్ధభూమిలో జరుగుతున్న కోలాహలము చూచిన రాముడు జాంబవంతుని తో ఇలా అన్నాడు. “జాంబవంతా! హనుమంతుడు ఉన్న చోట ఏదో జరిగినట్టుంది. వానరులంతా పెద్దగా అరుస్తున్నారు. హనుమంతుడు ఏదో ఆపదలో ఉన్నట్టున్నాడు. నీవు నీ సేనలతో హనుమంతునికి సాయంగా వెళ్లు.” అని అన్నాడు. వెంటనే జాంబవంతుడు తన సేనలతో హనుమంతుడు ఉన్న పశ్చిమ ద్వారం వైపుకు వెళ్లాడు. సగం దూరం వెళ్లేసరికి హనుమంతుడు తన సేనలతో ఎదురుగా రావడం చూచాడు. అందరూ కలిసి రాముని వద్దకు వచ్చారు.

రాముని చూచిన హనుమంతునికి దు:ఖం ఆగడం లేదు. సీత మరణించింది అని రామునితో ఎలా చెప్పడమా అని మధనపడుతున్నాడు. తుదకు దు:ఖము ఆపుకొని రామునితో ఇలా అన్నాడు. “రామా! ఘోరం జరిగిపోయింది. ఆ దుర్మార్గుడు ఇంద్రజిత్తు సీతను తన రథం మీద తీసుకొని వచ్చి మా కళ్ల ఎదుట కత్తితో ఆమెను నరికి చంపాడు సీతను అలా చంపడం చూచి నేను దు:ఖించాను. వెంటనే యుద్ధము విరమించి ఈవిషయం చెప్పడానికి తమరి వద్దకు వచ్చాను.” అని అన్నాడు.

సీత మరణవార్త విన్న రాముడు కుప్పకూలిపోయాడు. అందరూ రాముని చుట్టు గుమి గూడారు. నీళ్లు తీసుకొని వచ్చి రాముని ముఖం మీద చల్లారు. లక్ష్మణుడు రాముని పక్కనే కూర్చుని

రాముని తలను ఒడిలోపెట్టుకొని ఇల అన్నాడు.

"రామా! నీవు ధర్మాత్ముడవు. ధర్మం తప్పకుండా నడుచు కున్నావు. కానీ ఆ ధర్మం నిన్ను కాపాడలేకపోయింది. ధర్మం అనేది అగోచరము. ఎవరికీ కనపడదు. అందుకని ధర్మం ధర్మం అని పట్టుకొని పాకులాడటం వృథా. అసలు ధర్మం అనేది లేదు. ఒకవేళ ఉన్నా మనం ఆచరించవలసిన పని లేదు. లేకపోతే ధర్మాత్ముడివి అయిన నీకు ఇన్ని ఆపదలు చుట్టుముడతాయా!అధర్మం తప్ప ధర్మం అంటే ఏమిటో ఎరుగని రావణునికి ఆపద అంటే ఏమిటో తెలియదా! . ధర్మాన్ని నమ్ముకున్న నీకు ఈ విధంగా కష్టాలు ఎందుకు కలుగుతాయి. రావణుడు అధర్మపరుడైనా సుఖంగా ఉన్నాడు. ఎందుకంటే, అధర్మము సుఖాన్ని ఇస్తుంది. నువ్వు ధర్మాత్ముడివి కాబట్టి కష్టాలపాలయ్యావు. అందుకని ధర్మము కష్టములను కలిగిస్తుంది. ఇదే పరమసత్యము.

ధర్మాన్ని ఆచరిస్తే మంచిఫలితాలు కలుగుతాయి, అధర్మం ఆచరిస్తే చెడ్డ ఫలితాలు కలుగుతాయి అనేది నిజం అయితే జనులు ఎందుకు అధర్మం పట్ల ఆసక్తి చూపుతున్నారు. ఎందుకంటే, అధర్మపరులకు మంచిఫలితాలు వస్తున్నాయి కాబట్టి. ధర్మంగా నడుచుకుంటే మంచి ఫలితాలు వస్తే, జనం ఎందుకు అధర్మం పట్ల ఆసక్తి చూపుతారు. అధర్మపరులకు సిరిసంపదలు భోగభాగ్యాలు అభివృద్ధిచెందుతున్నాయి. ధర్మప్రవృత్తి కలవారికి ఆపదలు అభివృద్ధిచెందుతున్నాయి. కాబట్టి ధర్మం, అధర్మం అని అనుకోవడం వల్ల ఎటువంటి ప్రయోజనము లేదు.

ఓ రామా! ధర్మం చచ్చిపోయింది. అధర్మం ప్రజ్వరిల్లుతూ ఉంది. ధర్మాత్ములు అధర్మపరుల చేత వధింపబడుతున్నారు. అధర్మం ధర్మాన్ని నాశనం చేస్తూ ఉంది. ధర్మం నిస్సహాయంగా చూస్తూ ఉంది. ఇంకా మనం ధర్మం ధర్మం అని పాకులాడటం వృధా.

రామా! స్వర్గప్రాప్తికి, మోక్షప్రాప్తికి వేదములలో ఎన్నో యజ్ఞములు, యాగములు, వ్రతములు, పుణ్యకార్యములు చెప్పబడ్డాయి. అలాగే శత్రునాశనమునకు కూడా ఎన్నో హెూమములు వేదములలో చెప్పబడ్డాయి. ఆ హెూమములు చెయ్యడం అధర్మమయినా, అవి వేదములో చెప్పబడ్డాయి కాబట్టి వేదవిహితములే కదా! అవి అధర్మము ఎలా అవుతాయి. కాబట్టి ధర్మం లేదు. అధర్మంలేదు. అంతా ఒకటే.

రావణుడు అతని కుమారుడు ఇంద్రజిత్తు పాపాలు చేస్తున్నారు. చెడ్డ పనులు చేస్తున్నారు. ధర్మమార్గంలో వాటిని మనం ఎదుర్కోలేకపోతున్నాము. ధర్మం అధర్మాన్ని రూపుమాపలేకపోతోంది. ధర్మం అనేది ఉంటే ధర్మపరుడవైన నీకు ఏ అపకారమూ జరగకూడదు. కానీ అన్ని ఆపదలూ నీకే వస్తున్నాయి. కాబట్టి ధర్మం అనేది లేనే లేదు. ఒక వేళ ధర్మం అనేది ఉంటే అది దుర్మార్గులచేతిలో బందీ అయి పోయింది. అటువంటి ధర్మము నిన్ను ఎలా రక్షించగలదు. కాబట్టి ఆ అశక్తురాలైన ధర్మాన్ని నమ్ముకోవడం కన్నా దానిని వదిలిపెట్టడమే శ్రేయస్కరము.

ఓ రామా! ధర్మం ఆచరించి నందువలన ఎటువంటి ప్రయోజనము లేనప్పుడు మనం ధర్మాన్ని వదిలి మన బలాన్ని

నమ్ముకుంటే మంచిది.

ధర్మాత్ములను రక్షించాలి. అధర్మపరులను శిక్షించాలి అనేది నిజమైతే, అబద్ధం చెప్పడం అధర్మం అయితే, ముందు నీకు రాజ్యం ఇస్తానని చెప్పి, తరువాత భార్య మాటలు విని నీకు రాజ్యం ఇవ్వను అని అబద్దం చెప్పి మాటతప్పిన నీ తండ్రిని నీవు ఎందుకు శిక్షించలేదు?

ఓ రామా! ఇంద్రుడు విశ్వరూపుడు అనే మునిని చంపాడు. తరువాత యజ్ఞం చేసాడు. ధర్మాచరణమే ఇంద్రుని కర్తవ్యము అయితే అతడు ధర్మమయిన యజ్ఞం మాత్రమే చేసేవాడు. మరి విశ్వరూపుని చంపి అధర్మానికి ఎందుకు పాల్పడ్డాడు. ఇంద్రుడికి అధర్మం చేయడమే కర్తవ్యము అయితే ఇంద్రుడు విశ్వరూపుని మాత్రమే చంపి ధర్మకార్యమైన యజ్ఞమును చేసి ఉండే వాడు కాదు. కాని ఇంద్రుడు ధర్మకార్యము, అధర్మకార్యము రెండూ చేసాడు. కాబట్టి, క్షత్రియుడు ధర్మాధర్మములు రెండూ ఆచరించాలి. కేవలం ధర్మం అని కూర్చుంటే ఇదిగో ఇలాగే కష్టాలపాలవుతాము.

నీ తండ్రి నీకు రాజ్యము ఇవ్వకుండా అధర్మానికి పాల్పడ్డప్పుడు, ధర్మం ధర్మం అంటూ అడవులకు రాకుండా, అధర్మము అయినా సరే నీ తండ్రి మాటను ధిక్కరించి, నీ రాజ్యాన్ని దక్కించుకొని, అడవులకు రాకుండా ఉంటే మనకు ఇన్ని కష్టాలు రావు కదా! ధర్మం ధర్మం అంటూ నీవు రాజ్యాన్ని పోగొట్టుకున్నావు. దాని ద్వారా సంక్రమించే ధనాన్ని పోగొట్టుకున్నావు. చేతిలో ధనం ఉంటే కదా ధర్మకార్యాలు. దాన ధర్మాలు చేయడానికి వీలుకలిగేది. దానధర్మాలు చేయడం ధర్మకార్యం అయినపుడు, నీవు ఆచరించిన ధర్మం వలన

దానధర్మాలు అనే ధర్మకార్యాలు చేయడానికి వీలులేకుండా పోయింది.

రాజ్యము, ధనము ఉంటే మిత్రులు, బంధువులు పక్కన చేరతారు. ఈ లోకంలో ధనంతో అన్నీ సమకూరుతాయి. ధనం ఉన్న వాడికి ధైర్యము, పరాక్రమము, పాండిత్యము అన్నీ అబ్బుతాయి. చేతిలో ధనం ఉంటే ధర్మము, అర్థము, కామము వాటంతట అవే సిద్ధిస్తాయి. ధనం ఉన్న వాడికి కామము, దర్పము, క్రోధము, ఏది ఉన్నా అది శోభిస్తుంది. అటువంటి ధనమును నీవు, ధర్మం ధర్మం అంటూ రాజ్యాన్ని వదిలిపెట్టి, చేజేతులా పోగొట్టుకున్నావు. నీవు ఆనాడు రాజ్యమును వద్దు అన్నప్పుడు కేవలం ధర్మాన్ని ఆలోచించావు కానీ ఈ పరిణామాలను గూర్చి ఆలోచించలేదు. నీవు ధర్మానికి, నీ తండ్రి మాటకు కట్టుబడి, రాజ్యాన్ని, ధనాన్ని వదులుకొని అడవులకు రావడం వల్ల కదా నీ భార్యను ఆ రాక్షసుడు ఎత్తుకుపోయాడు. చివరకు చంపేసాడు.

కాబట్టి రామా! ఇంక ధర్మాధర్మాల ప్రసక్తి లేదు. ఆ పాపాత్ముడైన ఇంద్రజిత్తును అధర్మమార్గంలోనే వధిస్తాను. రామా! లే! సీతను వధించారు అన్న మాట విన్న తరువాత నా మనసు ఆగడం లేదు. ఇప్పుడే పోయి లంకను సర్వనాశనం చేస్తాను." అని శోకం, పౌరుషం, శౌర్యము, పరాక్రమం ఒక్క సారిగా ముంచుకొస్తే, ఆ భ్రమలో పడి ధర్మాధర్మవిచక్షణ కోల్పోయి మాట్లాడుతున్నాడు లక్ష్మణుడు.

శ్రీమద్రామాయణము

యుద్ధకాండము ఎనభైమూడవ సర్గ సంపూర్ణము

ఓం తత్సత్ ఓం తత్సత్ ఓం తత్సత్

యుద్ధకాండము

ఎనభైనాలుగవ సర్గ.

రాముడి పక్కన కూర్చున్న లక్ష్మణుడు ఇలా విలపిస్తుంటే, అంతకు ముందు రాముడు ఇచ్చిన ఆదేశముల మేరకు విభీషణుడు సైనికులకు, సేనాపతులకు తగిన సూచనలు ఇచ్చి ఆ విషయం రామునికి చెప్పడానికి, రాముని వద్దకు వచ్చాడు. అక్కడ అంతా విషాద వాతావరణము నెలకొని ఉండటం చూచాడు. లక్ష్మణుడితో సహా అక్కడ అంతా ఏడుస్తున్నారు. ఎందుకో అర్థం కాలేదు విభీషణుడికి. లక్ష్మణుడి ఒడిలో స్పృహలేకుండా పడి ఉన్న రాముడిని చూచాడు.

"ఏమిటిది! రాముడికి ఏమయింది? అందరూ ఎందుకు శోకిస్తున్నారు?" అని ఆతురతగా అడిగాడు.

అప్పుడు లక్ష్మణుడు ఇలా అన్నాడు. "సీతను రణభూమికి తీసుకొని వచ్చి హనుమంతుడు ఇతర వానర నాయకుల ఎదురు గుండా ఇంద్రజిత్తు సీతను చంపాడు. ఆ విషయాన్ని హనుమంతుడు రామునికి చెప్పాడు. రాముడు మూర్ఛపోయాడు. వానర నాయకు లంతా శోకిస్తున్నారు. ...." అని ఇంకా ఏదో చెప్పబోతుంటే విభీషణుడు ఇలా అన్నాడు.

"ఓ రామా! సముద్రము ఎండి పోయింది అని చెబితే ఎలా ఉంటుందో సీతను ఇంద్రజిత్తు చంపాడు అని చెబితే అలాగే ఉంటుంది. సీతమీద ఈగ వాలినా రావణుడు సహించడు. ఆ విషయం నాకు

బాగా తెలుసు. అటువంటిది ఇంద్రజిత్తు సీతను చంపడానికి ఎలా ఒప్పుకుంటాడు? సీతను ఇంత దూరం తీసుకొని వచ్చింది, సీత కోసరం ఇంత యుద్ధం చేస్తున్నది సీతను చంపుకోడానికి కాదు కదా! నేను రావణునితో సీతను విడిచిపెట్టమని ఎన్నోమార్లు చెప్పినా, బతిమాలినా, రావణుడు ససేమిరా అన్నాడు. అసలు సీతను రావణుడు ఎక్కడ ఉంచిందీ ఎవరికీ తెలియదు. ఇంద్రజిత్తుకు కూడా తెలియదు. ఇదంతా ఇంద్రజిత్తు పన్నిన రాక్షస మాయ. అది మీరు తెలుసుకోలేక పోయారు. ఆమె మాయా సీత. సీతను పోలిన రాక్షస స్త్రీ. ఇంద్రజిత్తు మిమ్ములను సమ్మోహితులను చేసాడు. ఇంక సీత విషయం గురించి శోకించడం ఆపి అసలు విషయం వినండి.

ఇప్పుడు ఇంద్రజిత్తు నికుంభిల దేవి ఆలయమునకు వెళ్లాడు. అక్కడ హెూమం చేస్తున్నాడు. ఆ హెూమం పూర్తి అయితే ఇంద్రజిత్తును ఓడించడానికి ఇంద్రుడి తరం కూడా కాదు. తాను చేయబోయే హెూమమునకు వానరులు విఘ్నం కలుగచేయకుండా, వారిని శోక సముద్రంలో ముంచి వారి దృష్టిని మరల్చడానికి సీతను చంపడం అనే మాయను పన్నాడు. మీరు ఆ మాయలో పడ్డారు. ఇంద్రజిత్తు చేస్తున్న హెూమం పూర్తి అయేలోగా మనము మన సైన్యములతో అక్కడికి చేరుకోవాలి.

రామా! నీవు అకారణంగా ఇలా శోకిస్తుంటే వానర సేనా నాయకులు అంతా శోకిస్తున్నారు. నీ సీత క్షేమంగా ఉంది. ఆమెకు ఏమీ కాలేదు. నీవు ఇక్కడే ఉండు. లక్ష్మణుని మా వెంట పంపు. మేము నికుంభిలా దేవాలయమునకు వెళతాము. లక్ష్మణుడు తన బాణములతో ఆ యజ్ఞమును విఘ్నము చేయగలడు. అప్పుడు

మనము ఇంద్రజిత్తును సులభంగా చంపవచ్చును. మాకు ఆజ్ఞ ఇమ్ము. నీ ఆదేశము కొరకు ఎదురుచూస్తున్నాము. ఇంద్రజిత్తు వధకు అనుజ్ఞ ఇమ్ము." అని పలికాడు విభీషణుడు.

నిజం తెలుసుకున్న రాముడు తన శోకాన్ని విడిచిపెట్టాడు.

శ్రీమద్రామాయణము
యుద్ధకాండము ఎనభైనాలుగవ సర్గ సంపూర్ణము
ఓం తత్సత్ ఓం తత్సత్ ఓం తత్సత్

యుద్ధకాండము
ఎనభైఐదవ సర్గ.

"సీత క్షేమంగా ఉంది. ఆమెకు ఏమీ కాలేదు." అన్నమాట మాత్రం వినబడింది రాముడికి. ఆ ఆనందంలో విభీషణుడు ఏమి చెబుతున్నాడో దేని గురించి చెబుతున్నాడో అర్థం కాలేదు కాసేపటికి రాముడు లేచి కూర్చున్నాడు. విభీషణునితో ఇలా అన్నాడు.

"విభీషణా! నీవు ఏమి చెప్పావో నేను సరిగా వినలేదు. ఏదీ మరలా ఒకసారి చెప్పు." అని అడిగాడు.

విభీషణుడు మరలా చెప్పనారంభించాడు. "ఓ రామా! నీవు నన్ను సేనలను నిర్ణీత ప్రదేశములలో నిలుపమని చెప్పావు కదా. నేను ఆ పనిలో ఉన్నాను. సైన్యములను విభాగములుగా చేసి వాటిని నిర్ణీత

స్థలములలో నిలిపి సేనానాయకులకు తగిన సూచనలు ఇచ్చాను. ఆ విషయము నీతో చెప్పడానికి వస్తే ఇక్కడ నువ్వు ఈ స్థితిలో ఉన్నావు. నీవు అకారణంగా శోకిస్తున్నావు. నీవు ఇలా శోకిస్తున్నావు అని తెలిస్తే ఇంద్రజిత్తు ఇంకా రెచ్చిపోతాడు. కాబట్టి నీ శోకము మాను. కర్తవ్యమును ఆలోచించు. మనము రాక్షసులను సంహరించి సీతను దక్కించుకోవాలంటే ముందు దు:ఖించడం మానుకోవాలి. మనసంతా సంతోషం నింపుకోవాలి. అప్పుడే సరి అయిన నిర్ణయం తీసుకోగలము. ప్రస్తుతము ఇంద్రజిత్తు నికుంభిల అనే దేవి ఆలయములో ఉన్నాడు. ఇంద్రజిత్తును చంపడానికి ఇదే తగిన సమయము. ఆ పనిమీద లక్ష్మణుని నా వెంట పంపు. ఇంద్రజిత్తు తాను తలపెట్టిన హెూమమును నికుంభిల ఆలయములో పూర్తిచేస్తే అతనిని చంపడం ఎవరికీ సాధ్యం కాదు. అతడు మనలను అందరినీ చంపుతాడు. మన మరణము తథ్యము.

దీనికి ఒక కారణం ఉంది. ఇంద్రజిత్తు బ్రహ్మను గూర్చి తపస్సు చేస్తే బ్రహ్మదేవుడు ప్రత్యక్షం అయ్యాడు. "ఓ ఇంద్రజిత్! నీవు నికుంభిల ఆలయంలో హెూమం చెయ్యి. అప్పుడు నీవు అజేయుడవు అవుతావు. కానీ, నికుంభిల ఆలయం చేరక ముందుకానీ, చేరిన తరువాత, ఆ హెూమం చేయకముందుకానీ, ఎవడైతే నిన్ను ఎదిరిస్తాడో అతడే నిన్ను చంపుతాడు. అతడే నీ మృత్యువు. కాబట్టి ఆ హెూమాన్ని రహస్యంగా చెయ్యి" అని బ్రహ్మదేవుడు చెప్పాడు. ఇప్పుడు ఇంద్రజిత్తు నికుంభిల ఆలయంలో ఆ హెూమం చేయబోతున్నాడు. ఆ విషయం నేను నా మంత్రుల ద్వారా తెలుసుకున్నాను. కాబట్టి మనం తొందరగా నికుంభిల ఆలయానికి సైన్యాలతో చేరుకోవాలి. దానికి లక్ష్మణుడు నాయకత్వం వహించాలి. లక్ష్మణుని చేతిలో ఇంద్రజిత్తు చంపబడితే,

రావణుడు కూడా చంపబడినట్లే." అని అన్నాడు విభీషణుడు.

అప్పుడు రాముడు ఇలా అన్నాడు. "ఓ విభీషణా! రాక్షస మాయలు నాకు కొత్త కాదు. కానీ సీతను తన కళ్లముందే వధించడం గురించి హనుమంతుడు చెప్పగా విని మూర్ఛపోయాను. ఇంద్రజిత్తు సామాన్యుడు కాడు. ఎన్నోమాయలు తెలిసిన వాడు, మహా పరాక్రమవంతుడు. బ్రహ్మాస్త్రప్రయోగము తెలిసినవాడు. యుద్ధములో వరుణుని కూడా ఓడించగల సమర్థుడు. ఎవరికీ కనపడకుండా మాయాయుద్ధము చేయడంలో ఇంద్రజిత్తు దిట్ట. కాబట్టి మీరు జాగ్రత్తగా ఉండాలి. లక్ష్మణా! నీవు, సుగ్రీవుడు, జాంబవంతుడు, హనుమంతుడు అంతా కలిసి వెళ్లండి. ఇంద్రజిత్తు మాయలు, యుద్ధతంత్రములు బాగా ఎరిగిన విభీషణుడు, అతని అనుచరులు మీ వెంట ఉంటారు. ఇంద్రజిత్తును సంహరించండి. విజేతలై తిరిగి రండి." అని ఇంద్రజిత్తును చంపడానికి అనుజ్ఞ ఇచ్చాడు రాముడు.

వెంటనే లక్ష్మణుడు తన ధనుర్బాణములు తీసుకున్నాడు. కవచము ధరించాడు. ఖడ్గము నడుముకు బిగించాడు. రాముని పాదాలకు నమస్కరించి ఇలా అన్నాడు. "రామా! నేను నా పదునైన బాణములతో ఇంద్రజిత్తును సంహరిస్తాను." అని పలికాడు. తరువాత ఇంద్రజిత్తు హోమం చేస్తున్న నికుంభిల ఆలయమునకు వెళ్లాడు. సుగ్రీవుడు, జాంబవంతుడు, విభీషణుడు, హనుమంతుడు లక్ష్మణుని వెంట వెళ్లారు. వారి వెంట వేలకొద్దీ వానర సైన్యము అనుసరించింది.

నికుంభిల ఆలయము చుట్టు మోహరించి ఉన్న రాక్షస

సైన్యమును చూచాడు లక్ష్మణుడు. ఎలాగైనా ఆలయమునకు చేరుకోక ముందే లేక హెూమము పూర్తి కాకముందే ఇంద్రజిత్తును చంపడానికి నిశ్చయించుకున్నాడు లక్ష్మణుడు. వానర సేనలు రాక్షస సేనలను ఎదుర్కొన్నాయి.

శ్రీమద్రామాయణము
యుద్ధకాండము ఎనభై ఐదవ సర్గ సంపూర్ణము
ఓం తత్సత్ ఓం తత్సత్ ఓం తత్సత్

యుద్ధకాండము
ఎనభై ఆరవ సర్గ.

విభీషణుడు వానర సేనా నాయకులతో ఇలా అన్నాడు. "రాక్షససేనలు ఇంద్రజిత్తుకు రక్షణ కల్పిస్తున్నారు. మీరు ఎలాగైనా వారు మీతో యుద్ధం చేసేటట్టు రెచ్చగొట్టండి. వారు మీతో యుద్ధం చేస్తున్న సమయంలో మేము ఇంద్రజిత్తును ముట్టడిస్తాము." అని అన్నాడు.

తరువాత లక్ష్మణునితో ఇలా అన్నాడు. "లక్ష్మణా!ఇంద్రజిత్తు సైన్యం మధ్యలో ఉన్నాడు. నీవు నీ యుద్ధవిద్యాకౌశలంలో ఈ సైన్యాన్ని చీల్చుకుంటూ ఇంద్రజిత్తును పట్టుకో. ఇంద్రజిత్తు హెూమం చెయ్యడానికి వెళ్లక ముందే నీవు ఇంద్రజిత్తును సంహరించాలి. ఇంద్రజిత్తును చంపడంలో అధర్మము పాపం లేదు ఎందుకంటే వాడు మాయావి. దుర్మార్గుడు, క్రూరుడు. లోకాలన్నీ వాడిని చూచి భయపడుతున్నాయి. అట్టి వానిని చంపడంలో దోషం లేదు." అని అన్నాడు.

ఆ మాటలు విన్న లక్ష్మణుడు వెంటనే రాక్షస సేనల మీద శరవర్షము కురిపించడం మొదలెట్టాడు. వానర సేనలు భల్లూక సేనలు కూడా వృక్షములతోనూ పెద్ద పెద్ద బండరాళ్లతోనూ రాక్షసులతో యుద్ధం చేస్తున్నారు. రాక్షసులు కూడా ఖడ్గములు, శక్తి ఆయుధములు, తోమరములు ధరించి వానరులతో యుద్ధం చేస్తున్నారు. రాక్షసులకు వానరులకు మధ్య ఘోరమైన యుద్ధం జరుగుతూ ఉంది. ఇరుపక్షముల వారు ఒకరి మీద ఒకరు విసురుకుంటున్న ఆయుధములతో ఆకాశం కప్పబడి పోయిందా అన్నట్టు ఉంది. వానరులు పెద్ద పెద్ద వృక్షములను, కొండ శిలలను చేతులలో ధరించి రాక్షసులను కొట్టి కొట్టి చంపుతున్నారు. తమతో యుద్ధం చేస్తున్న భల్లూకములను, వానరములను చూచి రాక్షసులకు భయం కలిగింది. రాక్షస సేనలు పారిపోసాగాయి.

అప్పటికి ఇంద్రజిత్తు హోమం చెయ్యడానికి కూర్చోబోతున్నాడు. ఇంతలో రాక్షసులు వానరులు, భల్లూకముల ధాటికి తట్టుకోలేక పారిపోతున్నారు అన్న వర్తమానం అందింది. ఇంద్రజిత్తు హోమం ప్రారంభించకుండానే లేచాడు. తన రథము ఎక్కాడు. ధనుర్బాణములు ధరించాడు. వానరుల మీదికి యుద్ధానికి బయలుదేరాడు. తమ నాయకుడు యుద్ధము చేయడానికి వచ్చాడు అని తెలియగానే పారిపోతున్న రాక్షస సేనలు వెనక్కు తిరిగాయి. అమితోత్సాహంతో వానరుల మీదికి దుమికాయి.

అప్పుడు హనుమంతుడు ఒక పెద్ద వృక్షమును పెకలించి దానితో రాక్షసులను చితకబాదుతున్నాడు. హనుమంతుని ధాటికి రాక్షస సైన్యము చనిపోవడమో మూర్ఛపోవడమో జరుగుతూ ఉంది.

ఆ ప్రకారంగా రాక్షస సేనలను చంపుతున్న హనుమంతుని చూచిన రాక్షస సేనలు ఒక్కుమ్మడిగా హనుమంతుని చుట్టు ముట్టాయి. హనుమంతుని మీద శూలములను, ఖడ్గములను, శక్తి ఆయుధములను, పట్టిశములను, పరిఘలు, గదలు, కుంతములు, శతఘ్నులు, ఇనుముతో చేసిన ముద్గరలు, గండ్రగొడ్డళ్లు మొదలగు ఆయుధములను ప్రయోగించారు రాక్షసులు. ఆ ఆయుధముల బారి నుండి తప్పించుకుంటూ హనుమంతుడు చేతికందిన రాక్షసుని అందినట్టు చంపుతున్నాడు.

అలా ముందుకు చొచ్చుకుపోతున్న హనుమంతునికి రథము మీద ఉన్న ఇంద్రజిత్తు కనపడ్డాడు. రాక్షసులను మట్టికరిపిస్తున్న హనుమంతుని చూచాడు ఇంద్రజిత్తు. తన రథమును హనుమంతుని ఉన్నచోటికి పోనిచ్చాడు. ఇంద్రజిత్తు హనుమంతుడు ఎదురు ఎదురుగా వచ్చారు. అప్పుడు ఇంద్రజిత్తు హనుమంతుని మీద బాణములు, ఖడ్గములు, పట్టిశములు, గండ్రగొడ్డళ్లు వర్షంలా కురిపించాడు. ఆ ఆయుధములను లెక్కపెట్టలేదు హనుమంతుడు. ఇంద్రజిత్తును చూచి ఇలా అన్నాడు.

"ఓ రాక్షసాధమా! వీరుడవైతే, చేతనైతే యుద్ధం చెయ్యి. నాముందు నిలబడ్డవాడు ప్రాణాలతో వెనుదిరిగిపోలేడు. రా! నీ రథం దిగిరా. నాతో ద్వంద్వ యుద్ధం చెయ్యి. నా వేగాన్ని తట్టుకొని నిలబడు. వీరుడవు అనిపించుకో!" అని ఇంద్రజిత్తు మీదికి దూకాడు.

అప్పుడు ఇంద్రజిత్తు తన ధనుస్సు ఎత్తి హనుమంతుని మీద దివ్యాస్త్రములను ప్రయోగించడానికి సిద్ధం అయ్యాడు. ఇదంతా దూరం నుండి చూస్తున్న విభీషణుడు లక్ష్మణునితో "లక్ష్మణా! ఇంద్రజిత్తు హనుమంతుని చంపడానికి వెళుతున్నాడు. ఇంద్రజిత్తు మీద నీ వద్ద ఉన్న అస్త్రములను ప్రయోగించు. ఇంద్రజిత్తును అంతమొందించు." అని అన్నాడు.

విభీషణుని మాటలు విన్న లక్ష్మణుడు ఇంద్రజిత్తు మీద దృష్టి సారించాడు.

శ్రీమద్రామాయణము
యుద్ధకాండము ఎనభైఆరవ సర్గ సంపూర్ణము
ఓం తత్సత్ ఓం తత్సత్ ఓం తత్సత్

యుద్ధకాండము
ఎనభై ఏడవ సర్గ.

లక్ష్మణుడు, విభీషణుడు ఇంద్రజిత్తు ఉన్న వైపుకు వెళ్లారు. కాని వారు ఇంద్రజిత్తుతో యుద్ధం చేయలేదు. ఇంద్రజిత్తు హోమం చేయబోయే ప్రదేశమునకు వెళ్లారు. ఆ ప్రదేశము పెద్ద వనము మధ్యలో ఉంది. అక్కడ బాగా విస్తరించిన మర్రిచెట్టును లక్ష్మణునకు చూపాడు విభీషణుడు. "లక్ష్మణా! ఇంద్రజిత్తు యుద్ధానికి బయలుదేరేటప్పుడు అక్కడే భూత బలులు ఇచ్చి యుద్ధమునకు బయలుదేరుతాడు. అప్పటి నుండి ఇంద్రజిత్తు ఎవరికీ కనపడకుండా యుద్ధం చేస్తాడు. అతడు వేసే బాణాలు కనపడతాయి కానీ అతను

కనపడడు. ఇంద్రజిత్తు ఈ మర్రిచెట్టు దగ్గరకు రాక ముందే అతనిని చంపాలి.” అని అన్నాడు విభీషణుడు.

లక్ష్మణుడు తన ధనుస్సును ఎత్తి నారిని సారించి, ఇంద్రజిత్తు కోసరం వేచి ఉన్నాడు. ఇంతలో రథమును ఎక్కి ఖడ్గమును ధరించిన ఇంద్రజిత్తు రావడం కనిపించింది. లక్ష్మణుడు ఇంద్రజిత్తు ముందు నిలబడ్డాడు. “నేను నీతో యుద్ధానికి వచ్చాను. నాతో యుద్ధం చెయ్యి.” అని ఇంద్రజిత్తును యుద్ధానికి ఆహ్వానించాడు.

తాను అక్కడకు వస్తున్నట్టు, హోమం చేస్తున్నట్టు లక్ష్మణునికి ఎలా తెలిసిందా అని ఆశ్చర్యపోయాడు ఇంద్రజిత్తు. ఇంతలో లక్ష్మణుని పక్కనే ఉన్న విభీషణుని చూచాడు. ఇంద్రజిత్తు కోపం మిన్నుముట్టింది. విభీషణుని చూచి ఇలా అన్నాడు.

“ఓ విభీషణా! నీవు రాక్షస కులంలో పుట్టావు. లంకలో పుట్టి పెరిగావు. నా తండ్రికి తమ్ముడివి. నాకు తండ్రితో సమానుడవు. అటువంటి నీవు, నీ కుమారుడనైన నాకే ద్రోహం తలపెట్టడానికి నీకు మనసెలా ఒప్పింది. అయిన వాళ్లను అందరినీ కాదని శత్రువులతో చేతులు కలిపినందుకు నిన్ను చూస్తే నాకు జాలి కలుగుతూ ఉంది. సాటి వాళ్లు నిన్ను ఎన్నటికీ క్షమించరు. నీకు అసలు బుద్ధి లేదు. ఉన్నా అది పనిచేయడం లేదు. లేకపోతే బంధువులకు శత్రువులకు తేడా తెలియదా నీకు! బంధువులను వదిలి శత్రువులతో చేతులు కలిపిన నిన్ను బంధువు అని చెప్పుకోడానికి మనసు రావడం లేదు.

నీ శత్రువులు గుణవంతులే కావచ్చు నీ స్వజనులు నీచులే కావచ్చు. కాని గుణవంతులైన శత్రువులకన్నా గుణములేని స్వజనులే మేలు అని తెలియదా! శత్రువు ఎన్నటికీ శత్రువే అని గుర్తుపెట్టుకో! తన వాళ్లను వదిలి శత్రు పక్షము చేరిన వానిని, అవసరం ఉన్నంతవరకూ ఉపయోగించుకొని, అవసరం తీరగానే ఆ శత్రువులే నిన్ను చంపుతారు. అదే రాజనీతి. ఆ మాత్రం తెలియదా నీకు!

నీకు జాలి, దయ లేదు. అందుకే లక్ష్మణుని ఈ రహస్య ప్రదేశానికి తీసుకొని వచ్చావు. నీవు పౌరుషహీనుడవు. పైగా జ్ఞాతివి. అందుకే ఇంతటి హేయమైన పనికి ఒడిగట్టావు. నీ ముఖం చూడడం కూడా మహాపాపము.” అని అన్నాడు ఇంద్రజిత్తు.

ఆ పరుషమైన మాటలకు విభీషణుడు ఇలా అన్నాడు. “కుమారా! ఎందుకు అలా మితిమీరి మాట్లాడతావు. నా గురించి, నా గుణగణముల గురించి, నా స్వభావము గురించి నీకు తెలియదా! నేను నీ తండ్రి సోదరుడను అన్న గౌరవం కూడా లేకుండా మాట్లాడుతున్నావు. నేను దుర్మార్గపు వంశమైన రాక్షస వంశములో జన్మించాను. కాని మానవులకు సహజంగా ఉండే శీలాన్ని, సుగుణాలను స్వంతం చేసుకున్నాను. రాక్షస గుణములను విడిచిపెట్టాను. రాక్షసులకు స్వభావసిద్ధమైన దారుణమైన పనులు చేయడం నాకు ఇష్టం లేదు. అధర్మంగా ప్రవర్తించడం అసలు నచ్చదు. కేవలం నేను మంచి వాడిని అనే నెపంతో, తానే చేసే చెడ్డ పనులను సమర్ధించలేదనే నెపంతో, నీ తండ్రి నన్ను వెళ్లగొట్టాడు. ఏ అన్న అయినా తమ్ముడిని వెళ్లగొడతాడా! అదీ నా మంచికే జరిగింది. దుర్మార్గులను వదిలి సన్మార్గుల పంచన చేరాను. సుఖంగా ఉన్నాను.

ఇతరుల ధనాన్ని అపహరించేవాళ్లను, ఇతరుల భార్యలను కోరుకొనేవాడిని వెంటనే విడిచిపెట్టమన్నారు పెద్దలు. ఎందుకంటే ఇతరుల ధనాన్ని కోరడం, ఇతరుల భార్యలమీద కోరిక పెంచుకోవడం, మంచి వాళ్లను అనుమానించడం మంచి లక్షణములు కావు. అవి వినాశహేతువులు.

నీవు, నీ తండ్రి, నీ వాళ్లు చేసిన పనులు ఏమిటి! మహర్షులను చంపడం, దేవతలతో విరోధం పెంచుకోవడం, నా కన్నా గొప్పవాడు లేడని అహంకరించడం, అందరితో శత్రుత్వము పెట్టుకోవడం, ఇవే కదా. ఈ దుర్గుణాలే నిన్ను నీ తండ్రిని చెడుమార్గం పట్టించాయి. ఆ మార్గంలో నేను నడవదలచుకోలేదు. అందుకనే బయటకు వచ్చాను. నీవు నీ తండ్రి ఈ లంకానగర నాశనమునకు కంకణం కట్టుకున్నారు అందుకే నా మాట విని సీతను రామునికి ఇవ్వకుండా, యుద్ధానికి పాల్పడ్డారు.

ఓ కుమారా! నీ తండ్రి మాదిరి నీవు కూడా అహంకారివి. మూర్ఖుడవు. నీకు తెలియదు. ఒకరు చెబితే వినవు. నీకు పెద్దల ఎడల గౌరవము వినయము మచ్చుకైనా లేవు. నీకు యమలోకము సందర్శించు కాలము సమీపించినది. అందుకే నీ ఇష్టం వచ్చినట్టు మాట్లాడుతున్నావు.

ఓ ఇంద్రజిత్తూ! నీ వినాశనం దాపురించింది. నీవు ఈ మర్రిచెట్టులో ప్రవేశించలేవు. లక్ష్మణుణ్ణి ఎదిరించలేవు. జయించలేవు. చేతనైతే యుద్ధం చేసి, లక్ష్మణుడి బాణాలకు బలి కా! యమలోకంలో నీవు చేయవలసిన పనులు చాలా ఉన్నాయి. నీ కన్నా ముందు

యమలోకం చేరిన నీ వాళ్లు, నీకోసరం ఎదురు చూస్తున్నారు. త్వరగా వెళ్లు." అని పలికాడు విభీషణుడు.

శ్రీమద్రామాయణము

యుద్ధకాండము

ఎనభైఏడవ సర్గ సంపూర్ణము

ఓం తత్సత్ ఓం తత్సత్ ఓం తత్సత్